అనుదినం... జనస్వరం

www.navatelangana.com

నవతెలంగాణ

శుక్రవారం 17-11-2023

సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 9 సంచిక : 316 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar | 10 పేజీలు + టాబ్లాయిడ్ 12 పేజీలు వెల : 6.50

అప్పటి తెలంగాణ

2014కి ముందు ఎట్లుండే తెలంగాణ

కరువు, కరెంటు కోతలతో దెబ్బతిన్న పత్తి, వరి రైతులు

నవంబరు, 14, 2011, ఈటీవీ

పత్తి, వారి పంటలు రైతులని నిలువునా ముంచేశాయి. వర్షాభావానికి తోలేదు, విద్యుత్ కోతలు అన్నదాతలను కృంగతీసాయి. పంటలు ఎండిపోయెను పెట్టుబడి రాక అప్పుల్లో కూరుకుపోయేటున్నారు. కౌలు రైతుల పరిస్థితి అగమ్యగోచారంగా మారింది.



రాష్ట్రంలో పెరిగిన విద్యుత్ కోత, ఈ రోజు నుంచే అమలు



ఆగష్టు 21, 2012. వన్ ఇండియా తెలుగు

హైదరాబాద్: రాష్ట్రంలో విద్యుత్ కోత మరింత పెరిగింది. విద్యుత్ కో... సమయాలను ప్రభుత్వం మంగళవారం అధికారికంగా ప్రకటించింది... విద్యుత్ కోత సమయాలు మంగళవారం నుంచే అమలులోకి వస్తా...



ఇప్పటి వరకు రాష్ట్రంలో ఉన్న అనధికారిక విద్యుత్ కోతలు ఎప్పటి నుంచి అధికారంగా అమలుకానున్నాయి

జులై 31, 2012. ఈటీవీ

ఇప్పటివరకు రాష్ట్రంలో ఉన్న అనధికార విద్యుత్ కోతలు ఇక మీదట అధికారంగానే అమలు కస్నునాయి. ఎంపీడీసీల్ పరిధిలోని 5 జిల్లాలకు భారీ విద్యుత్ కోత. తెలంగాణలోని 5 జిల్లాలకు భారీ విదుత్ కోత అమలులోకి రానున్నది. వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్, నిజామాబాదు, కరీంనగర్ లో కోతలకు ఆదేశాలు జారీచేశారు.

హైదరాబాద్‌లో కరెంటు కోత

అక్టోబర్ 08, 2013. సాక్షి

రాష్ట్ర విభజనను నిరసిస్తూ సీమాంధ్ర విద్యుత్ ఉద్యోగులు చేస్తున్న సమ్మె ప్రభావం హైదరాబాద్‌పై పడింది. ప్రధాన విద్యుత్ కేంద్రాల్లో ఉత్పత్తి నిలిచిపోవడంతో గ్రేటర్ కోటాకు కోత పడింది. డిమాండ్ కు సరఫరాకు మధ్య భారీ వ్యత్యాసం ఏర్పడటంతో విడతల వారీగా కోర్‌సిటీలో రెండు గంటలు, శివారు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేశారు.

ఆ చీకటి రోజులు మళ్లీ మనకొద్దు







తెలంగాణలో మరింత పెరిగిన విద్యుత్ సంక్షోభం

డిసెంబర్ 09, 2011. ఈటీవీ

చలి కాలం లోను ఏడ పేడ కర్రెంట్ కోతలు తప్పట్లేదు విద్యుత్ వాడుకదారులు పగలు మాత్రమే కోట విధిస్తున్న పంపిణీ సంస్థలు ఇక రాత్రిళ్ళు అందుకు సిద్ధమైనాయి.



ఖరీఫ్ కి కరెంటు కోతలు తప్పేలాలేవు



మళ్లీ కరెంట్ కోతలు

జులై 31, 2013. సాక్షి

కోతల కాలం: వర్షాలు మొహం చాటేయడంతో రాష్ట్రంలో విద్యుత్ వినియోగం భారీగా పెరిగిపోతుంది

జూన్ 26, 2011. టీవీ 5

జలవిద్యుత్ ఉత్పత్తి నిలిచిపోవడంతో డిమాండ్ కు తగ్గ సప్లై చెయ్యలేక ట్రాన్స్కో అధికారులు చేతులు ఎత్తేసారు. అటు ఖరీఫ్ సాగుకు కర్రెంట్ రాక మోటార్లు పనిచేయక రైతాంగం దిక్కుతోచని స్థితి లో ఉన్నారు. కేవలం పల్లెలోనే కాదు పట్టణాలకు కూడా

నయా పాలి'ట్రి'క్స్

ఎన్నికలంటే డబ్బే..

- రొక్కమున్నోడే అభ్యర్థి
- నిధులున్నోడిదే రాజకీయం
- టిక్కెట్ నుంచి పోలింగ్ దాకా
- కాసుల వర్షం..ఓట్లకు గాలం



నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

రాజకీయాలకు అర్థం మారుతున్నది. ప్రజాస్వామ్యం అటకెక్కింది. రాజ్యాంగం అపహాస్యం పాలవుతున్నది. ఎన్నికలంటే ఫక్తు డబ్బే అనేలా సీన్ తయారైంది. రాష్ట్రంలో జరుగుతున్న తాజా అసెంబ్లీ ఎన్నికలు ఇందుకు నిదర్శనం. పోలింగ్‌కు మరో 14 రోజులే ఉంది. ఈ నేపథ్యంలో రాజకీయం ఊసరవెల్లిని తలపిస్తున్నది. కోట్లకు కోట్లు కుమ్మరిస్తున్నారు. గెలుపే ధ్యేయంగా పావులు కదులుతున్నాయి. విలువలకు వలువల్లేకుండా పోతున్నాయి. సాధారణ ప్రజల ఓట్లు పేర కొంటున్నారు.

ప్రజాస్వామ్యానికి ఆయువుపట్టు ఎన్నికలు. అలాంటి ఎన్నికలకు ఇప్పుడు డబ్బే ఇంధనం. టిక్కెట్ ఖరారు నుంచి పోలింగ్ దాకా ప్రతి సందర్భంలోనూ డబ్బు లేకుండా పనికాదు. లేకపోతే ఎన్నికల బండి కదలదు. డబ్బున్నోడే అభ్యర్థి అవుతున్నాడు. నిధులున్నోడిదే రాజకీయం అవుతున్నది. రాజకీయం వ్యాపారమైంది. పెట్టుబడికి ఒక అవకాశంగా మారుతున్నది. రొక్కమున్నోళ్లే అభ్యర్థులవుతున్నారు. కాసులున్నోళ్లే జాబితాల్లో చోటుచేసుకుంటున్నారు. ఆయా పార్టీల క్యాడర్‌ను సంతృప్తి పరచడానికి అడ్డంగా ఎన్నికల నిబంధనలు ఉల్లంఘిస్తున్నారు. జనం కోసమంటూ అక్రమాలకు పాల్పడుతున్నారు. నామినేషన్ల ఉపసంహరణ అనంతరం 119 నియోజవర్గాల్లో 2219 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. రాజకీయ పార్టీలు కాసుల్లేకుండా ఎన్నికల బండిని నడిపే పరిస్థితి లేదు. ప్రధానంగా బీఆర్ఎస్, బీజేపీ, కాంగ్రెస్ రొక్కం చేతపట్టుకుని ఓటర్లతో కబడ్డీ ఆడుతున్నాయి. ఆ గట్టునుంటావా ? ఈ గట్టుకొస్తావా ? అంటూ ఆశ పెడుతున్నాయి. రంగుల లోకంలో విహరింపచేస్తున్నాయి. మద్యం మత్తులో ముంచుతున్నాయి. మొత్తానికి అత్యంత ఖరీదైనవగా మారిన తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలు దేశాన్ని ఆకర్షిస్తున్నాయి. నాడు హుజురాబాద్, దుబ్బాక, మునుగోడు ఉప ఎన్నికల్లో కోట్లకు కోట్లు ఎడాపెడా ఖర్చు పెట్టారు. ఢిల్లీ నిర్వాచన్‌సదన్ ఎన్నికల కోసం ఎన్ని నిబంధనలు పెట్టినా, మరెన్నో మార్గదర్శకాలు విడుదల చేసినా పట్టించుకునేవారే లేరు. ఏజెన్సీలు ఎన్ని ఉన్నా కండ్లకు గంతలు కట్టుకున్నట్టే. అక్కడ ఒక్కో ఓటుకు రూ. ఆరు వేల చొప్పున ఇచ్చిన విషయం ఇంకా మరిచిపోలేదు. రూ. 1000 నుంచి రూ. 1500 కోట్లు ఖర్చుపెట్టినట్టు వివరించారు .

2019లో లోక్‌సభతోపాటు ఆయా రాష్ట్రాల్లో జరిగిన అసెంబ్లీ ఎన్నికలకు రూ 55 వేల కోట్ల నుంచి రూ. 60 వేల కోట్ల వరకు ఖర్చుయినట్టు సెంటర్ ఫర్ మీడియా స్టడీస్ అనే సంస్థ ప్రకటించింది. 1998 నుంచి 2019 మధ్య ఎన్నికల వ్యయం ఆరు రెట్లు పెరిగినట్టు ఆ సంస్థే ప్రకటించింది. నామినేషన్ వేసిన దగ్గర నుంచి ఫలితాల వరకు పక్కాగా లెక్కలు చెప్పాలని ఎన్నికల కమిషన్ చెబుతున్నా, చెవికెక్కించుకున్నవారేవరు? రకరకాల మార్గాల్లో డబ్బు చేతులు మారుతోంది. కాలంతోపాటు ఎన్నికల ప్రాధాన్యత మారుతూ వస్తున్నది. అర్హతలతో పని లేకుండా పోయింది. ఎన్నికల ప్రక్రియ అవినీతి మకిలమైంది. ప్రజాస్వామ్యం ధనస్వామ్యవు తున్నది.ఎమ్మెల్యేకు కనీసం రూ. 50కోట్లు, ఎంపీ కి రూ. 100కోట్లు లేకపోతే ఎన్నికల్లో నిలబడే పరిస్థితి లేదు. ఓటును సరుకుగా మార్చేశారు.

అమ్మడం, కొనడమనే పద్ధతే అంతటా అమల వుతున్నది. డబ్బులేని వారు ఎన్నికల్లో పోటీకి అనర్హులనే భావన దాపురించిందని అసోసియే షన్ ఆఫ్ డెమొక్రటిక్ రిఫార్మ్స్(ఏడీఆర్) అనే సంస్థ వ్యాఖ్యానించింది. ఓటు వజ్రాయుధం అనేది నేడు కేవలం ఒక కోటేషన్‌గా మారి పోవడం దురదృష్టకరం.

ఆడ బిడ్డల కన్నీటిమయం..బీజేపీకి దూరం

మొన్న రమాదేవి..నిన్న తుల ఉమ.. నేడు విజయశాంతి గుడ్‌బై

- రాజీనామా చేసిన రజిని
- దూరంగా ఉంటున్న జీవిత రాజశేఖర్
- పెద్దగా కనిపించని ఇతర మహిళా నేతలు



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

పార్లమెంట్‌లో మహిళా బిల్లు తెచ్చామని ఓవైపు బీజేపీ గొప్పలకు పోతుండగా..మరోవైపు మహిళా నేతలు ఆ పార్టీకి ఒక్కొక్కరుగా దూరమవుతున్నారు. వారు పోతూపోతూ మహిళలకు ఆ పార్టీలో గౌరవం లేదని దుమ్మెత్తిపోస్తున్నారు. ఇది బీజేపీకి ఇబ్బందికరంగా మారింది. గత ఎన్నికల్లో ముదోల్ నియోజకవర్గం నుంచి బీజేపీ అభ్యర్థిగా రమాదేవి పోటీచేశారు. రెండో స్థానంలో నిలిచిన ఆమెకు 40,602 ఓట్లు లభించాయి. ఆమె నిర్మల్ జిల్లా బీజేపీ అధ్యక్షులుగా కూడా పనిచేశారు.

ఈసారీ తనకే ఆ నియోజకవర్గం నుంచి టికెట్ లభిస్తుందని ఆమె ఆశించారు. కానీ, బీజేపీ అధిష్టానం ఆమెకు టికెట్‌ను నిరాకరించింది. ఇన్నేండ్లు పార్టీకోసం కష్టపడ్డ తనకు సీటు ఇవ్వకపోవడంతో ఆ పార్టీపై దుమ్మెత్తి పోస్తూ రాజీనామా చేశారు. మీడియా ముందే బాధను తట్టుకోలేక ఏడ్చేశారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా జెడ్పీ చైర్‌పర్సన్‌గా తుల ఉమ పనిచేశారు. టీఆర్ ఎస్‌లో మహిళా విభాగం అధ్యక్షులుగా బాధ్యతలు నిర్వర్తించారు. బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్ కౌన్సిలర్‌గా గెలిచేనాటికే ఆమె జిల్లా రాజకీయాల్లో కీలక నేత. ఆ తర్వాత ఈటల రాజేందర్‌తో పాటు ఆమె కూడా బీజేపీలో చేరారు. పార్టీలో చేరే సమయంలో వేములవాడ సీటు కావాలని కూడా స్పష్టంగా పార్టీకి చెప్పారు. గొల్లకురుమ సామాజిక తరగతిలో పట్టున్న మహిళా నేతగా కూడా ఆమె గుర్తింపు పొందారు. అన్ని విధాలుగా పరిశీలించిన తర్వాతనే ఆమెను బీజేపీ అధిష్టానం వేములవాడ అభ్యర్థిగా ప్రకటించింది.

కానీ, ఆ పార్టీలోని అంతర్గత కుమ్ములాటలు, జాతీయ నాయకత్వంపై కీలక నేతల ఒత్తిడితో ఆమెకు బీం ఫాం ఇవ్వకుండా బీజేపీ ఘోరంగా అవమానించింది. ఈ విషయంలో తుల ఉమ కూడా కన్నీరు పెట్టారు. పార్టీకి గుడ్‌బై చెప్పేశారు. ఇక కంటోన్మెంట్‌లో బీజేపీ నుంచి రజిని టికెట్ ఆశించారు. కానీ, ఆ పార్టీ అనూహ్యంగా చివరి విడతలో కాంగ్రెస్ పార్టీ నుంచి వచ్చిన గణేశ్ నారాయణ్‌కు కేటాయించింది. దీనిపై రజిని కంట కన్నీరు పెడుతూ తీవ్రస్థాయిలో ఆరోపణలు చేశారు. పార్టీ కోసం కష్టపడ్డ తమను నాయకులు నట్టేట ముంచారనీ, టికెట్ అమ్ముకున్నారని దుమ్మెత్తిపోశారు.

మొదటి నుంచీ అసంతృప్తిలోనే విజయశాంతి

కాంగ్రెస్ నుంచి మూడేండ్ల కింద బీజేపీలో చేరిన విజయశాంతి రెండేండ్ల నుంచి అసంతృప్తితో రగిలిపోతున్నారు. బండి సంజయ్‌ని అధ్యక్ష స్థానం నుంచి మార్చిన తర్వాత అది మరింత తీవ్రమైంది. పార్టీ తన సేవలను వాడుకుంటలేదని ఆమె బాహాటంగానే విమర్శలు ఎక్కుపెట్టింది. నేతల తీరుపై పరోక్షంగా ఎక్స్(ట్విట్టర్)లో తన వ్యతిరేక గళాన్ని వినిపించారు. రాష్ట్ర కార్యవర్గ సమావేశానికీ డుమ్మాకొట్టారు. ప్రధాని మోడీ, హోంమంత్రి అమిత్‌షా, జాతీయ అధ్యక్షులు నడ్డా సభలకూ హాజరు కాలేదు. అయినా, ఆమెను జాతీయనాయకత్వం విస్మరిస్తూనే వచ్చింది. స్టార్ క్యాంపెయినర్ల జాబితాలో ఆమె పేరే చేర్చలేదు. దీంతో మరింత ఆగ్రహానికి గురైన ఆమె ఆ పార్టీకి గుడ్‌బై చెప్పేశారు. జూబ్లీహిల్స్ టికెట్ ఇవ్వకపోవడంతో సినీనటి జీవిత రాజశేఖర్ కూడా ఆ పార్టీపై తీవ్ర అసంతృప్తితో దూరంగా ఉంటున్నారు. ఆ పార్టీలోని మహిళా నేతలు ప్రచార పర్వంలోనూ పెద్దగా కనిపించడం లేదు. స్టార్ క్యాంపెయినర్‌గా రాష్ట్రమంతటా ప్రచారం చేయాల్సిన బీజేపీ జాతీయ ఉపాధ్యక్షులు డీకే అరుణ కూడా అంతగా కనిపించడం లేదు. అసలు ప్రాధాన్యత లేని, ఓడిపోయే చోట మహిళా అభ్యర్థులను ప్రకటించారనే విమర్శ బీజేపీపై ఉంది. 'ఆడబిడ్డల కన్నీరు ఇంటికి మంచిదికాదు. వారిని ఏడ్పిస్తే అంతా చెడు జరుగుతుంది. అత్యంత ఆధ్యాత్మిక చింతనతో పనిచేస్తున్నామనే బీజేపీ తీరు నష్టానికే తప్ప మంచికి కాదు' అని మహిళా నేతలు బాహాటంగానే అంటున్నారు.

ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌ను అరెస్టు చేయొద్దు

పోలీసులకు హైకోర్టు ఆదేశం

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

బహుజన్ సమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు ఆర్.ఎస్ ప్రవీణ్ కుమార్‌కు హైకోర్టులో ఊరట లభించింది. కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్ నుంచి ఎన్నికల బరిలో నిలిచిన ఆయన ఈ నెల 12 న కాగజ్ నగర్ పట్టణంలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తుండగా బీఎస్పీ, బీఆర్ఎస్ శ్రేణుల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. ఈ ఘర్షణలో ఎమ్మెల్యే కోనేరు కోనప్ప అనుచరుని ఫిర్యాదు మేరకు ఆయనతో సహా 16 మందిపై హత్యాయత్నంతో పాటు దొంగతనం కేసు నమోదు చేశారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యే కోనేరు కోనప్పకు జిల్లా ఎస్పీ అనుకూలంగా వ్యవహరిస్తూ బీఎస్పీ ర్యాలీలకు పర్మిషన్ల పేరుతో అడుగడుగునా పోలీసులు అడ్డంకులు సృష్టించడంతో కాగజ్ నగర్ పోలీస్ స్టేషన్ ముందు పార్టీ శ్రేణులతో కలిసి ప్రవీణ్‌కుమార్ అర్ధరాత్రి బైఠాయించి నిరసన తెలిపారు. అక్రమ కేసులపై హైకోర్టులో క్వాష్ పిటీషన్ దాఖలు చేయగా గురువారం ప్రవీణ్ కుమార్‌ను అరెస్టు చేయవద్దంటూ హైకోర్టు పోలీసులను ఆదేశించింది.

అనుదినం... జనస్వరం
www.navatelangana.com
నవతెలంగాణ
శుక్రవారం 17-11-2023
సమగ్ర తెలుగు దినపత్రిక
సంపుటి : 9 సంచిక : 316
Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar
10 పేజీలు + టాబ్లాయిడ్ 12 పేజీలు వెల : 6.50

ఫైనల్లో ఆసీస్



వివరాలు 8లో..



ఓటు వజ్రాయుధం..

పార్టీల చరిత్ర చూసి ఓటేయండి..3 గంటలిస్తే పొలం పారుద్దా.!

- ధరణి పోతే భూములాగమైతయి
- కాంగ్రెసోళ్లు చెప్పేవన్నీ అబద్ధాలే..
- ఈ సారి మోడీకి మెజార్టీ రాదు.. కేంద్రంలో సంకీర్ణ ప్రభుత్వమే
- మతపిచ్చి లేపే బీజేపీని పాతరేయాలి : సీఎం కేసీఆర్

నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి/ ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి/డిచ్‌పల్లి

కేసీఆర్‌కేం పనిలేదు. 24 గంటల కరెంటిస్తుండు వేస్ట్ అంటున్న కాంగ్రెసోళ్లు చెప్పినట్టు 3 గంటల కరెంటిస్తే పొలం పారుద్దా..? 10 హెచ్‌పీ మోటార్లు యాడదేవాలి. ధరణీ తీసేస్తే భూములాగమైతయి. భూమిపై హక్కు పోతది. వీఆర్‌ఏలు, రెవెన్యూ వాళ్ల ...6లో

ఎన్నికల బరిలో
2290 మంది..
పోటీ నుంచి వైదొలిగిన 608 మంది అభ్యర్థులు

- 12 స్థానాల్లో ఉపసంహరణల్లేవ్
- 14చోట్ల 30మందికి పైగా పోటీ
- ఎల్బీనగర్‌లో అత్యధికంగా 48 మంది
- బాన్సువాడ, నారాయణ పేటలో అత్యల్పంగా ఏడుగురు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో నామినేషన్ల ఉపసంహరణ అనంతరం 2,290 మంది అభ్యర్థులు బరిలో మిగిలారు. . పరిశీలన తర్వాత పోటీలో నిలిచిన 2898 మంది అభ్యర్థులకు గాను 608 మంది పోటీ నుంచి వైదొలిగారు.. సీఎం కేసీఆర్ పోటీ చేస్తున్న గజ్వేల్ నియోజకవర్గంలో నామినేషన్ల దాఖలుతో పాటు ఉపసంహరణలు కూడా అత్యధికంగా నమోదయ్యాయి. 114 నామినేషన్లకు గాను 70 మంది ఉపసంహరించుకోగా 44 మంది అభ్యర్థులు బరిలో మిగిలారు. సీఎం పోటీ చేస్తున్న మరో నియోజక వర్గమైన కామారెడ్డిలో 58 మంది...9లో

కేసీఆర్‌కు బుద్ధి చెప్పాలి

పేదల రక్తం తాగేందుకే మల్లారెడ్డికి కాలేజీల అనుమతి : రేవంత్



నవతెలంగాణ- మేడ్చల్

హామీలు నెరవేర్చని సీఎం కేసీఆర్‌కు ప్రజలు ఓటుతో గుణపాఠం చెప్పాలని టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి అన్నారు. వచ్చే ఎన్నికలు జాతీయ రాజకీయాలను సైతం ప్రభావితం చేస్తాయని తెలిపారు. గురువారం మేడ్చల్ పట్టణంలోని వివేకానంద విగ్రహం వద్ద నిర్వహించిన మీటింగ్‌కు రేవంత్ హాజరై మాట్లాడారు. మేడ్చల్ ఎమ్మెల్యే అభ్యర్థి తోటకూర వజ్రేష్ యాదవ్‌ను అధిక మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను కోరారు. తెలంగాణ వచ్చాక దళితుడిని ముఖ్యమంత్రి చేస్తానని చెప్పి మోసం చేశారని గుర్తుచేశారు. దళితులకు మూడు ఎకరాల భూమి, ఇంటికో ఉద్యోగం, పేదలకు డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు, మైనార్టీలకు, గిరిజనులకు 12శాతం రిజర్వేషన్లు, కేజీ టూ పీజీ ఉచిత నిర్బంధ విద్య వంటి ఎన్నో హామీలను ఇచ్చి నట్టేట ముంచారన్నారు. ఇప్పుడు ఏకంగా మూడోసారి ముఖ్యమంత్రి కావడానికి ప్రయత్నిస్తున్నారన్నారు. మంత్రి మల్లారెడ్డికి 30 ఇంజనీరింగ్ కాలేజీలు, మూడు మెడికల్ కాలేజీలు, ఒక యూనివర్సిటీ అనుమతులు ఇచ్చారని, కానీ పేద విద్యార్థులు చదువుకోవడానికి మేడ్చల్‌కు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయలేదని చెప్పారు. పేద ప్రజలు చదువుకుంటే ప్రభుత్వాన్ని ప్రశ్నించి...9లో

తగ్గిన క్యాంపస్ నియామకాలు

ప్రయివేటు ఇంజినీరింగ్ కాలేజీల్లో 50-70% తగ్గుదల



న్యూఢిల్లీ : దేశంలోని ప్రయివేటు ఇంజినీరింగ్ కళాశాలలు, విశ్వవిద్యాలయాల్లో క్యాంపస్ నియామకాలు గణనీయంగా తగ్గిపోతున్నాయి. నియామకాల్లో 50 శాతం నుంచి 70 శాతం వరకూ తగ్గుదల కన్పిస్తోంది. ఐటీ రంగంలో కంపెనీలు ఆర్థికపరమైన సవాళ్లను ఎదుర్కోవడమే దీనికి కారణం. అనేక విద్యా సంస్థలు తమ ప్రణాళికలపై పునరాలోచన చేస్తున్నాయి. కొన్ని సంస్థలు వేచి చూసే ధోరణిని అవలంబిస్తున్నాయి. క్లయింట్ల నుండి రాబడి అధికంగా ఉండడంతో గతంలో ఐటీ కంపెనీలు గత రెండేళ్లలో ఫ్రెషర్లను బాగానే నియమించాయి. అయితే ఇప్పుడు పరిస్థితి మారింది. క్లయింట్ల నుంచి బిల్లుల చెల్లింపు ఆలస్యమవుతోంది. దీంతో కంపెనీలు ఉద్యోగాల్లో కోత పెడుతున్నాయి. ఐటీలోనే కాకుండా ఆటోమొబైల్స్, ఏరోనాటిక్స్, బయోటెక్నాలజీ, బయోమెడికల్...9లో

నేడు రెండు రాష్ట్రాల్లో పోలింగ్

- మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ ఎన్నికల నిర్వహణకు సర్వం సిద్ధం



వివరాలు 6లో..

నిజాయితీకి పట్టం కట్టండి



ప్రజాసమస్యలపై పోరాడే సీపీఐ(ఎం) అభ్యర్థులను గెలిపించండి

- సీపీఐ సోదరులు, వామపక్ష శక్తులు మద్దతివ్వాలి
- సీపీఐ(ఎం) ఏపీ రాష్ట్ర మాజీ కార్యదర్శి పి.మధు

నవతెలంగాణ-ఖమ్మంరూరల్

ఈనెల 30న జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో నిజాయితీపరులకే పట్టం కట్టాలని, అనునిత్యం ప్రజా సమస్యలపై పోరాడే తమ్మినేనిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఆంధ్రప్రదేశ్ సీపీఐ(ఎం) రాష్ట్ర మాజీ కార్యదర్శి పి.మధు కోరారు. పాలేరు సీపీఐ(ఎం) అభ్యర్థి తమ్మినేని వీరభద్రం విజయాన్ని కాంక్షిస్తూ ఖమ్మంరూరల్ మండలంలోని ఏదులాపురం గ్రామంలో ప్రచారానికి మధు హాజరయ్యారు. ఏదులాపురం, ఆదిత్యనగర్, ఓరుగంటి నగర్, వెంపటి నగర్, సింహాద్రి నగర్, మారుతీ నగర్, ఆటో నగర్, సాయి బృందావనం కాలనీల్లో రోడ్ షో ...9లో



మళ్లీ ముదిరిన వివాదం

వీసీల నియామకంపై తొలగని ప్రతిష్టంభన

సుప్రీంకోర్టును ఆశ్రయించిన స్టాలిన్ ప్రభుత్వం

చెన్నయ్ : తమిళనాడులో స్టాలిన్ నేతృత్వంలోని డీఎంకే ప్రభుత్వానికి, గవర్నర్ ఆర్.ఎన్.రవికి మధ్య ప్రచ్ఛన్న యుద్ధం నడుస్తోంది. శాసనసభ ఆమోదించి పంపిన బిల్లులకు గ్రీన్‌సిగ్నల్ ఇవ్వకుండా గవర్నర్ మోకాలడ్డడమే దీనికి కారణం. గవర్నర్ వైఖరిపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం దేశ అత్యున్నత న్యాయస్థానమైన సుప్రీంకోర్టును ఆశ్రయించింది. ప్రస్తుతం ఈ వ్యవహారంపై కోర్టులో విచారణ జరుగుతోంది. గవర్నర్ల తీరుపై ఆగ్రహంతో ఉన్న పంజాబ్, కేరళ ప్రభుత్వాలు కూడా ఇప్పటికే సుప్రీంను ఆశ్రయించాయి. ఈ పిటిషన్లపై విచారణ సందర్భంగా గవర్నర్ల వ్యవహార శైలిపై న్యాయస్థానం అసంతృప్తి, అసహనం వ్యక్తం చేస్తూ కీలక వ్యాఖ్యలు చేయడం గమనార్హం. తమిళనాడు శాసనసభ ఆమోదించిన 12 బిల్లుల్లో 11 బిల్లులు ...9లో



శాంతి కావాలా.. ఘర్షణ కావాలా..!

నిర్ణయించుకోవాల్సింది మనమే : చైనా నేత జిన్‌పింగ్

- కృత్రిమ మేథస్సుపై సహకారం పెంపునకు బైడెన్ అంగీకారం
- మిలటరీ కమ్యూనికేషన్ పునరుద్ధరణకు సమ్మతి

శాన్‌ఫ్రాన్సిస్కో : శాన్‌ఫ్రాన్సిస్కోకి దక్షిణంగా ఫిలోని ఎస్టేట్‌లో స్థానిక కాలమానం ప్రకారం బుధవారం అమెరికా అధ్యక్షుడు జో బైడెన్‌తో చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ భేటీ అయ్యారు. వ్యూహాత్మక, విస్తృతాంశాలపై, చైనా-అమెరికా సంబంధాలకు సంబంధించి దిశా నిర్దేశం చేయాల్సిన అంశాలపై ఇరువురు నేతలు సమగ్రంగా, కూలంకషంగా చర్చలు జరిపారు. అలాగే ప్రపంచ శాంతి, అభివృద్ధికి సంబంధించిన ప్రధాన అంశాలపై కూడా వారు చర్చించారు. కృత్రిమ మేథస్సుపై సహకారం పెంచుకోవడంతో సహా వివిధ రంగాల్లో చర్చలను, సహకారాన్ని బలోపేతం ...9లో

అత్యవసర సాయం అందించండి

ఎట్టకేలకు తీర్మానాన్ని ఆమోదించిన భద్రతామండలి

ఐక్యరాజ్య సమితి : గత నెల రోజులకు పైగా సాగుతున్న ఇజ్రాయిల్ యుద్ధంపై తీర్మానాన్ని ఆమోదించడంలో నెలకొన్న ప్రతిష్టంభనను ఎట్టకేలకు భద్రతా మండలి అధిగమించగలిగింది. ఎలాంటి ఆటంకం లేకుండా అత్యవసరమైన మానవతా సాయాన్ని బాధితులకు అందించేందుకు ...6లో

న్యూస్‌క్లిక్ కేసులో ఈడీ సమన్లు

- మనీలాండరింగ్ చట్టం కింద నెవిల్లే రాయ్ సింగంకు నోటీసులు 9లో..



పోస్టల్ బ్యాలెట్ ఓట్లు 28,057

- 44,097 మంది దరఖాస్తు
- 16,040 ఓట్లను తిరస్కరించిన ఈసీ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తెలంగాణ ఎన్నికల్లో ఈసారి 28,057 మంది పోస్టల్ బ్యాలెట్ ద్వారా తమ ఓటును వినియోగించుకున్నారు. ఈ మేరకు ఎన్నికల కమిషన్ పోస్టల్ బ్యాలెట్ ఓట్ల గణాంకాలను గురువారం విడుదల చేసింది. మొత్తం 44,097 మంది పోస్టల్ బ్యాలెట్ ఓట్లకు ...9లో



లాల్ సలామ్ కామ్రేడ్..

ఎన్. శంకరయ్యకు కన్నీటి వీడ్కోలు

అంతిమయాత్రలో అశేష జనవాహిని

- సీతారాం ఏచూరి, ప్రకాశ్ కరత్ నివాళి
- ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు



వివరాలు 6లో..

కమ్యూనిస్టుల పోరాటంతోనే

పోరాట విజయాలు

ఆదివాసీ గిరిజనులకు పోడుపట్టాలు



సమరశీల ఉద్యమాల్లో ముందున్న సీపీఐ(ఎం)

- పలుమార్లు సీఎం, మంత్రులు, అధికారులకు వినతి
- రోడ్ల దిగ్బంధనంతో దిగొచ్చిన ప్రభుత్వం
- 1.51 లక్షల మందికి 4.06 లక్షల ఎకరాల పంపిణీ
- ఆ భూములకు రైతుబంధు, ఉచిత విద్యుత్ వర్తింపు

వివరాలు 5లో..

గెలిచావా? ఓడావా? అనే దానికంటే అసలు యుద్ధం చేశావా? లేదా? అనేది ముఖ్యమన్నాడు 'చే'. అవి చట్టసభల ఎన్నికలైనా, ప్రజాక్షేత్రంలో ఉద్యమాలైనా యుద్ధానికి వెనుకాడని యోధులు కమ్యూనిస్టులు. గెలుపోటములకు అతీతంగా ప్రజాకంటకులను, వారికి వత్తాసు పలికే ప్రభుత్వాలను, వాటి ప్రజా వ్యతిరేక విధానాలను నిరంతరం ప్రతిఘటించేది, ప్రజా పోరాటాలను నిర్మించేది కమ్యూనిస్టులే. అలాంటి పోరాటాల సారథిగా సీపీఐ (ఎం)ది విరామమెరుగని కృషి. గత ఐదేండ్ల కాలంలో రాష్ట్రంలోని పేదలు, సామాన్యులు, కార్మికులు, కర్షకుల గెలుపు కోసం సీపీఐ (ఎం), దాని అనుబంధ సంఘాలు నికరంగా పోరాడాయి. ఆ పోరాటాలు ఇంకా సాగుతూనే ఉన్నాయి. అందులో విజయాలూ ఉన్నాయి. నవతెలంగాణ ఆ 'పోరాట విజయాలను' నేటి నుంచి మీకందిస్తోంది.

నవతెలంగాణ

తన అజ్ఞానాన్ని తెలుసుకోవడమే నిజమైన జ్ఞానం - డా॥ సర్వేపల్లి రాధాకృష్ణన్

శుక్రవారం 17 నవంబర్ 2023
www.navatelangana.com

సంపాదకీయం

నిరుపయోగ తీర్మానం

గాజాపై ఇజ్రాయిల్ మారణకాండ ప్రారంభమైన నలభై రోజుల తరువాత తొలిసారిగా ఐక్యరాజ్య సమితి భద్రతా మండలి మానవతా పూర్వక కోణంలో దాడులను ఆపాలని యూదు దురహంకారులను కోరుతూ 12-0 ఓట్లతో వేడుకోలు తీర్మానాన్ని ఆమోదించింది.అనేక దఫాల చర్చల అనంతరం మాల్టా ప్రతిపాదించిన ఈ తీర్మానంలో హమస్‌ను ఖండించ లేదు గనుక తాము బహిష్కరించినట్లు అమెరికా, బ్రిటన్ ప్రకటించాయి. ఇజ్రాయెల్‌ను డిమాండ్ చేయకుండా వేడుకోవటం ఏమిటంటూ రష్యా నిరసనతో ఓటింగ్‌కు దూరంగా ఉంది. ప్రపంచంలో లక్షలాది మంది ప్రతి రోజూ ఏదో ఓ మూల నిరసన తెలుపుతున్నా, ఐరాస సాధారణ అసెంబ్లీ తీర్మానం చేసినా పెడచెవిన పెట్టిన ఇజ్రాయిల్ ఈ తీర్మానాన్ని మన్నిస్తుందా! వెనక్కు తగ్గుతుందా ? గాజాలోని ప్రధాన ఆసుపత్రి కింద నేలమాళిగల్లో దాక్కున్న హమస్ తీవ్రవాదులను పట్టుకొనే పేరుతో మొత్తం ఆసుపత్రినే పనికి రాకుండా చేసిన ఇజ్రాయిల్ మిలిటరీ అక్కడ ఎంతమంది తీవ్రవాదులను పట్టుకున్నదీ చెప్పకుండా ఆయుధాలను కనుగొన్నామంటూ లోకాన్ని నమ్మింపచేసేందుకు కొన్ని 'సిత్రాలను' చూపుతున్నది. ఇలాంటి ఫేక్ వీడియోలు ఎక్కడైనా తయారు చేయవచ్చు, తాన అంటే తందాన అనే బిబిసి లాంటి టీవీలు అవి నిజమే అంటూ ప్రపంచాన్ని నమ్మించేందుకు నానా గడ్డీ కరవవచ్చు తప్ప లోకజ్ఞానంతో ఆలోచించే వారెవరూ నమ్మరు. నివాస ప్రాంతాలు, జనాన్ని మానవ కవచాలుగా వాడుకుంటున్న ఉగ్రవాదులు అంటూ ప్రపంచాన్ని తప్పుదారి పట్టించేందుకు పెద్దఎత్తున ప్రచారం సాగుతున్నది.



గాజా ప్రాంతంలో సొరంగాలు ఉన్న అంశం కొత్తేమీ కాదు. వాటిపైన ఆసుపత్రులు, స్కూళ్లు, నివాసాలు, ఫ్యాక్టరీలు అన్నీ ఉన్నాయి. యూదు దురాక్రమణను ఎదిరించేందుకు పాలస్తీనా పోరాట యోధులు హమాస్ ఆవిర్భవించక ముందు కొన్ని దశాబ్దాల క్రితమే ఏర్పాటు చేసుకున్నారు. అవి వారి పోరుబాటలో విడదీయలేనివిగా మారాయి. అక్కడేమీ అడవులు, ఎడారులు లేవు. అక్కడే నివాసాలు, అవే పోరాట కేంద్రాలు. అక్కడ పుట్టి పెరిగే ప్రతి బిడ్డా అక్షరాభ్యాసంతో పాటు పోరుబాట పాఠాలు కూడా నేర్చుకోక తప్పని స్థితిని సామ్రాజ్యా వాదులు, వారి బంటుగా ఉన్న ఇజ్రాయిల్ కల్పించిన కఠిన సత్యాన్ని ఎవరూ విస్మరించకూడదు. నిత్యం ఎప్పుడేమౌతుందో ఇజ్రాయిల్ పోలీసు, మిలిటరీ, యూదు ఉగ్రవాదులు ఎప్పుడు దాడులు చేస్తారో తెలియని స్థితిలో కార్చటానికి కన్నీళ్లు కూడా లేకుండా దశాబ్దాల తరబడి పెరిగారు, అక్కడే మట్టిలో కలిశారు. ఇప్పుడు ఈజిప్టు నేతలు అమెరికా చంకనెక్కి ఇజ్రాయెల్‌తో సఖ్యంగా ఉంటున్నారు తప్ప గతంలో అధికారంలో ఉన్నవారి ప్రోత్సాహం, సాయంతోనే పాలస్తీనా వారు సొరంగాలను ఏర్పాటు చేసుకున్నారు. ఇజ్రాయెల్‌తో ఒప్పందం కుదిరిన తరువాత తమ భూభాగంలో ఉన్న వాటిని ఈజిప్టు కొన్నింటిని కూల్చివేసి, మూసివేసి, గోడలు కట్టి పాలస్తీనియన్లను రాకుండా కట్టడి చేసింది.

నెలరోజులకు పైగా టాంకులు, క్షిపణులతో ఒక్కో ఆసుపత్రిని ధ్వంస చేస్తున్న పూర్వరంగంలో ఒకవేళ నిజంగానే తీవ్రవాదులు ఎవరైనా ఆ సొరంగాల్లో ఉంటారా, ఇజ్రాయిల్, పశ్చిమదేశాల మీడియాలో చూపేందుకు ఆయుధాలను అక్కడే వదలి వెళతారా? 1967 యుద్ధంలో ఈజిప్టు రక్షణలో ఉన్న గాజా ప్రాంతాన్ని ఇజ్రాయెల్ ఆక్రమించింది. ఓస్లో ఒప్పందాల్లో భాగంగా 1993లో పాలస్తీనా అథారిటీకి వాటిని అప్పగించినట్లు ప్రకటించినప్పటికీ 2005లో మాత్రమే సైన్యాన్ని, అక్కడ నివాసాలు ఏర్పాటు చేసి ప్రవేశ పెట్టిన యూదు పౌరులను వెనక్కు తీసుకుంది. ఆ తరువాత కూడా ఈజిప్టు పాలకులతో చేతులు కలిపి గాజాను దిగ్బంధం చేసింది, హమస్ తీవ్రవాదులను అణచేపేరుతో అనేక సార్లు గాజా మీద దాడులు చేసి వేలాది మందిని బలి తీసుకుంది. తాజాగా అదే సాకుతో చేస్తున్న దాడులు మరింత దుర్మార్గంగా ఉన్నాయి, ఆసుపత్రు లను కూడా వదల్లేదు. భద్రతా మండలి తీర్మానం భాషలో తొలుత కాల్పుల విరమణ పాటించాలనే డిమాండ్‌ను పెట్టగా తరువాత దాన్ని తొలగించి పిలుపు అనే పదాన్ని చేర్చారంటేనే దాన్ని ఇజ్రాయిల్ దయా దాక్షిణ్యాలకు వదలిపెట్టారన్నది స్పష్టం. కాదని తలాయిస్తే మీద చర్యలు తీసుకొనేందుకు ఎలాంటి ప్రతి పాదనలూ దానిలో లేవు. గతంలో బాల్కన్ నుంచి సిరియా వరకు అనేక సందర్భాల్లో ఇలాంటి వాటిని ఆమోదించారు. వాటిని పట్టించుకున్న వారుగాని, ఎలాంటి ఫలితంగాని లేదు. సరిగ్గా ఈ తీర్మానం ఆమోదిస్తున్న తరుణంలోనే గాజాలో పోరు తరువాత బలమైన మిలిటరీ శక్తిని అక్కడ ఉంచుతాం అని ఇజ్రాయిల్ అధ్యక్షుడు ఇసాక్ హెర్జోగ్ చెప్పాడు. ఇదే సమయంలో గాజాను ఆక్రమించటం పెద్ద తప్పిదం అవుతుందని స్పష్టం చేసినట్లు అమెరికా అధినేత జోబైడెన్ కొత్త పల్లవి అందుకొని నాటకంలో మరో అంకానికి తెరలేపాడు.

ఓస్లో ఒప్పం దాల్లో భాగంగా 1993లో పాలస్తీనా అథారిటీకి వాటిని అప్పగించినట్లు ప్రకటించినప్పటికీ 2005లో మాత్రమే సైన్యాన్ని, అక్కడ నివాసాలు ఏర్పాటు చేసి ప్రవేశపెట్టిన యూదు పౌరులను వెనక్కు తీసుకుంది. ఆ తరువాత కూడా ఈజిప్టు పాలకులతో చేతులు కలిపి గాజాను దిగ్బంధం చేసింది, హమస్ తీవ్రవాదులను అణచేపేరుతో అనేక సార్లు గాజా మీద దాడులు చేసి వేలాది మందిని బలి తీసుకుంది. తాజాగా అదే సాకుతో చేస్తున్న దాడులు మరింత దుర్మార్గంగా ఉన్నాయి, ఆసుపత్రులను కూడా వదల్లేదు.

'ఎవల్యూషన్ డే'ని మనం తప్పక జరుపుకోవాలి!

ఇంగ్లీషు నేచరలిస్ట్ ఛార్లెస్ డార్విన్ తన జీవ పరిణామ సిద్ధాంతాన్ని (ON THE ORIGIN OF SPECIES) ప్రకటించిన రోజు 24 నవంబర్ 1859- ఈ ఆధునిక వైజ్ఞానిక కాలానికి ఆ సిద్ధాంతం ఎంత ముఖ్యమో గ్రహించడానికి, ఆ శాస్త్రవేత్త మీద ఉన్న గౌరవం ప్రకటించుకోవడానికి 24 నవంబర్‌ను 'ఎవల్యూషన్ డే'గా ప్రపంచ దేశాలన్నీ జరుపుకుంటున్నాయి. దీన్ని పెద్దఎత్తున మన దేశంలో కూడా జరపడం చాలా అవసరం. ఎందుకంటే వైజ్ఞానిక దృక్పథం దేశంలో బలపడాలని చెప్పిన భారత తొలి ప్రధాని నెహ్రూ స్థాయిని తగ్గించాలని ప్రయత్నిస్తున్న - ప్రస్తుత కేంద్ర ప్రభుత్వ చర్యల్ని తిప్పికొట్టడానికి సామాన్య ప్రజలు వివేకవంతులై ఇలాంటి వైజ్ఞానిక కార్యక్రమాల్లో పాల్గొనడం తప్పనిసరి! జీవ పరిణామ సిద్ధాంతం(THEORY OF EVOLOUTION) పనికిరానిదని ప్రభుత్వం- సిలబస్ నుండి తొలగిస్తోంది. భారత రాజ్యాంగం స్థానంలో మనుస్మృతిని ప్రవేశపెడతామంటోంది. ఇలాంటి వాటిని అడ్డుకోవాలంటే, ప్రగతిశీల భావాలు గల వారంతా వైజ్ఞానిక కార్యక్రమాలు పెద్ద ఎత్తున జరుపుకోవాలి.



డాక్టర్ దేవరాజు మహారాజు

చంద్రయాన్ - 3 విజయవంతమైందని, అందుకు కారణం తనే అన్నట్టు అనవసరంగా అసందర్భంగా ఆన్‌లైన్‌లో దేశ ప్రజలకు కనబడి, భారతీయ మువ్వన్నెల జెండా ఊపిన నేటి ప్రధాని మోడి చేసిన నిర్వాకం ఈ దేశ ప్రజలు గ్రహించాలి. ఇస్రో శాస్త్రవేత్తల జీతాల్లో కోతలు విధించడం గురించి - ఇస్రోకు ముడి సరుకు అందించిన వేల మంది సాంకేతిక నిపుణులకు, కార్మికులకు జీతాలివ్వక పోవడం గురించి - ఈ దేశ ప్రజలు తెలుసుకోవాలి. వారంతా పొట్ట పోసుకోవడానికి రోడ్లమీద టీలు, టిఫిన్లు అమ్ముకోవడం, బయట మెకానిక్‌లుగా, డ్రైవర్లుగా పని చేయడం గురించి - ఈ దేశ ప్రజలు తెలుసుకోవాలి.

1909లో డార్విన్ శతజయంతి, అర్ధ శత వర్ధంతి. సందర్భంగా నూటా అరవై ఏడు దేశాల నుండి నాలుగు వందల మంది ప్రముఖ శాస్త్రవేత్తలందరూ కేంబ్రిడ్జిలో సమావేశమై పెద్దఎత్తున డార్విన్‌కు నివాళులర్పించారు. ఆయన జీవశాస్త్రంలో చేసిన కృషిని శ్లాఘించారు. సామాన్య జనంలో డార్విన్ గూర్చి అవగాహన పెరగడానికి ఆయన పరిణామ సిద్ధాంతాన్ని వారికి పరిచయం చేశారు.

న్యూయార్క్ అకాడెమీ ఆఫ్ సైన్సెస్ - అమెరికన్ మ్యూజియం ఆఫ్ నేచురల్ హిస్టరీలోనూ, రాయల్ సొసయిటీ ఆఫ్ న్యూజిల్యాండ్‌లోనూ, జరిపిన కార్యక్రమాలకు అనూహ్యంగా పెద్దఎత్తున జనం హాజరయ్యారు.

యూనివర్సిటీ ఆఫ్ చికాగోలో నవంబర్ 24-28 మధ్య డార్విన్ - శతజయంతి ఉత్సవాలు ఘనంగా జరిపారు.

2009లో 'బిబిసి డార్విన్ సీజన్' శీర్షికతో బిబిసి టెలివిజన్/ రేడియో కార్యక్రమాలు నిర్వహించింది. ఎందుకంటే అది డార్విన్ ద్విశత జయంతి పైగా, డార్విన్ పరిణామ సిద్ధాంతం వెలువడి 150 ఏళ్లయింది. ఇలా ప్రపంచ దేశాల్లో జరిగిన, జరుగుతున్న కార్యక్రమాలు చాలానే ఉన్నాయి. ఇలాంటివి మన దేశంలో ఎన్ని జరిగాయి? అనేది ఆలోచించుకోవాలి!

ఈ విషయాల్లో మన దేశ పరిస్థితులు మరీ దిగదుడుపుగా ఉన్నాయి. మత పరమైన పండుగలకు స్కూళ్లు, కాలేజీలు, ఆఫీసులకు సెలవులిస్తూ అర్థరహితమైన పండుగల్ని ప్రభుత్వాలు ప్రమోట్ చేస్తున్నాయి. కుటుంబాలలో జరిగే పూజలు, పునస్కారాలు, ఆచారాలు, సంప్రదాయాల వల్ల యువతరం మెదళ్లు కలుషితం అవుతున్నాయి. దేవుళ్ల శోభాయాత్రల పేరుతో అసాంఘిక కార్యక్రమాలకు అవకాశం దొరుకుతోంది. వివేకవంతమైన, అర్థవంతమైన వైజ్ఞానిక కార్యక్రమాలు విద్యాసంస్థల్లో గానీ, పౌర సమాజాల్లో గానీ కుటుంబాల్లో గానీ ఏ ఒక్కటైనా నిర్వహిస్తున్నారా? లేదు కదా? అందుకే ఉపాధ్యాయులు, అధ్యాపకులు, సైన్సు కార్యకర్తలు, బాధ్యతగల పౌరులు, వివేకవంతమైన అధికారులు, మరీ ముఖ్యంగా మహిళలు పూనుకుని - దేశంలో కొనసాగుతున్న విషమ పరిస్థితులను అర్థం చేసుకుని, ఎక్కడికక్కడ ఎవరికివారు వైజ్ఞానిక దృక్పథాన్ని పెంపొందించే కార్యక్రమాలకు రూపకల్పన చేసుకోవాలి. ఉట్టి ఆలోచనలతో పని జరగదు. వాటిని ఆచరణలో పెట్టాలి. విద్యాసంస్థల్లో పనిచేసే వారిపై బాధ్యత మరింతగా ఉంది. విద్యార్థులకు జీవ పరిణామంపై, డార్విన్‌పై, సందర్భాన్ని బట్టి ఇంకా అనేక వైజ్ఞానిక అంశాలపై వ్యాస రచన/ ఉపన్యాస పోటీలు పెడుతూ వారిలో వైజ్ఞానిక జిజ్ఞాస పెంచాలి. భావిభారత పౌరులు వారే గనక, మనం వారి మీదే శ్రద్ధపెట్టాలి. వారిని హేతుబద్ధంగా ఆలోచింపజేయాలి. మానవ వాదులుగా తీర్చి దిద్దుకోవాలి. చేస్తున్న కార్యక్రమాలతో మనం మరొకరికి స్ఫూర్తినిస్తూ ఉండాలి!

సైన్స్ డే (28,ఫిబ్రవరి), పర్యావరణ పరిరక్షణ దినం (5 జూన్), డార్విన్ డే (12 ఫిబ్రవరి), ఎవల్యూషన్ డే (24 నవంబర్), కైండ్‌నెస్ డే (13 నవంబర్), హ్యూమనిస్ట్ డే (21 జూన్), ఎర్త్ డే (24 ఏప్రిల్), సైంటిఫిక్ టెంపర్ డే (20 ఆగష్టు), ఫిలాసఫీడే (నవంబరులో మూడో గురువారం), వుమెన్స్ డే (8 మార్చి), చిల్డ్రన్స్ డే (14 నవంబర్) వంటివి విద్యాసంస్థల్లో తప్పక నిర్వహిస్తూ ఉండాలి. విద్యార్థుల అవగాహన, స్థాయి పెంచడానికి ఆయా విషయాలు ఇతివృత్తంగా పలు కార్యక్రమాలకు రూపకల్పన చేయాలి. వీటితో పాటు సంవిధాన్ దివస్ (CONSTITUTION DAY 26 నవంబర్) కూడా తప్పక జరుపుతూ ఉండాలి. ప్రస్తుతం మతాల కున్న ప్రాముఖ్యాన్ని తగ్గించి, వైజ్ఞానిక దృక్పథం, హేతు వాదం, మానవవాదం నిత్య జీవితంలో భాగమైపొయ్యే ట్లుగా చేస్తూ ఉండాలి.

ఎవరి వ్యక్తిగత విశ్వాసాలనో దెబ్బతీయాలని మనం అనుకోవడం లేదు. అవి వాటి పరిధిలో అవి ఉంటే సంతోషిద్దాం - అంతే! మత విశ్వాసాలెప్పుడూ వ్యక్తిగత స్థాయిలో ఉండాలి. అంతేగాని, వికృతంగా సమాజ స్వరూపాన్ని మార్చేంత దుర్మార్గంగా ఉండకూడదు. అయితే, మత విశ్వాసకులతో ప్రపంచం ప్రగతి పథాన నడవలేదని మాత్రం ఖచ్చితంగా చెబుదాం! మనుషులంతా ఒక్కటి అని తెలుసుకున్న వాళ్లం గనుక, విశ్వాసకుల్ని, అవిశ్వాసకుల్ని అందరినీ సమానంగా గౌరవిస్తాం. అయితే విశ్వాసకులు తమ అంధ విశ్వాసాన్ని వదిలేసి మానవవాదులుగా మారితే వారిని మరింతగా గౌరవిస్తాం... సైన్సు కార్యకర్తలంతా ఆ పనుల్లో అవిశ్రాంతంగా పని చేస్తూనే ఉండాలి.


చంద్రయాన్ - 3 విజయవంతమైందని, అందుకు కారణం తనే అన్నట్టు అనవసరంగా అసందర్భంగా ఆన్‌లైన్‌లో దేశ ప్రజలకు కనబడి, భారతీయ మువ్వన్నెల జెండా ఊపిన నేటి ప్రధాని మోడి చేసిన నిర్వాకం ఈ దేశ ప్రజలు గ్రహించాలి. ఇస్రో శాస్త్రవేత్తల జీతాల్లో కోతలు విధించడం గురించి - ఇస్రోకు ముడి సరుకు అందించిన వేల మంది సాంకేతిక నిపుణులకు, కార్మికులకు జీతాలివ్వక పోవడం గురించి - ఈ దేశ ప్రజలు తెలుసుకోవాలి. వారంతా పొట్ట పోసుకోవడానికి రోడ్ల మీద టీలు, టిఫిన్లు అమ్ముకోవడం, బయట మెకానిక్‌లుగా, డ్రైవర్లుగా పని చేయడం గురించి - ఈ దేశ ప్రజలు తెలుసుకోవాలి. ఇస్రో శాస్త్రవేత్తల కృషిని శ్లాఘించకుండా, దాన్ని తన ఎలక్షన్ ఎజెండాలో చేర్చుకోవడం గురించి - ఈ దేశ ప్రజలు తెలుసుకోవాలి. పైగా, పురాతన భారతీయ విమానయాన శాస్త్రంలో ఇవన్నీ రాసిపెట్టే ఉన్నాయని అబద్ధాలు ప్రచారం చేసుకుంటూ ఉండడం గురించి - ఈ దేశ ప్రజలు తప్పక తెలుసుకోవాలి. ఇది నేటి శాస్త్రవేత్తల కృషిని స్థాయిని తగ్గించినట్లుగా ఉందన్న విషయం తెలుసుకుని ఈ దేశ ప్రజలు కలత చెందాలి! ఈ అంశాల గూర్చి సీరియస్‌గా ఆలోచించాలి, అర్థం చేసుకోవాలి. ఈ విషమ పరిస్థితుల్లోంచి బయటపడే మార్గాల్ని అన్వేషించుకోవాలి.

రాబోయే కాలాలలో విద్యావంతులతో ముఖ్యంగా వైజ్ఞానిక పిపాస గల వివేకవంతులతో ప్రభుత్వాల్ని ఏర్పాటు చేసుకునే విధంగా చూసుకోవాలి. ఇటీవల కర్నాటకలో ప్రజా సంఘాలు నిర్వహించిన పాత్రను ఆదర్శంగా తీసుకుని, ఇతర రాష్ట్రాలలో కూడా ప్రజా - సామాజిక - విద్య - వైజ్ఞానిక సంఘాలు చైతన్యవంతంగా కదలాలి. తప్పదు - దేశం వేల ఏండ్లు వెనక్కి వెళ్లాలంటే ఎవరూ ఏమీ చేయనక్కరలేదు. ఇప్పుడున్న కేంద్ర ప్రభుత్వం ఆ పని సజావుగా చేస్తూనే ఉంది. లేదు - దేశం ప్రగతి పథాన నడవాలంటే మాత్రం దేశ పౌరులందరూ సమైక్యంగా కదలాలి. ఆ మాట నేను అంటున్నది కాదు సుప్రీంకోర్టు చీఫ్ జస్టిసే అలా చెప్పారు. ప్రజలు పెద్దఎత్తున రోడ్ల మీదికి రావాలని చెప్పారు. అంతేకాదు, తను ప్రజల వెంటే ఉన్నానని కూడా ధైర్యం చెప్పారు.

'నిన్ను నువ్వు తెలుసుకో' - అని లేని దేవుణ్ణి ధ్యానిస్తూ కళ్లు మూసుకోవడం కాదు. నువ్వెవరు? ఎన్ని పరిణామాలు జరిగి, నువ్వు ఇలా మారావు- అన్నది తెలుసుకుంటే - నీ కళ్లు తెరుచుకుంటాయి! ఎన్నెన్ని మానవ

ఎక్కడి పాట అక్కడ పాడడం. అధికారం కోసం నానా గడ్డి కరవడం రాజకీయ నాయకులకు అలవాటు. శాస్త్రవేత్తలు అలా చేయరు. ఒక నిబద్ధతతో, నిజాయుతీగా, నిజాల్ని మాత్రమే వెల్లడిస్తారు. అలాంటి వారిలో మహోన్నతుడు చార్లెస్ డార్విన్! ఆయన మతాలకున్న విలువను తగ్గించాలనుకోలేదు. మూఢ నమ్మకాల్ని నిర్మూలించ గలననీ కూడా అనుకోలేదు. ఆయన ప్రతిపాదించిన సిద్ధాంతమే కాలక్రమంలో ఆ పనులు చేస్తూ వచ్చింది. అందుకే సంప్రదాయ వాదులకు డార్విన్ అన్నా, డార్విన్ సిద్ధాంతమన్నా పడదు. వారు సృష్టి/దైవ సిద్ధాంతం కావాలను కుంటారు. ప్రస్తుతం కేంద్రంలో అధికారంలో ఉన్నవారి పాలసీ కూడా అదే!

జాతులు ఉద్భవించి అంతరించాయి. ఎన్ని వలసల తర్వాత నీ జాతి ఇప్పుడు నువ్వున్న ప్రాంతానికి చేరింది వంటి విషయాలు క్షుణ్ణంగా తెలుసుకోవాలంటే, తప్పదు - జీవ పరిణామం గురించి పూర్తిగా తెలుసుకోవాలి. ఆ భగవంతుడి సృష్టిలో నీ పుట్టుక ఒక భాగమని నువ్వింకా భావిస్తూ ఉంటే గనక, నీ మెదడ్లో చీకటి తొలగిపోలేదని అర్థం. చీకట్లోనే జీవితం బాగుందనుకునే వారితో మనకు పేచీ లేదు. జీవితంలో వెలుగులు కావాలనుకునే వారు తప్పక వైజ్ఞానిక స్పృహ పెంచుకుంటారు. జీవ పరిణామం గురించి తెలుసుకుంటారు. మత మౌఢ్యాన్ని చావుదెబ్బ తీసిన డార్విన్ పరిణామ సిద్ధాంతం వెలువడిన ఆ రోజును గుర్తు చేసుకుంటారు. ప్రతి సంవత్సరం 'ఎవల్యూషన్ డే' జరుపుకుంటారు.



ఎక్కడి పాట అక్కడ పాడడం, అధికారం కోసం నానా గడ్డి కరవడం రాజకీయ నాయకులకు అలవాటు. శాస్త్రవేత్తలు అలా చేయరు. ఒక నిబద్ధతతో, నిజాయుతీగా, నిజాల్ని మాత్రమే వెల్లడిస్తారు. అలాంటి వారిలో మహోన్నతుడు చార్లెస్ డార్విన్! ఆయన మతాలకున్న విలువను తగ్గించాలనుకోలేదు. మూఢ నమ్మకాల్ని నిర్మూలించ గలననీ కూడా అనుకోలేదు. ఆయన ప్రతిపాదించిన సిద్ధాంతమే కాలక్రమంలో ఆ పనులు చేస్తూ వచ్చింది. అందుకే సంప్రదాయ వాదులకు డార్విన్ అన్నా, డార్విన్ సిద్ధాంతమన్నా పడదు. వారు సృష్టి/ దైవ సిద్ధాంతం కావాలనుకుంటారు. ప్రస్తుతం కేంద్రంలో అధికారంలో ఉన్నవారి పాలసీ కూడా అదే! సిలబస్ నుండి 'ఎవల్యూషన్' ఛాప్టర్ తొలగిస్తున్నారని తెలియగానే, హైద్రా బాదులో పెద్దపెద్ద విద్యాసంస్థల్లో జేవీవీ వారు ఎవల్యూషన్ మీద నా లెక్చర్స్ ఏర్పాటు చేశారు. నేను కూడా సంతోషంగా వెళ్లి ఉపన్యసించి వచ్చాను. సిలబస్ నుండి తీసివేయగానే పిల్లలు ఇక ఏ రకంగానూ నేర్చుకోలేరన్న భ్రమలో ప్రభుత్వం వారుంటే- ఉండని వ్వండి. బాధ్యత గల పౌరులుగా మన పిల్లలకు మనం, ఏం నేర్పుకోవాలో మనకు తెలుసు కదా? ప్రభుత్వాలు తాత్కాలికం - వైజ్ఞానిక స్పృహే శాశ్వతం! అందువల్ల మనం, వీలైనన్ని ఎక్కువగా వైజ్ఞానిక కార్యక్రమాలు అన్ని స్థాయిల్లో నిర్వహించుకుంటూనే ఉండాలి.

(నవంబర్ 24 'ఎవల్యూషన్‌డే')

- సుప్రసిద్ధ సాహితీవేత్త, విశ్రాంత బయాలజీ ప్రొఫెసర్ (మెల్బోర్న్ నుంచి)

శిష్యుడు - గురువుగారు .. గురువు గారు .. ఈ యుద్ధాలు ఆగవా?

గురువు - యుద్ధాలు ఆగవా? అని ప్రశ్నించేముందు యుద్ధాలు ఎందుకు పుడతాయో కూడా తెలుసుకోవాలి.

శి - ఎందుకేమిటి? ఎవడి స్వార్థం వాడిది.

గు - బాగా చెప్పావ్. అందుకే యుద్ధం ఒకటే అయినా రెండు విధాలుగా కన్పిస్తుంది. పరస్పర శత్రువులే కావచ్చు. లేదా వైరి పక్షాలు కావచ్చు. ఒకరు ఆధిపత్యం - ఆక్రమణ కోసం యుద్ధం చేస్తే

మరొకరు విముక్తి - ఆత్మరక్షణ కోసం యుద్ధం చేస్తారు. మానవ సమాజ పరిణామం నాయనా ఇది. పరస్పర విరుద్ధ శక్తుల సంఘర్షణలోనే చరిత పురుడు పోసుకుంటుందని మార్క్స్ మహనీయుడు చెప్పాడుగా.


శి - కొంచెం శాంతంగా వివరించండి.

గు - 'లవకుశ' సినిమా చూడలేదూ. త్రేతా యుగం రామాయణ కాలంనాటి నుండి ఉన్నదిదే. శ్రీరామ చంద్రుడు అశ్వమేధయాగం చేసి, గుర్రాన్ని దేశంపైకి పంపుతాడు గుర్రంపై ఉత్తరం రాసి ఉంటుంది. 'చేతనైతే ఈ గుర్రాన్ని బంధించి, శ్రీరామచంద్రుడ్ని యుద్ధంలో జయించండి. లేదా గుర్రం సంచరించినంత వరకు ఆ భూభాగమంతా రామరాజ్యపరం అవుతుంది. ఆ ప్రాంతంలో నివసించే వారంతా శ్రీ రాముని ఏలుబడిలోకి వస్తారు' అని. లవకుశలు ఆ ఉత్తరం చూసి తమకు ఇష్టంలేక గుర్రాన్ని బంధించి యుద్ధానికి సిద్ధం అంటారు. శ్రీరాముడిది భూ ఆక్రమణ యుద్ధమైతే, లవకుశలది స్వాభిమాన యుద్ధం. యుద్ధం ఒకటే దృక్పథాలు వేరు.



కె. శాంతారావు
9959745723

శాంతి చైతన్యం విరబూయాలి



శి - మరిప్పుడు ఈ నేపథ్యంలో మనం యుద్ధాలను ఎలా అర్థం చేసుకోవాలి?

గు - కాలం మారింది. మారుతూనే ఉంటుంది. కాని నియంతల క్రూర స్వభావం మారటంలేదు. వారు చెప్పిందే శాసనం చేసేదే పాలన అని వారు భావిస్తున్నారు. ఎవ్వరి మాటలు వినరు. వారి పాలనలో ప్రజలు నలిగి పోతున్నా పట్టించుకోరు .కళ్లప్పగించి చోద్యం చూస్తుంటారు. ఎదురు తిరిగితే మరణ శిక్ష లేదా జైలు శిక్ష అని ప్రజలకు తెలుసు. ఉదాహరణకు ఒక దేశానికి ఓ నియంత ప్రస్తుతం పాలకుడైతే కావచ్చు. కానీ కచ్చితంగా అతడు ఆ దేశ మూలవాసుడని చెప్పలేం. ఎందుకంటే అతని తాతాముత్తాతలు ఎప్పుడో ఒకప్పుడు ఈ లక్షల సంవత్సరాల్లో ఆ ప్రాంతానికి వలస వచ్చి ఉంటారు. ఆక్రమణల ద్వారా కావచ్చు లేదా పొట్టకూడి కోసమైనా కావచ్చు. ఈ సమాజ పరిణామ సోయి ఉండాలి.

శి - నిజం చెప్పారు ఇజ్రాయిల్ - పాలస్తీనా యుద్ధాన్ని ఈ దృష్టి కోణంతోనే మనం చూడాలి. అవునా?

గు - అవును. దేశమే లేని యూదులకు పాలస్తీనా ప్రజలు ఆదరించి తమ భూమిపై ఆశ్రమం ఇచ్చారు. అమెరికా బ్రిటన్ సామ్రాజ్యవాద దేశాల అండతో ఐక్యరాజ్య సమితిచే ఆ భూభాగాన్ని ఇజ్రాయిల్ దేశంగా వారు ప్రకటించుకున్నారు. ఆ సామ్రాజ్యవాద దేశాల సోపతి మరిగిన ఇజ్రాయిల్ నేతలు చీటికి మాటికి పాలస్తీనా ప్రజలపై సాయుధ దాడులు చేస్తూ, మిగిలిన పాలస్తీనా భూభాగాన్ని ఆక్రమించడం ప్రారంభించారు. రకరకాల పద్ధతుల్లో వారిని హింసించారు. 'కర్ర ఉన్నోడిదే బర్రె' అన్న సామెతలా ఆయుధ బలగంతో పాలస్తీనా ప్రజలను లొంగదీసుకోవాలని చూసారు. స్వాభిమానులకు ఇది మింగుడు పడలేదు. దశాబ్దాలు గడుస్తున్నా ఇజ్రాయిల్ నేతల ఆధిపత్యం అంతం కావడం లేదు. బతికినంత కాలం ఇలా బానిసల్లా, జీవచ్ఛవాల్లా బతకాల్సిందేనా? దానికన్నా చావే నయం అనే తెగింపు వచ్చింది కొందరికి. మన కోసం మన పిల్లల భవిష్యత్ కోసం అవసరమైతే ప్రాణత్యాగం చేద్దాం అనే నిర్ణయానికి వచ్చారు వారు.

శి - వారినే కదా 'హమాస్' ఉగ్రవాదులు అంటున్నారు.

గు - ఎవరెలా పిలిస్తే వారికేమి? పాలస్తీనా ప్రజలకు మాత్రం వారు రక్షకులు. 'మన నేలను, మన ప్రజలను విముక్తి గావించాలంటే దుర్మార్గులపై మనమూ గెరిల్లా (ఆకస్మిక) దాడులకు దిగక తప్పదు' అనే భావనతో పథకాలు రచించారు. ఆయుధాలు సమకూర్చుకున్నారు. ఎన్నో ప్రయత్నాలు చేసారు.

శి - ఏదీ.. మన అల్లూరి సీతారామరాజు, కొమరం భీమ్ లాగానా?

గు - ఆ... ఆ... చివరకు ఆ నియంతకు చెందిన అధికార తైనాతీ గణాన్ని బంధీలుగా అపహరించి (కిడ్నాప్) తీసుకువస్తే తప్ప ఆ నియంత కళ్ళు తెరిపించలేమనే దృఢ నిర్ణయానికి వచ్చారు. ఈ కీలక పథకాన్ని గతనెల 7న పకడ్బందీగా అమలు జరిపారు. వాయు-జల-భూమార్గాలపై ఏక కాలంలో ముప్పేట దాడి చేసి ఎవ్వరూ ఊహించని విధంగా 200 మందిని బంధీలుగా పట్టుకు పోయారు. ఈ దాడి పట్ల ఇజ్రాయిల్ నేత నెతన్యాహునే కాదు యావత్ ప్రపంచమే నివ్వెరపోయింది. ఇకిప్పుడు ఆ నియంతకు ఉడుకు మోతు తనం, ఆగ్రహం, కసి అన్ని కలగలసి కట్టలు తెంచుకుని వచ్చాయి. పాలస్తీనా ప్రజానీకంపై విచక్షణా రహిత బాంబు దాడులకు వడిగడ్తున్నాడు. ప్రజల ఆవాసాలపైనే కాకుండా శరాణార్థుల శిబిరాలపై. ఆస్పత్రులపై సైతం సైన్యంచే బాంబులు కురిపిస్తున్నాడు. పసిపిల్లలను కూడా హతమారుస్తున్నాడు. మృతుల సంఖ్య ఇప్పటికి 11 వేలకు దాటింది.

శి - ఇప్పుడు ఆ నియంతకు బుద్ధి చెప్పేవారేలేరా?

గు - ఇంతకు ముందే చెప్పానుగా దొంగలు దొంగలు ఊళ్ళు పంచుకున్నట్టు నియంతలు నియంతలు కూడబలుక్కుంటారు. ఈ సామ్రాజ్యవాద నేతలకు ఆయుధ ఫ్యాక్టరీలు దండిగా ఉంటాయి. ఉత్పత్తి చేసిన ఆయుధాలు అమ్ముకోవాలంటే ప్రపంచంలో ఎప్పుడూ ఏదో ఒక మూల యుద్ధాలు జరగాల్సిందే. ఒకవేళ యుద్ధాలు లేకున్నా వారి లాభాలకోసం యుద్ధాలను సృష్టిస్తూనే ఉంటారు. సామ్రాజ్యవాద పెట్టుబడి దారీ స్వభావమే అంత. లెనిన్ మహాశయుడు దానిని కనిపెట్టాడు. అందుకే పైకి ఎంత నంగనాచి మాటలు మాట్లాడినా, అంతిమంగా ఆయుధాలు, అమ్ముకునేందుకే యుద్ధాలను ఎగదోస్తూ ఉంటారు. అమెరికా సామ్రాజ్యవాదానిది ఈ యుద్ధోన్మాదంలో పెద్దన్న పాత్ర. రష్యా - ఉక్రెయిన్ యుద్ధంలోనైనా, ఇజ్రాయిల్ - పాలస్తీనా యుద్ధంలోనైనా ఇదే తంతును మనం గమనించవచ్చు.

శి - మరైతే దీనికి విరుగుడేమిటి?

గు - ప్రపంచం ఇప్పుడు రెండుగా చీలిపోయింది. ఆయుధాలను ఉత్పత్తి చేస్తూ ఇతర దేశాలను, భూభాగాలను ఆక్రమిస్తూ యుద్ధాలను సృష్టిస్తూ ప్రజలను ఆధిపత్య నిరంకుశ పాలనతో లొంగదీసుకునేవాళ్ళు ఒక పక్క. తమకోసం, తమపిల్లల కోసం అవసరమైతే ఎంతకైనా తెగించి ప్రాణ త్యాగం చేసేవారు మరో పక్క. కొందరు ఇదేదో ఆంబోతుల పోట్లాటగా పైపైన చూస్తుంటారు. మధ్యలో లేగదూడల్లా ప్రజలు బలైపోతున్నట్టు పెడబొబ్బలు పెడ్తుంటారు. ఆధిపత్యం కోసం పోరాడేవారిని విముక్తి కోసం పోరాడేవారికి ఒకే గాటిన కట్టడం సరికాదు. దృష్టిలోపమే అవుతుంది. రాజ్యం - వీరభోజ్యం అన్నది పురాణ కాలంనాటి పాత మాట. ఇప్పుడిది ఆధునిక ప్రజాస్వామ్యశకం. ప్రజలు నిత్యం శాంతిని స్వేచ్ఛను కోరుకుంటారు. ఇజ్రాయిల్ నేతల యుద్ధ దుర్మార్గాలకు వ్యతిరేకంగా ఆ దేశ ప్రజలు కూడా వీధుల్లోకి వస్తున్నారు. ఇటీవల లండన్‌లో ముందెన్నడూ లేని విధంగా దాదాపు పది లక్షల మంది ప్రజానీకం యుద్ధం వద్దంటూ జాతిమతాలకు అతీతంగా భుజం భుజం కలిపి కదం తొక్కారు. ఇలా శాంతి చైతన్యం ఎక్కడి కక్కడ విరబూయాలి. ఈ రోజు కాకపోయినా రేపైనా నియంతలు, యుద్ధోన్మాదులు తోకముడవాల్సిందే. ఇదే ప్రకృతి ధర్మం విరుగుడు.

సామ్రాజ్యవాదాన్ని వ్యతిరేకించడం కమ్యూనిస్టుల ప్రథమ కర్తవ్యం

(నిన్నటి తరువాయి....)


చాలా కాలం క్రితం,హిందూత్వ పితామహుడు వీ.డీ. సావర్కర్, 1950లో ఇజ్రాయిల్‌ను ప్రశంసించి, వారి పొరు గునున్న ముస్లింలతో వారెలా వ్యవహరిస్తున్నారో మనం వారి నుంచి నేర్చుకోవాలన్నాడు.అంటే జియోనిస్టులు, హిందూత్వ శక్తులు భావజాల పరంగా ఒకే విధంగా ఉన్న ట్లు తెలుసుకున్నారు. బీజేపీ నాయకత్వంలోని వాజ్ పాయ్ ప్రభుత్వం అధికారం చేపట్టినప్పుడు వాషింగ్టన్,టెల్-అవీవ్, ఢిల్లీల మధ్య ఉన్న అక్షాన్ని గ్రహించారు. వాజ్ పాయ్‌కి ప్రధాన కార్యదర్శి మరియు జాతీయ భద్రతా సలహాదారైన బ్రిజేష్ మిశ్రా అమెరికా వెళ్లి,యూదు మహా సభను ఉద్దేశించి ప్రసంగిస్తూ,భవిష్యత్తులో మనకు భారత్ -అమెరికా- ఇజ్రాయిల్ అక్షం ఉంటుందని ప్రకటించాడు. భారతదేశానికి, ఇజ్రాయిల్ భారీగా మిలిటరీ సామాగ్రిని సమకూర్చే పెద్ద సరఫరాదారుగా మారిందని మనకు తెలుసు.అది, భారత్ కు అన్ని గూఢచార వ్యవస్థ పరికరాల్ని సరఫరా చేస్తుంది. ఇజ్రాయిల్ సమకూర్చిన పెగాసస్ సాంకేతతను, మన ఫోన్లకు హాని కల్గించేందుకు ఉపయోగిస్తున్నారని విన్నాం. కాశ్మీర్ లో, ఇప్పుడే కాదు, గత 20 ఏళ్ళుగా కాశ్మీర్ ప్రజలపై నిఘా ఉంచేందుకు వినియోగించే సాంకేతికతలన్నీ ఇజ్రాయిల్ నుండి తెచ్చినవే.

కాబట్టి కమ్యూనిస్ట్ మ్యానిఫెస్టో మనకేమి నేర్పింది?

ప్రపంచ వ్యాప్తంగా మనం సామ్రాజ్యవాదంపై పోరాడాలి, దాన్ని వ్యతిరేకించాలి, సామ్రాజ్యవాదం వల్ల బాధ పడుతున్న వారికి సంఘీభావాన్ని తెలియజేయాలి. అందుకే, మన జాతీయ విముక్తి పోరాట కాలంలో ఇజ్రాయిల్ వ్యాపారం మొత్తం పాలస్తీనియన్ల ఖర్చుతో చేసినప్పుడు, రెండో ప్రపంచ యుద్ధం ముగిసిన వెంటనే గాంధీతో సహా జాతీయోద్యమ నాయకత్వం, పాలస్తీనాకిప్పుడు అన్యాయం జరుగుతుందని అన్నారు.పాలస్తీనియన్ల ఖర్చుతో మీరు యూదులకు న్యాయం చేయలేరు. తమ మాతృభూమిని పొందే హక్కు పాలస్తీనియన్లకు ఉంది.అప్పటినుండి అదే మన స్థిరమైన విధానం.

అందువల్ల మోడీ ఏమి చేస్తాడనే దానితో నిమిత్తం లేకుండా పాలస్తీనా ప్రజలకు సంఘీభావాన్ని తెలియజేయడమే మన మొదటి కర్తవ్యం.భారతదేశంలో, ప్రపంచ వ్యాప్తంగా ఉన్న కార్పొరేట్ మీడియా వాస్తవ పరిస్థితిని ప్రతిబింబించడం లేదని మనం అర్థం చేసుకోవాలి. ఇజ్రాయిల్‌కు మాత్రమే మద్దతిచ్చే మీ వైఖరి తప్పు అని తమ ప్రభుత్వాలకు చెప్పే ప్రజలు కూడా అమెరికా, ఐరోపా దేశాల్లో ఉన్నారు. ఇజ్రాయిల్ ఆక్రమణకు, దాడికి పాలస్తీనియన్లు చాలాకాలంగా బాధితులుగా ఉంటున్నారు. తమ మనుగడ, విముక్తి కోసం పోరాటం చేస్తున్న బాధితులు పాల్పడే హింసను, వలసవాదులు మరియు అణచివేతదారులు పాల్పడే హింసతో సమానంగా చూడకూడదని మన బూర్జువా మేధావులకు, మీడియాకు చెప్పాలి. హమాస్ దాడి సమయంలో అమాయక ప్రజలు,ముఖ్యంగా మహిళల్ని, పిల్లల్ని చంపడాన్ని ఖండిస్తూ, బహిరంగంగా విమర్శించాలి. అంటే దానర్థం,గాజాపై చేసిన దుర్మార్గమైన దాడిలో వందలాదిమంది సాధారణ మహిళలు, పిల్లలను చంపడం వంటి దారుణాల పట్ల మనం గుడ్డిగా ఉండాలని కాదు.ఒక పిల్లవాడిపై కాల్పులు జరపడం అనాగరికమనీ, ఒక పిల్లవాడిపై బాంబు విసరడం సరైనదేనని ఎవరైనా చెప్పగలరా? ఈ రెండూ యుద్ధ నేరాలే. కాబట్టి ఆ రెంటినీ ఖండించాలి.

అణచివేతకు గురైనప్పటికీ వలస ప్రజలు స్వాతంత్ర్యం పొందడంలో విజయం సాధించారు. వీరి వలె కాక పాలస్తీనియన్లు, దురదృష్టవంతులుగా అణచివేతకు గురవుతున్నారని మనం గమనించకుంటే, ఈ విషాద వైరుధ్యాన్ని అర్థం చేసుకోలేం. నేను చెప్పినట్లు, పాలస్తీనా పని 20వ శతాబ్దంలో అసంపూర్తిగా మిగిలి ఉంది. 21వ శతాబ్దంలో మనం ఆ దిశగా పని చేయాల్సి ఉంటుంది. ఇజ్రాయిల్‌కు ఉనికిలో ఉండే హక్కుంది. 75 ఏళ్ళుగా ఉనికిలో ఉంటూనే ఉంది. ఇజ్రాయిల్‌కు ఉనికిలో ఉండే హక్కు లేదంటున్న హమాస్ తో కూడా మేము ఏకీభవించం. 1967కు ముందున్న హద్దుల్లో వారిని ఉనికిలో ఉండనివ్వండని మేము అంటు న్నాం.



ప్రకాశ్ కారత్

అణచివేతకు గురైనప్పటికీ వలస ప్రజలు స్వాతంత్ర్యం పొందడంలో విజయం సాధించారు. వీరి వలె కాక పాలస్తీనియన్లు, దురదృష్టవంతులుగా అణచివేతకు గురవుతున్నారని మనం గమనించకుంటే, ఈ విషాద వైరుధ్యాన్ని అర్థం చేసుకోలేం. నేను చెప్పినట్లు, పాలస్తీనా పని 20వ శతాబ్దంలో అసంపూర్తిగా మిగిలి ఉంది. 21వ శతాబ్దంలో మనం ఆ దిశగా పని చేయాల్సి ఉంటుంది. ఇజ్రాయిల్‌కు ఉనికిలో ఉండే హక్కుంది. 75 ఏళ్ళుగా ఉనికిలో ఉంటూనే ఉంది. ఇజ్రాయిల్‌కు ఉనికిలో ఉండే హక్కు లేదంటున్న హమాస్‌తో కూడా మేము ఏకీభవించం. 1967కు ముందున్న హద్దుల్లో వారిని ఉనికిలో ఉండనివ్వండని మేము అంటున్నాం. 1967 యుద్ధం తరువాత ఇజ్రాయిల్ ఈ అదనపు భూభాగాలు అన్నిటినీ ఆక్రమించింది. 1967 ముందున్న హద్దులకు తిరిగి వెళ్తే, మిగిలిన ఈ భూభాగాలన్నీ ఎలాంటి అడ్డంకుల్లేకుండా పాలస్తీనా మాతృభూమిగా మారుతాయి అని మేం వారికి చెప్తున్నాం.

నేడు మన దేశంలోని ఆధిపత్య హిందూత్వ కథనం ప్రకారం, ఇలా మాట్లాడుతున్నందుకు మనపై దాడి జరగొచ్చు. తమను వ్యతిరేకిస్తున్న ఎవరినైనా ఈ ప్రభుత్వం ఏదో విధంగా టెర్రరిస్టులని ముద్ర వేస్తుంది. కాశ్మీర్‌లో ప్రతీ ఒక్కరూ టెర్రరిస్టే. ప్రభుత్వాన్ని విమర్శిస్తున్న జర్నలిస్టులు కూడా టెర్రరిస్టులే. కాబట్టి, వారు మనను టెర్రరిజానికి మద్దతుదార్లని ముద్రవేయడం సహజం. అయితే, మనం ఇలాంటి వాటికి నిరుత్సాహపడొద్దు. ఎందుకంటే ఈ పోరాటం మోడీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా జరిగే పోరాటంలో ఓ భాగం. విదేశాంగ విధానం కేవలం దేశీయ విధానం పొడిగింపు మాత్రమే. యూదు రాజ్యాన్ని స్థాపించ ప్రయత్నిస్తున్న ఇజ్రాయిల్ వలె హిందూ రాజ్యాన్ని స్థాపించడానికి మైనారిటీల్ని లక్ష్యంగా చేసుకొని, వారిని రెండవ తరగతి పౌరులుగా మార్చడమే హిందూత్వవాదుల దేశీయ విధానం. కాబట్టి, నేడు మోడీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా చేస్తున్న మన పోరాటం, ప్రజాస్వామ్యం, లౌకికవాదం, సమాఖ్య నిర్మాణం, రాజ్యాంగం, మొత్తంగా ప్రతిపక్షాల ప్రజాస్వామిక హక్కులపై అది చేస్తున్న దాడికి వ్యతిరేకంగా మాత్రమే కాక, ఈ ప్రభుత్వ విదేశాంగ విధానానికి వ్యతిరేకంగా చేస్తున్న పోరాటం కూడా. దానిని ఆపకుంటే, అది నయా ఫాసిజానికి దారితీసే మార్గంలోకి పోతుంది.

ఇదే ఇజ్రాయిల్‌లో జరుగుతుంది. విచిత్రమైన విషయం ఏమంటే, హమాస్ దాడికి ముందు, నెతన్యాహు ప్రభుత్వం ప్రజల నుంచి భారీగా నిరసనలను ఎదుర్కొంటుంది. నెతన్యాహు, న్యాయ వ్యవస్థను అదుపు చేసేందుకు చట్టాల్ని ఆమోదింపచేసుకునే ప్రయత్నం చేస్తున్నాడు. అక్కడ ప్రజలు పెద్ద ఉద్యమాన్ని నిర్మిస్తున్నారు. ఇక్కడ మన భారత ప్రభుత్వం పార్లమెంట్‌తో పాటు మీడియాను, న్యాయ వ్యవస్థను, ప్రతీదాన్ని అదుపు చేయాలని అనుకుంటుంది. ఇప్పటికే మనకు హిందూత్వ నిరంకుశ పాలన ఉంది. మనం అర్థం చేసుకోవాల్సిందే మంటే, దాన్ని నిరోధించకుండా, ప్రతిఘటించకుండా అనుమతిస్తే, అది నయా ఫాసిజం రూపానికి దారితీస్తుంది. మనం మోడీ ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా నిలబడినప్పుడు, దాని విదేశాంగ విధానానికి కూడా వ్యతిరేకంగా నిలబడుతున్నట్లే లెక్క.ఎందుకంటే అమెరికా, బైడెన్‌లు ఇజ్రాయిల్‌లోని ప్రగతి నిరోధక ప్రభుత్వానికి, సామ్రాజ్యవాదానికి మద్దతు ఇచ్చినట్లే, యునైటెడ్ స్టేట్స్ మోడీకి, హిందుత్వవాదులకు పూర్తి మద్దతుగా ఉంటుంది. కాబట్టి, మన పోరాటాలు సమగ్రంగా ఉండాలి. అవి విదేశాంగ, దేశీయ విధానాలకు వ్యతిరేకంగా, భారతదేశ లౌకిక, ప్రజా స్వామిక లక్షణాలను మార్చే అన్ని దాడులకు వ్యతిరేకంగా ఉండాలి.

("పీపుల్స్ డెమోక్రసీ" సౌజన్యంతో)

అనువాదం : బోడపట్ల రవీందర్, 9848412451



స్వచ్ఛభారత్ ఫలితమేది?

ఎంపీలోని గిరిజన ప్రాంతాలలో దారుణం

- మరుగుదొడ్లు ఉన్నా.. లేనట్టే
- నీరు, తలుపులు లేకపోవటంతో నిరుపయోగంగానే
- మలవిసర్జనకు బయటకు వెళ్లాల్సిందే
- ఎస్సీ ప్రాంతాలలోనూ ఇవే పరిస్థితులు
- బీజేపీ డబుల్ ఇంజిన్ సర్కారు పని తీరుపై అసంతృప్తి



భోపాల్: మధ్యప్రదేశ్‌లోని గిరిజన కుగ్రామాల్లో స్వచ్ఛభారత్ మిషన్ పడకేసింది. ఈ కార్యక్రమం కింద పనులు ఆశించినంతగా జరగలేదు. అక్కడి మరుగుదొడ్ల శిథిలావస్థలో ఉన్నాయి. గత ఎనిమిదేండ్లలో బీజేపీ డబుల్ ఇంజిన్ ప్రభుత్వం హయాంలో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వచ్ఛ భారత్ మిషన్-గ్రామీణ్ క్షేత్రస్థాయిలో విఫలమైందని విశ్లేషకులు చెప్తున్నారు.

బహిరంగ మలవిసర్జన లేకుండా, పరిశుభ్రతను సాధించేందుకు 2014, అక్టోబర్ 2న దేశవ్యాప్తంగా ప్రారంభించబడిన పథకం స్వచ్ఛభారత్ మిషన్. ఈ పథకం కింద వ్యక్తిగత గృహ మరుగుదొడ్లు నిర్మించబడ్డాయి. అయితే, మధ్యప్రదేశ్‌లోని గిరిజన ప్రాంతాల్లో చాలా మరుగుదొడ్లకు తలుపులు, సెప్టిక్ ట్యాంకులు లేవు. మిగిలినవి స్వచ్ఛమైన నీరు లేకపోవడంతో నిరుపయోగంగా ఉన్నాయి. మరుగుదొడ్లు ధాన్యాలు, ఇతర వస్తువులను నిల్వ చేయటానికి, జంతువులకు ఆశ్రయం కల్పించటానికి ఉపయోగపడుతున్నాయని ఇక్కడి ప్రజలు తెలిపారు. తెల్లవారుజామున ప్లాస్టిక్ సీసాలు, మగ్‌లతో పురుషులు, చిన్న సమూహాలలో మహిళలు ఎక్కువగా సాయంత్రం తర్వాత లేదా తెల్లవారుజామున మలవిసర్జనకు వెళ్తున్న పరిస్థితులు ఇక్కడ కనిపిస్తున్నాయి.


రాష్ట్రాన్ని అక్టోబర్ 2 నాటికి బహిరంగ మలవిసర్జన రహిత (ఓడీఎఫ్) ప్లస్‌గా ప్రకటిస్తామని ముఖ్యమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ 2018లో ప్రకటించారు. అధికారిక సమాచారం ప్రకారం, 2022 నాటికి 50,279 గ్రామాల్లో 72 లక్షలకు పైగా మరుగుదొడ్లు నిర్మించబడ్డాయి. వాటిలో 49,994 ఓడీఎఫ్ ప్లస్‌గా ప్రకటించబడ్డాయి.

రాష్ట్ర జనాభాలో గిరిజనులు 22 శాతం మంది ఉన్నారు. 89 గిరిజన బ్లాకులలో మరుగుదొడ్ల పరిస్థితి ఆశించినంతగా ఏమీ లేదు. గడిచిన ఎనిమిదేండ్లలో రూ.83,937.72 కోట్లతో 10.9 కోట్ల మరుగుదొడ్లు నిర్మించేందుకు కేంద్రం యోచించింది. అయితే, 2018-19 తర్వాత ఎస్సీ, ఎస్టీల మరుగుదొడ్ల వినియోగంలో ప్రపంచ బ్యాంకు, యేల్ యూనివర్శిటీలోని ఎకనామిక్స్ ఫ్యాకల్టీ రూపొందించిన పరిశోధనా పత్రం ఈ పథకం పురోగతిపై భారీ క్షీణతను చూపింది. "అన్ని సమూహాలకు మరుగుదొడ్ల సాధారణ వినియోగం తగ్గింది. ఎస్సీ, ఎస్టీలో క్షీణత అతిపెద్దది. ఇతర వెనుకబడిన కులాలు, సాధారణ వర్గాలకు 9, 5 శాతం పాయింట్ల క్షీణతతో పోలిస్తే ఎస్సీలకు టాయిలెట్ల సాధారణ వినియోగంలో 20 శాతం తగ్గుదల, ఎస్టీలకు 24 శాతం పాయింట్ల తగ్గుదల ఉన్నది" అని పరిశోధనా పత్రం వివరించింది. దేశవ్యాప్తంగా 2018 నుంచి టాయిలెట్ వాడకంలో అసమాన క్షీణతను చూసిన ఏడు రాష్ట్రాల్లో మధ్యప్రదేశ్ కూడా ఒకటి కావటం గమనార్హం.స్వచ్ఛమైన నీరు అందుబాటులో ఉన్న కొన్ని గిరిజన కుగ్రామాల్లో, టాయిలెట్లు రంగురంగుల చేతితో తయారు చేసిన పెయింటింగ్‌లను కలిగి ఉంటాయి, అయితే అవి స్త్రీలు మరియు బాలికలకు మాత్రమే కేటాయించబడటంతో పురుషులు బహిరంగ మలవిసర్జనకు వెళ్లాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. ఇక రాష్ట్రంలోని మరికొన్ని ప్రాంతాల్లో మరుగుదొడ్ల నిర్మాణాలను కాంట్రాక్టర్లు చాలా చిన్నవిగా నిర్మించటంతో అవి పేరుకు మాత్రమే ఉన్నాయనీ, వినియోగానికి మాత్రం అనుగుణంగా లేవని లబ్దిదారులు వాపోతున్నారు.

రాష్ట్ర జనాభాలో 17 శాతం ఉన్న దళితుల ఆధిపత్యం ఉన్న కుగ్రామాల్లో కూడా ఇదే పరిస్థితి ఉన్నది. "రాష్ట్రంలో 2018 నాటికి ఈ పథకం కింద నిర్మించిన 62 లక్షల మరుగుదొడ్లలో రూ.540 కోట్ల విలువైన 4.5 లక్షల మరుగుదొడ్లు కనిపించకుండా పోయాయి. బేతుల్‌లోని గిరిజన లక్కఢ్జాం పంచాయతీలోని గ్రామస్థులు అప్రమత్తమై పరిపాలనను విచారణ ప్రారంభించాలని ఒత్తిడి చేయడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది" అని కొన్ని కథనాలను చూపిస్తూ అక్కడి ప్రజలు వెల్లడించారు. కొన్నిచోట్ల నిర్మించిన మరుగుదొడ్ల ఫొటోలను సమర్పించిన అధికారులు ప్రాజెక్టుకు కేటాయించిన నిధులను స్వాహా చేసినట్లు విచారణలో తేలింది. కాగా, మధ్యప్రదేశ్‌లో షెడ్యూల్ ప్రకారం రేపు అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న విషయం విదితమే.

సీఎం భూపేష్ బఘేల్ సంపద 45 శాతం పైకి..

- ఐదేండ్లలో ఐదు శాతం పెరిగిన ప్రజాప్రతినిధుల ఆస్తులు
- వివరాలను వెల్లడించిన ఏడీఆర్ నివేదిక



రాయ్‌పూర్ : ఛత్తీస్‌గఢ్ అసెంబ్లీ ఎన్నికల్లో మళ్లీ పోటీ చేస్తున్న సీఎం, ఎమ్మెల్యేల ఆస్తులు 2018తో పోలిస్తే ఐదు శాతం పెరిగి 3.340 శాతానికి చేరుకున్నాయి. ముఖ్యమంత్రి భూపేష్ బఘెల్ ఆస్తులు రూ.10.33 కోట్లు (45 శాతం) పెరిగాయి. ఛత్తీస్‌గఢ్ అసెంబ్లీ ఎన్నికలు 2023లో తిరిగి ఎన్నికల్లో పోటీ చేస్తున్న 66 మంది ఎమ్మెల్యేల స్వీయ అఫిడవిట్‌ల విశ్లేషణ ఆధారంగా అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫార్మ్స్ (ఏడీఆర్) ఛత్తీస్‌గఢ్ ఎలక్షన్ వాచ్ ఈ నివేదికను రూపొందించాయి.ఆ నివేదిక ప్రకారం, తిరిగి ఎన్నికల్లో పోటీ చేస్తున్న 66 మంది ఎమ్మెల్యేలలో 60 మంది ఎమ్మెల్యేల (91 శాతం) ఆస్తులు 5 శాతం నుంచి 3,340 శాతానికి, ఆరుగురు ఎమ్మెల్యేల ఆస్తులు (9 శాతం) పెరిగాయి. మైనస్ 4 శాతం నుంచి మైనస్ 35 శాతానికి పెరిగింది. 2018 సంవత్సరంలో, స్వతంత్రులతో సహా వివిధ పార్టీలు తిరిగి ఎన్నికల్లో పోటీ చేస్తున్న ఈ 66 మంది ఎమ్మెల్యేల సగటు ఆస్తులు రూ. 12.98 కోట్లు, ఇది 2023లో రూ. 13.74 కోట్లు.

66 మంది ఎమ్మెల్యేలు మళ్లీ ఎన్నికల్లో పోటీ

నివేదిక ప్రకారం, "ఛత్తీస్‌గఢ్ అసెంబ్లీ ఎన్నికలు 2018 , 2023 మధ్య ఈ 66 మంది ఎమ్మెల్యేలు తిరిగి పోటీ చేస్తుండగా వారి సగటు ఆస్తి పెరుగుదల రూ. 76.45 (6 శాతం) లక్షలు." తఖత్‌పూర్ అసెంబ్లీ స్థానం నుంచి కాంగ్రెస్ ఎమ్మెల్యే రష్మీ ఆశిష్ సింగ్ ఆస్తులు గరిష్ఠంగా రూ.12.70 కోట్లు, అంటే 2018లో రూ.8.73 కోట్ల నుంచి 2023లో రూ.21.44 కోట్లకు పెరిగాయని ప్రకటించారు.

కాంగ్రెస్ ఎమ్మెల్యేల ఆస్తులు పెంపు

అరంగ్ (ఎస్సీ) అసెంబ్లీ నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ అభ్యర్థి శివకుమార్ దహ్రియా ఆస్తులు రూ.10.99 కోట్లు పెరిగాయి. ఇది 2018లో రూ.2.37 కోట్ల నుంచి 2023లో రూ.13.37 కోట్లకు పెరిగింది. నివేదిక ప్రకారం, పటాన్ అసెంబ్లీ నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ ఎమ్మెల్యే భూపేష్ బఘేల్ ఆస్తులు రూ.10.33 కోట్లు, 2018లో రూ.23.05 కోట్ల నుంచి 2023లో రూ.33.38 కోట్లకు పెరిగాయి. ముఖ్యమంత్రి బఘెల్ సంపద 45 శాతం పెరిగిందని నివేదిక పేర్కొంది.

బెమెతర అసెంబ్లీ స్థానం ఎమ్మెల్యే ఆశిష్ ఛబ్రా ఆస్తులు కూడా రూ.8.15 కోట్లు పెరిగాయి. ఇది 2018లో రూ.6.61 కోట్ల నుంచి రూ.14.76 కోట్లకు పెరిగింది, ఇది 126 శాతం పెరిగింది. ఇదిలా ఉండగా, రాయ్‌పూర్ సిటీ సౌత్ అసెంబ్లీ సీటుకు చెందిన బీజేపీ ఎమ్మెల్యే బ్రిజ్‌మోహన్ అగర్వాల్ ఆస్తులు కూడా రూ.7.35 కోట్లు (72 శాతం), 2018లో రూ.10.14 కోట్ల నుంచి 2023 అసెంబ్లీ ఎన్నికల్లో రూ.17.49 కోట్లకు పెరిగాయి.

3.19 శాతం పెరిగిన 49 మంది ఎమ్మెల్యేల సగటు ఆస్తులు

ఛత్తీస్‌గఢ్‌లో తిరిగి ఎన్నికల్లో పోటీ చేస్తున్న 49 మంది ఎమ్మెల్యేల ఆస్తుల సగటు పెరుగుదల 3.19 శాతంగా నివేదిక పేర్కొంది. 2018లో 49 మంది ఎమ్మెల్యేల సగటు సంపద రూ.15.32 కోట్లు కాగా, ప్రస్తుతం రూ.15.80 కోట్లకు పెరిగి రూ.48.83 లక్షలకు చేరుకుంది. కాగా, ఛత్తీస్‌గఢ్‌లో తిరిగి ఎన్నికల్లో పోటీ చేస్తున్న 12 మంది ఎమ్మెల్యేల సగటు ఆస్తులు 19.05 శాతం పెరిగాయి. 2018లో ఈ 12 మంది ఎమ్మెల్యేల సగటు ఆస్తులు రూ.7.67 కోట్లు కాగా, ఇప్పుడు రూ.1.46 కోట్లతో రూ.9.13 కోట్లకు పెరిగింది. ఛత్తీస్‌గఢ్‌లో మళ్లీ ఎన్నికల్లో పోటీ చేస్తున్న ఇద్దరు బీఎస్పీ ఎమ్మెల్యేల సగటు ఆస్తులు 67.81 శాతం పెరిగాయి. 2018లో ఇద్దరు ఎమ్మెల్యేల సగటు ఆస్తులు రూ.2.04 కోట్లు కాగా, ప్రస్తుతం రూ.1.38 కోట్లతో రూ.3.42 కోట్లకు పెరిగింది.

స్వతంత్ర ఎమ్మెల్యే సంపద కూడా...

ఛత్తీస్‌గఢ్‌లో, జనతా కాంగ్రెస్ ఛత్తీస్‌గఢ్ (జె) నుంచి మళ్లీ ఎన్నికల్లో పోటీ చేస్తున్న ఇద్దరు ఎమ్మెల్యేల సగటు సంపద 49.59 శాతం పెరిగింది. 2018లో ఇద్దరు ఎమ్మెల్యేల సగటు ఆస్తులు రూ.4.77 కోట్లు కాగా, ఇప్పుడు రూ.2.36 కోట్లు పెరిగి రూ.7.14 కోట్లకు చేరుకుంది. ఛత్తీస్‌గఢ్‌లో మళ్లీ ఎన్నికల్లో పోటీ చేస్తున్న స్వతంత్ర ఎమ్మెల్యే ఆస్తుల సగటు పెరుగుదల 256.78 శాతం. 2018లో ఎమ్మెల్యేల సగటు సంపద రూ.57.71 లక్షలు కాగా, ఇప్పుడు రూ.1.48 కోట్లతో రూ.2.05 కోట్లకు పెరిగింది.



ఘాద్రి ఉద్యమ వారసత్వాన్ని కొనసాగిస్తాం

సీపీఐ(ఎం) పొలిట్ బ్యూరో సభ్యులు నిలోత్పల్ బసు

ఘనంగా అమరవీరులకు నివాళి


జలంధర్ : ఘాద్రి ఉద్యమ వారసత్వాన్ని సీపీఐ(ఎం) దేశం నలుమూలలకు తీసుకుని వెళుతుందని పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు నీలోత్పల్ బసు తెలిపారు. ఘాద్రి అమరవీరులకు నివాళులర్పించేందుకు సీపీఐ(ఎం) పంజాబ్ రాష్ట్ర కమిటీ గురువారం భారీ సదస్సు నిర్వహించింది. లాహోర్‌లోని సెంట్రల్ జైలులో 1915 నవంబర్ 16న ఏడు మంది ఘాద్రి వీరులకు ఉరిశిక్ష విధించారు. గురువారం ఘాద్రి అమరవీరులకు నివాళులర్పించిన నీలోత్పల్ బసు సదస్సులో మాట్లాడుతూ ఘాద్రి విప్లవకారుల, స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాల వారసత్వాన్ని దేశంలోని ప్రతి పల్లెకు, పట్టణానికి తీసుకెళ్లాలని సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ నిర్ణయించినట్లు తెలిపారు. కాలాపానీ అని పిలిచే అండమాన్- నికోబార్‌లోని జైలుకు వెళితే అక్కడ విప్లవకారుల జాబితా ఉందని, జాబితాలో ఎక్కువ మంది పంజాబీలు, బెంగాలీలు ఉన్నారని చెప్పారు. అలాగే 'గద్రర్ పార్టీ విదేశీ గడ్డపై కార్యక్రమాలు నిర్వహించింది. స్వాతంత్ర్య పోరాటంలో గద్రర్ ఉద్యమం ఆదర్శప్రాయమైన పాత్రను పోషించింది. వీరంతా గొప్ప గొప్ప త్యాగాలు చేశారు' అని నిలోత్పల్ బసు గుర్తు చేశారు. ఫాసిస్ట్ ఇజ్రాయిల్ చేస్తున్న కనికరం లేని దాడుల్లో బలి అవుతున్న అమాయక పాలస్తీనియన్లకు సంఘీభావంగా నిలబడాలని నీలోత్పల్ బసు ప్రజలకు పిలుపునిచ్చారు. నాటో బలగాలు, అమెరికా సామ్రాజ్యవాదం ఇజ్రాయిల్‌కు సాయం చేస్తున్నాయని విరించారు. ఇజ్రాయిల్ దాడుల్లో ఇప్పటి వరకూ దాదాపు 12,000 మంది అమాయకులు చనిపోయారని, మృతుల్లో ఎక్కువ మంది మహిళలు, చిన్నారులు ఉన్నారని బసు ఆవేదన వ్యక్తం చేశారు. ఇజ్రాయిల్‌కు మద్దతుగా ఉన్న భారత ప్రభుత్వంపై ఆయన అసహనం వ్యక్తం చేశారు. పాలస్తీనాతో దశాబ్దాల కాలంగా ఉన్న సంఘీభావాన్ని భారత ప్రభుత్వం వదులుకుందని విమర్శించారు.

ఘాద్రి అమరవీరులకు నివాళులు అర్పించిన సీపీఐ(ఎం) పంజాబ్ రాష్ట్ర కార్యదర్శి సుఖ్వీందర్ సింగ్ సెఖోన్ మాట్లాడుతూ ఘాద్రి విప్లవకారుల వారసత్వాన్ని పంజాబ్‌లోని ప్రతి మూలకు తీసుకెళ్లాలని పార్టీ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. దేశం చాలా క్లిష్టమైన సమయంలో ఉందని అన్నారు. అధికార పార్టీలు ప్రజలను మత, కులాల వారీగా మభ్యపెడుతున్నాయని విమర్శించారు. దేశ సమైక్యత, సమగ్రత కోసం మతతత్వ శక్తులకు వ్యతిరేకంగా పోరాడాలని ప్రజలకు పిలుపునిచ్చారు. బీజేపీ పాలనలో ఉద్యోగ కల్పన, విద్య, ఆరోగ్య రంగం పూర్తిగా విస్మరించబడిందని, మోడీ ప్రభుత్వం క్రోనీ క్యాపిటలిస్టుల కోసం మాత్రమే పనిచేస్తోందని విమర్శించారు. పంజాబ్‌లో మాదకద్రవ్యాల వ్యాప్తి, అక్రమ మైనింగ్, గ్యాంగ్ వార్‌లు, శాంతి భద్రతలు క్షీణించం వంటి సమస్యలు ఉన్నాయని తెలిపారు.

లాహోర్‌లోని సెంట్రల్ జైలులో 1915 నవంబర్ 16న లాహోర్ కుట్ర కేసు ఆరోపణలతో ఏడు మంది ఘాద్రి వీరులకు ఉరిశిక్ష విధించారు. కర్తార్ సింగ్ సరభా, విష్ణు గణేష్ పింగ్లే, సురైన్ సింగ్ సీనియర్, సురైన్ సింగ్ జూనియర్, బక్షిష్ సింగ్, జగత్ సింగ్, హర్నామ్ సింగ్ సియాల్కోటిలను అప్పటి బ్రిటీష్ ప్రభుత్వం ఉరి తీసింది. ఈ కేసులో మొత్తంగా 291 మందిపై అభియోగాలు మోపారు. వీరిలో 42 మందికి మరణశిక్ష విధించారు. 114 మందికి జీవిత ఖైదు, 93 మందికి వివిధ రకాల జైలు శిక్షలు అమలు చేశారు. విచారణలో 42 మంది నిందితులను నిర్దోషులుగా విడుదల చేశారు.

అన్నదాతలపై అంతులేని ప్రేమ

హిందీ రాష్ట్రాల్లో హామీలు కురిపిస్తున్న పార్టీలు



న్యూఢిల్లీ : శాసనసభ ఎన్నికల్లో విజయం కోసం రాజకీయ పార్టీలు పుంఖానుపుంఖాలుగా హామీలు గుప్పిస్తున్నాయి. ముఖ్యంగా అన్నదాతలపై ఎక్కడ లేని ప్రేమ కుమ్మరిస్తున్నాయి. చందమామను నేలకు దింపేస్తామని నమ్మబలుకుతున్నాయి. మిజోరంలో ఇప్పటికే పోలింగ్ పూర్తికాగా ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్‌లో శుక్రవారంతో ఎన్నికలు ముగుస్తాయి. రాజస్థాన్, తెలంగాణలో పోలింగ్ జరగాల్సి ఉంది. ఆయా రాష్ట్రాల జనాభాలో రైతుల సంఖ్య అధికంగా ఉండడంతో అన్ని పార్టీలు వారి పైనే దృష్టి కేంద్రీకరించాయి. ముఖ్యంగా హిందీ రాష్ట్రాలైన మధ్యప్రదేశ్‌లో 66.40%, రాజస్థాన్‌లో 70%, ఛత్తీస్‌గఢ్‌లో 66.80% కుటుంబాలు వ్యవసాయంపై ఆధారపడినవే. రైతులు ఓ కులానికో లేదా ఓ మతానికో చెందిన వారు కారు. వారిలో అన్ని కులాలు, మతాల వారూ ఉన్నారు. వృత్తి పరంగా వీరి సంఖ్యే అధికంగా ఉండడంతో పార్టీలు వీరిని ప్రసన్నం చేసుకునేందుకు నానా తంటాలు పడుతున్నాయి. ఈ క్రమంలోనే రాజకీయ పార్టీలు అన్నదాతల కోసం పలు పథకాలు, కార్యక్రమాలు ప్రకటిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఆయా రాష్ట్రాల్లో రైతుల పరిస్థితిని అర్థం చేసుకోవాల్సిన అవసరం ఉంది. మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్‌లో కనీస మద్దతు ధరల్ని పెంచాలన్న డిమాండ్ గట్టిగా వినిపిస్తోంది. ఈ మూడు హిందీ రాష్ట్రాల్లో ఉత్పత్తి అవుతున్న మొత్తం ఆహార ధాన్యాల విలువలో మధ్యప్రదేశ్ వాటా 8.93%. పప్పు ధాన్యాల విలువలో ఆ రాష్ట్ర వాటా 18.64%. చమురు గింజల విలువలో దాని వాటా 11.77%. ఆహార ధాన్యాలు, పప్పు ధాన్యాల ఉత్పత్తి విలువలో రాజస్థాన్ రెండో స్థానంలో ఉంది. చమురు గింజల పంటల ఉత్పత్తి విలువలో మాత్రం మొదటి స్థానంలో ఉంది. ఈ మూడింటి ఉత్పత్తి విలువలో ఛత్తీస్‌గఢ్‌ది మూడో స్థానమే. క్వింటాలు ధాన్యానికి మధ్యప్రదేశ్‌లో రూ.2,500, ఛత్తీస్‌గఢ్‌లో రూ.3,200 కనీస మద్దతు ధర ఇస్తానని కాంగ్రెస్ హామీ ఇచ్చింది. ఛత్తీస్‌గఢ్‌లో బీజేపీ ఇచ్చిన హామీ ధర కంటే ఇది వంద రూపాయలు అధికం. జాతీయ పార్టీలైన కాంగ్రెస్, బీజేపీలు దేశీయంగా ప్రకటించిన ఎంఎస్‌పీ రూ.2,183 కంటే ఎక్కువగానే ఇస్తామని ఛత్తీస్‌గఢ్ రైతులకు హామీ ఇచ్చాయి. ఈ మూడు రాష్ట్రాల్లో ఛత్తీస్‌గఢ్‌లో ఆహార ధాన్యాల ఉత్పత్తి విలువ తక్కువే అయినప్పటికీ అక్కడ వరి పంట ఎక్కువగా పండిస్తారు.

అక్కడ వరి పండించే రైతులు ప్రభుత్వ సంస్థలకు ధాన్యం విక్రయిస్తూ అధిక ధర పొందుతున్నారు. దేశంలో ధాన్యం ఉత్పత్తిలో ఛత్తీస్‌గఢ్‌ది ఎనిమిదో స్థానం. కానీ సేకరణలో మూడో స్థానంలో ఉంది. ఎన్నికలు జరిగే మూడు హిందీ రాష్ట్రాల్లోనూ రాజస్థాన్‌లో వ్యవసాయ కుటుంబాల సగటు నెలసరి ఆదాయం ఎక్కువగా ఉంది. ఛత్తీస్‌గఢ్ రెండో స్థానంలో, మధ్యప్రదేశ్ మూడో స్థానంలో ఉన్నాయి. రాజస్థాన్‌లో ప్రధానంగా చమురు గింజల పంటల్ని సాగు చేస్తున్నారు.

అయితే వాటి కనీస మద్దతు ధరలు మాత్రం పెద్దగా పెరగలేదు. పార్టీలు మాత్రం తమ ప్రచారంలో రుణమాఫీపై హామీలు ఇస్తున్నాయి. సహకార బ్యాంకుల నుండి తీసుకున్న రుణాలను పూర్తిగా మాఫీ చేస్తామని కాంగ్రెస్ చెబుతోంది. రాజస్థాన్ రైతు కుటుంబాల్లో అత్యధిక కుటుంబాలు రుణ భారంతో సతమతమవుతున్నాయి. రాష్ట్రం లోని 60.3% రైతు కుటుంబాలు బ్యాంకులు, ఆర్థిక సంస్థల నుండి రుణాలు తీసుకున్నాయి. మొత్తంగా ఈ మూడు రాష్ట్రాల్లోనూ ఛత్తీస్‌గఢ్ రైతు కుటుంబాలే తమ ఆదాయాలతో ఎక్కువ సంతోషంగా ఉన్నాయి. ప్రతి వెయ్యి మందిలో 685 మంది తాము సంతోషంగానే ఉన్నామని చెప్పారు.

సీపీఐ(ఎం) మద్దతు కోరిన హరీశ్‌రావు

- పటాన్‌చెరు మినహా మిగతా 9 స్థానాల్లో మద్దతు కోసం ప్రతిపాదన
- పార్టీలో చర్చించి నిర్ణయం చెబుతామన్న నేతలు

నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

మెదక్ ఉమ్మడి జిల్లాలోని పది అసెంబ్లీ నియోజకవర్గాల్లో పటాన్‌చెరు మినహా మిగతా తొమ్మిది స్థానాల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థులకు మద్దతివ్వాలని మంత్రి తన్నీరు హరీశ్‌రావు సీపీఐ(ఎం) నేతలను కోరారు. గురువారం మంత్రి హరీశ్‌రావు, సంగారెడ్డి బీఆర్‌ఎస్ అభ్యర్థి చింత ప్రభాకర్‌తో కలిసి సంగారెడ్డిలోని సీపీఐ(ఎం) జిల్లా కార్యాలయానికి వచ్చి ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు చుక్క రాములు, జిల్లా కార్యదర్శి జయరాజు, నాయకులు బి. మల్లేశం, మాణిక్ ఇతర నాయకులతో మాట్లాడారు. పటాన్‌చెరు నియోజకవర్గంలో సీపీఐ(ఎం) పోటీ చేస్తున్న దృష్ట్యా ఆ స్థానం మినహాయించి మిగతా తొమ్మిది స్థానాల్లో ఆ పార్టీ పోటీ చేయనందున బీఆర్‌ఎస్ అభ్యర్థులకు మద్దతు ఇవ్వాలని మంత్రి సీపీఐ(ఎం) నాయకుల వద్ద ప్రతిపాదన పెట్టారు. మంత్రి ప్రతిపాదనపై సీపీఐ(ఎం) నాయకులు ఎలాంటి నిర్ణయం ప్రకటించలేదు. పార్టీ రాష్ట్ర, జిల్లా స్థాయి వేదికల్లో చర్చించి నిర్ణయం తీసుకున్న తర్వాత తమ వైఖరి ప్రకటిస్తామని ఆ పార్టీ సంగారెడ్డి జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు తెలిపారు. ప్రతి ఓటూ కీలకమైన నేపథ్యంలో గెలుపు కోసం ఏ అవకాశమున్నా వదులుకోకుండా ప్రయత్నాలు చేస్తున్న మంత్రి హరీశ్‌రావు.. సీపీఐ(ఎం) గడప కూడా తట్టారు.

కమ్యూనిస్టుల పోరాటంతోనే ఆదివాసీ గిరిజనులకు పోడుపట్టాలు

సమరశీల ఉద్యమాల్లో ముందున్న సీపీఐ(ఎం)

- పలుమార్లు సీఎం, మంత్రులు, అధికారులకు వినతి
- రోడ్ల దిగ్బంధనంతో దిగొచ్చిన ప్రభుత్వం
- 1.51 లక్షల మందికి 4.06 లక్షల ఎకరాల పంపిణీ
- ఆ భూములకు రైతుబంధు, ఉచిత విద్యుత్ వర్తింపు



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కమ్యూనిస్టులు కేవలం ఎన్నికలకే పరిమితం కారు. పోరాటాల ద్వారా ప్రజలకు మేలు చేస్తారు. వారి అంతిమ లక్ష్యం ప్రజా క్షేమమే. సాధ్యమైనంత వరకు సీఎం, మంత్రులు, అధికారుల దృష్టికి సమస్య లోతుపాతులను తీసుకెళ్లి చర్చల ద్వారా వాటి పరిష్కారం కోసం కృషి చేస్తారు. అది సాధ్యం కానప్పుడే అనివార్యమైన పరిస్థితుల్లోనే పోరాటాలకు సమాయత్తమవుతారు. సమస్యలు పరిష్కరించడమే ఈ పోరాటాల ప్రధాన లక్ష్యం. కానీ ఇప్పుడున్న సమాజంలో పాలకులు, అధికారులు పేదల సమస్యల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఎన్నిసార్లు వినతిపత్రాలు ఇచ్చినా, చర్చలు జరిపినా ఉపయోగం లేనప్పుడు... ఎంతకూ పేదల సమస్యలు పరిష్కారం కానప్పుడు మాత్రమే పోరాటాలు అనివార్యమవుతున్నాయి. బూర్జువా పార్టీల నాయకులు ఫైరవీల పేరుతో పేదల జేబులు కొల్లగొడతారు. పోరాడి సాధించుకోవడం ప్రజల హక్కు అని కమ్యూనిస్టులు చెప్తారు. అందుకే పోరాడే ప్రజలు ఎర్రజెండాను ఆశ్రయిస్తారు. పేదల కోసం ఎలాంటి త్యాగాలు చేయడానికైనా కమ్యూనిస్టులు సిద్ధంగా ఉంటారు.

హక్కుల సాధనకు ఐక్య పోరాటాలే మార్గం

పోడు భూముల సమస్యను బీఆర్‌ఎస్ ప్రభుత్వం నాన్చుతూ వచ్చింది. ఆదివాసీ గిరిజనులకు ఇచ్చిన మాటతప్పింది. అనేక సార్లు ప్రభుత్వానికి వినతిపత్రాలు అందించినా, చర్చించినా ఫలితం లేదు. అందుకే సీపీఐ(ఎం) అనేక సమరశీల పోరాటాలు నిర్వహించింది. అయినా పాలకులు స్పందించలేదు. ఇతర వామపక్షాలు, కలిసొచ్చే రాజకీయ పార్టీలు, ఆదివాసీ, గిరిజన, ప్రజాసంఘాలను కలుపుకుని ఉద్యమాన్ని ఉధృతం చేసింది. 2021, అక్టోబర్ 5న అశ్వరావుపేట నుంచి ఆదిలాబాద్ వరకు రోడ్లను దిగ్బంధనం చేసింది. ఆ తర్వాతే రాష్ట్ర ప్రభుత్వం దిగొచ్చింది. పోడు భూముల సమస్య పరిష్కారానికి ముందుకొచ్చింది. జూన్ 30 నుంచి రాష్ట్రవ్యాప్తంగా 1,51,146 మంది ఆదివాసీ గిరిజనులకు 4,06,369 ఎకరాల భూమికి పోడు పట్టాలను పంపిణీ చేసింది. అయితే అటవీ హక్కుల చట్టం-2006 ప్రకారం రాష్ట్రంలో ఇప్పటికే 13 లక్షల ఎకరాలకు 3.5 లక్షల మంది హక్కుపత్రాల కోసం దరఖాస్తు చేసుకున్నారు. అయితే రాష్ట్ర ప్రభుత్వం దరఖాస్తు చేసుకున్న వారందరికీ హక్కు పత్రాలివ్వకపోవడం గమనార్హం. రాష్ట్రంలో 11.5 లక్షల ఎకరాలకు పోడు హక్కు పత్రాలిస్తామంటూ ముఖ్యమంత్రి కె చంద్రశేఖర్‌రావు అసెంబ్లీలో ఇచ్చిన హామీని కూడా నిలబెట్టుకోకపోవడం గమనార్హం. దీంతో అర్హులైన అనేక మంది ఆదివాసీ గిరిజనులకు ఇంకా హక్కు పత్రాలు దక్కలేదు. అర్హులందరికీ పోడు పట్టాలు దక్కేదాకా పోరాటం కొనసాగుతుందని సీపీఐ(ఎం) ఇప్పటికే ప్రకటించింది. ముందు ముందు అవి సాధించేదాకా పోరాడేతీరుతుంది. అయితే కమ్యూనిస్టుల సమరశీల పోరాటాలు, ఐక్య ఉద్యమాల ఫలితంగానే ఆదివాసీ గిరిజనులకు ఈ మాత్రమైనా పోడు పట్టాలు దక్కాయనడంలో ఎలాంటి సందేహం లేదు. ఎన్నికల్లో గెలిచినా, ఓడినా ప్రజలకు వెన్నంటి నిలిచేది కమ్యూనిస్టులే. వారి న్యాయమైన హక్కుల కోసం, సమస్యల పరిష్కారం కోసం నిత్యం పోరాడతారు. విజయాలను సాధిస్తారు. అలాంటి విజయాల్లో ఒకటి ఈ పోడు పట్టాల సాధన.

పేదలకు అండ ఎర్రజెండా : ఎస్ వీరయ్య

భద్రాచలం అసెంబ్లీ నియోజకవర్గానికి పదిసార్లు ఎన్నికలు జరిగితే ఎనిమిది సార్లు సీపీఐ(ఎం) అభ్యర్థులను ఎమ్మెల్యేలుగా అక్కడి ఆదివాసీ గిరిజనులు గెలిపించారని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్ వీరయ్య చెప్పారు. అంటే వారికి ఎర్రజెండా అండగా నిలవడమే ఇందుకు ప్రధాన కారణమని అన్నారు. పేద ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా కమ్యూనిస్టులు నిరంతరం పోరాడతారని చెప్పారు.



చికెన్ ధరలు
హైదరాబాద్
బ్రాయిలర్ చికెన్

ఫారం రేటు	రూ. 92
రిటైల్ (లైవ్)	రూ. 114
స్కిన్‌తో	రూ. 165
స్కిన్‌లెస్	రూ. 188

అత్యవసర సాయం అందించండి

(మొదటిపేజీ తరువాయి)

వీలుగా గాజాలో మానవతా కారిడార్‌లను ఏర్పాటు చేయాలని పిలుపిస్తూ భద్రతా మండలి తీర్మానాన్ని ఆమోదించింది. గాజాలోని బాధితులకు ఆహారం, మందులు, ఇతర సామగ్రిని అందజేసేందుకు వీలుగా ఆటంకాలు తొలగించి, మార్గాలను తెరవాలని కోరుతూ ఐరాస భద్రతా మండలి ఓ తీర్మానాన్ని ఆమోదించింది. పదిహేను మంది సభ్యులుండే భద్రతా మండలిలో 12 మంది ఈ తీర్మానానికి అనుకూలంగా ఓటు వేయగా అమెరికా, బ్రిటన్, రష్యా గైర్హాజరు అయ్యాయి. హమస్ జరిపిన దాడులను ఖండించడంలో తీర్మానం విఫలమైందని ఆరోపిస్తూ అమెరికా, బ్రిటన్ ఓటింగ్‌కు దూరంగా ఉన్నాయి. మానవత్వంతో కాల్పుల విరమణ పాటించాలని తీర్మానం కోరనందుకు నిరసనగా రష్యా ఓటింగ్‌కు గైర్హాజరు అయింది. తీర్మానంలో సవరణ చేసేందుకు ఓటింగుకు ముందు రష్యా చేసిన ప్రయత్నం ఫలించలేదు. బందీలుగా ఉంచిన వారిని తక్షణమే బేషరతుగా విడుదల చేయాలని తీర్మానం కోరింది. యూరప్ దేశమైన మాల్టా తీర్మానాన్ని ప్రవేశపెట్టింది. 'మేము ఈ రోజు సాధించింది ముఖ్యమైన తొలి చర్య' అని ఐరాసలో మాల్టా రాయబారి ఫ్రాజియర్ వ్యాఖ్యానించారు. కాగా ఈ యుద్ధంలో అనేక అంతర్జాతీయ చట్టాలు ఉల్లంఘనకు గురవుతున్నాయని, దీనిపై దర్యాప్తు జరిపించాలని ఐరాస మానవ హక్కుల అధిపతి వాల్కర్ టర్క్ కోరారు.

బుల్డోజర్లతో ఆస్పత్రి ఎంట్రన్స్ ధ్వంసం

గాజాలోని అతి పెద్ద ఆస్పత్రి షిఫా దక్షిణ ప్రాంత ప్రవేశ ద్వారాన్ని ఇజ్రాయిల్ దళాలు బుల్‌డోజర్లతో ధ్వంసం చేశాయని పాలస్తీనా ఆరోగ్య మంత్రిత్వ శాఖ గురువారం తెలిపింది. నలభై రోజులుగా జరుగుతున్న యుద్ధంలో ఇజ్రాయిల్ దళాలు ప్రధానంగా ఈ ఆస్పత్రినే లక్ష్యంగా చేసుకొని దాడులు చేస్తున్నాయి. ఈ దాడిని సౌదీ అరేబియా తీవ్రంగా ఖండించింది. షిఫా ఆస్పత్రిలో చేపట్టిన గాలింపు చర్యల్ని కొనసాగిస్తామని గాజాలో ఇజ్రాయిల్ సైనిక కార్యకలాపాలు నిర్వహిస్తున్న దళాల అధిపతి మేజర్ జనరల్ యారన్ ఫింకెల్‌మాన్ చెప్పారు.

హృదయవిదారక దృశ్యాలు

ఇజ్రాయిల్ దళాలు బుధవారం ఈ ఆస్పత్రిలో ప్రవేశించడానికి ముందు లోపల 2,300 మంది రోగులు, సిబ్బంది, నిరాశ్రయులైన పౌరులు ఉన్నారని ఐరాస సంస్థలు అంచనా వేశాయి. ముసుగులు ధరించిన కొందరు ఇజ్రాయిల్ సైనికులు గాలిలోకి కాల్పులు జరిపారని, లొంగిపోవాల్సిందిగా యువతను ఆదేశించారని లోపల చిక్కుకుపోయిన ఓ పాత్రికేయుడు తెలిపారు. ఇజ్రాయిల్ సైనికులు కొందరు పాలస్తీనియన్లను నగ్నంగా నిలబెట్టి ఆయుధాలు, పేలుడు పదార్థాల కోసం తనిఖీలు చేశారని ఆయన చెప్పారు. ఆస్పత్రి లోపల పరిస్థితి హృదయవిదారకంగా ఉన్నదని ప్రత్యక్షసాక్షులు చెబుతున్నారు. మత్తుమందు ఇవ్వకుండానే శస్త్ర చికిత్సలు చేస్తున్నారు. ఆహారం, నీరు లభించక రోగుల బంధువులు కారిడార్లలో ఇబ్బందులు పడుతున్నారు. ఇదిలా వుండగా హమాస్‌ను పూర్తిగా నాశనం చేసే వరకూ ఇజ్రాయిల్ యుద్ధం ఆగదని అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ స్పష్టం చేశారు.

ఎండిన జూరాల చివరి ఆయకట్టు

పశువుల మేతకోసం వదలిన 30 వేల ఎకరాలు

- వారబందీతో నెర్రెలు బారిన సాగు భూములు
- మిర్చి, వరి, మినుములకు బారీ నష్టం
- ఎకరా వరికి రూ.45 వేలు, మిర్చికి రూ.80 వేలు
- చేతికి రాకుండానే కుల్లారిన పంటలు
- ఆందోళనలో అన్నదాతలు



నవతెలంగాణ-మహబూబ్‌నగర్ ప్రాంతీయప్రతినిధి

చిన్నంబావి మండలం కాలూరు గ్రామానికి చెందిన చిన్న కురుమూర్తి తనకున్న 5ఎకరాలతో పాటు మరో 5 ఎకరాలు కౌలుకు తీసుకొని పంటలు సాగుచేశాడు. 5 ఎకరాల్లో మినుము, మరో ఐదు ఎకరాల్లో వరి పంట సాగు చేశారు. వాటి పెట్టుబడికి రూ. 2 లక్షలు కాగా, పొలం కౌలు రూ.లక్ష అయింది. కాగా, సాగునీరు రాక పంట పూర్తిగా ఎండిపోయింది. పంట చేతికి వస్తే.. అప్పులు తీరుతాయనుకుంటే కొత్త అప్పు అయ్యిందని రైతు ఆవేదన వ్యక్తం చేశాడు.వెల్లూరు గ్రామానికి చెందిన రైతు తిరుపతయ్య మూడు ఎకరాల్లో వరి, ఐదు ఎకరాల్లో మక్క పంటను సాగు చేశారు. ఎకరాకు రూ. 40 వేల ఖర్చు అయింది. కాగా, సాగునీరు అందక వేసిన పంట పూర్తిగా ఎండిపోవడంతో పశవులకు వదలిపెట్టారు.

పొట్టలో కంకి పెట్టుకొని.. మరికొన్ని రోజుల్లో పంట చేతికి వచ్చే దశలో జూరాల నుంచి చివరి ఆయకట్టుకు సాగు నీరు ఆగిపోయాయి. వారబందీతో మొదటి పొలాలకు మాత్రమే సాగునీరు అందడంతో చివరి పంట పొలాలకు నీళ్లు లేక నెర్రెలు బారి ఎండిపోయాయి. దాంతో వరి, మిర్చి, మినుము పంటలను పశువులకు వదలిపెట్టారు. ఎకరాకు రూ. 40 వేల నుంచి రూ.లక్షల్లో ఖర్చు చేసిన రైతులకు అప్పులు మిగిలాయి. సాగునీటి అధికారుల మాటలు నమ్మి సాగు చేసిన రైతులకు పరిహారం అందివ్వాలని రైతులు, రైతు సంఘం నాయకులు కోరుతున్నారు.

జూరాల చివరి ఆయకట్టు అయిన పెంట్లవెల్లి, చిన్నంబావి, వీపనగండ్ల, పాన్‌గల్, పెబ్బేర్ తదితర మండలాలకు సాగునీరు అందడం లేదు. ప్రతి ఏటా ఇదే పరిస్థితి నెలకొన్నది. పంట చేతికి వచ్చే దశలో నీరు నిలిపేయడం వల్ల వేలాది ఎకరాలు ఎండిపోతున్నాయని రైతులు తెలిపారు. ఈ ఏడాది అధికారిక లెక్కల ప్రకారమే 30 వేల వరి, మిర్చి, మినుము, పంటలు పూర్తిగా ఎండిపోయాయి. ప్రధానంగా చిన్నంబావి మండల పరిధిలోనే ఎల్లూరు, చిన్నమరూరు, పెద్దమరూరు, అయ్యవారిపల్లి, కాలూరు, చెల్లెపాడు, కొప్పునూరు తదితర గ్రామాల పరిధిలోనే 10 వేల ఎకరాలు ఎండిపోయింది. కొప్పునూరు గ్రామానికి చెందిన కత్తి తిరుపతయ్య తనకున్న మూడు ఎకరాల్లో వరి, మినుములు సాగు చేశారు. ఎకరాకు రూ.60 వేలు పెట్టుబడి అయింది. అదే గ్రామానికి చెందిన జయన్న మూడు ఎకరాలు, రైతు శ్రీనుకు చెందిన 6 ఎకరాలు పూర్తిగా ఎండిపోయింది. వెల్లూరు గ్రామానికి చెందిన మద్దిలేటి ఐదు ఎకరాలలో వరి 14 ఎకరాలలో మినుము, 3 ఎకరాలలో మక్క పంట సాగు చేశారు. నీళ్ల ఆగిపోవడంతో పంట పూర్తిగా ఎండి పోయింది. సాగునీటి అధికారులు ఇచ్చిన ఆదేశాల ప్రకారమే సాగు చేశామని, కానీ మొదటి ఆయకట్టుకు నీరు వదలి చివరి ఆయకట్టు భూములకు అన్యాయం చేస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఎండిన పంటలకు అధికారులే బాధ్యత వహించాలని రైతులు అంటున్నారు. నష్టపోయిన పంటలకు పరిహారం ఇచ్చి రైతులను ఆదుకోవాలని పలు రైతు సంఘాలు కోరుతున్నాయి.

14 ఎకరాలు పూర్తిగా ఎండింది

14 ఎకరాల్లో వరి, మినుము పంటలను సాగు చేశాను. వరి ఎకరాకు రూ.45 వేలు, మినుముకు రూ.40 వేలు ఖర్చు అయింది. ఇంకా కౌలు ఎకరాకు రూ.10 వేలు ఇచ్చాను. ఇంత ఖర్చు చేసి సాగు చేసినా నీరు లేక పంటలు పూర్తిగా ఎండిపోయాయి.

– కురుమయ్య కాలూరు, చిన్నంబావి, వనపర్తి జిల్లా

మమ్మలను ఆదుకోవాలి.. లేకుంటే మరణమే శరణ్యం

చివరి ఆయకట్టుకు సాగునీరు అందక ప్రతి ఏటా ఇదే పరస్థితి నెలకొంటుంది. అయినా ఎవరూ పట్టించుకోవడం లేదు. మరో 10 రోజులు పోతే ఎండిన ఆనవాళ్లు లేకుండా పోతాయి. ఇప్పటికైనా ఎండిపోయిన పంటలను పరిశీలించి, పంట నష్టం చూసి పరిహారం ఇప్పించండి. లేకపోతే మాకు మరణమే శరణ్యం.

తిరుపతయ్య, వెల్టూరు, పెద్దదగడ, చిన్నంబావి మండలం వనపర్తి జిల్లా

ఎండిన పంటలను పరిశీలించి పరిహారం చెల్లించాలి

చిన్నంబావి మండల పరిధిలో సుమారు 10 వేల ఎకరాల పంటలు ఎండిపోయాయి. ప్రతి ఏటా ఇదే పరిస్థితి ఉంటుంది. అధికారుల మాటలు నమ్మి సాగు చేసిన రైతులకు వారే భరోసా కల్పించాలి. వెంటనే పరిశీలన చేసి పరిహారం అందివ్వాలి. లేకపోతే రైతుల ఆగ్రహానికి గురికాక తప్పదు.

రాజేందర్‌గౌడ్, రైతు సంఘం మండల కార్యదర్శి, చిన్నంబావి, వనపర్తి జిల్లా

ఓటు వజ్రాయుధం

(మొదటిపేజీ తరువాయి)

భూమెంతుంది..? ఎంతిస్తరు..? అనే కథ వస్తది. కాంగ్రెసోళ్ల అబద్దాలు చెప్పే మోసగాళ్లు. ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధం. పార్టీల చరిత్ర ఏంటో అభ్యర్థుల గుణమేంటో ఆలోచించి ఓటేయండి. యాభైయేండ్ల కాంగ్రెస్ పాలన లో తెలంగాణెట్లుండే. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో తెలంగాణ యెట్లుందనేది పరిశీలించండి' అని సీఎం కేసీఆర్ అన్నారు. గురువారం ఆదిలాబాద్, బోథ్, నిజామాబాద్ రూరల్, నర్సాపూర్ నియోజకవర్గాల్లో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభల్లో సీఎం కేసీఆర్ పాల్గొన్నారు.

ఆదిలాబాద్, బోథ్ నియోజకవర్గాల్లో నిర్వహించిన సభల్లో సీఎం మాట్లాడుతూ.. మోడీ సర్కారు తెలంగాణకు ద్రోహం చేసిందని, ఒక్క మెడికల్ కళాశాల, నవోదయ పాఠశాల కూడా ఇవ్వలేదన్నారు. ఇక్కడ నలుగురు బీజేపీ ఎంపీలు ఉండి గడ్డిపీకుతున్నారా అని ప్రశ్నించారు. మతపిచ్చి రేపే బీజేపీని పాతరేయాలని తెలిపారు. ఒక్క ఓటు కూడా బీజేపీకి వేయకూడదని.. వేస్తే మురికి కాల్వలో వేసినట్లవుతుందని చెప్పారు. త్వరలో జరగబోయే పార్లమెంట్ ఎన్నికల్లో మోడీకి మెజార్టీ రాదని.. కేంద్రంలో సంకీర్ణ ప్రభుత్వం ఏర్పడుతుం దని జోస్యం చెప్పారు. తెలంగాణ అన్ని రంగాల్లో అభివృద్ధి జరుగుతోందని, ఈ తరుణంలో రాష్ట్రంలో మళ్లీ కాంగ్రెస్ ప్రభుత్వం వస్తే తెలంగాణ నాశనం అవుతుందని, ఆ పార్టీకి ఓటు వేసినా మరింత వేస్ట్ అవుతుందని అన్నారు. రైతుల మేలు కోసం మూడేండ్లు కష్టపడి ధరణి పోర్టల్ తీసుకొచ్చి రైతులకే అధికారమిచ్చామన్నారు. కాంగ్రెస్‌కు ఓటు వేసి అధికారం ఉంచుకుంటారా.. పోగొట్టుకుంటారా.. అని ప్రశ్నించారు. ఆదిలాబాద్‌లో 50 ఏండ్ల చనాక-కోర్ట బ్యారేజీ కల నెరవేర్చామని, అక్కడ్నుంచి పిప్పల్‌కోటి రిజర్వాయర్‌కు లింక్ కలిపి నీటిని నింపుతామని చెప్పారు. తాను బతికున్నంత వరకు రాష్ట్రం సెక్యులర్‌గానే ఉంటుందని, 75ఏండ్లలో మైనార్టీల కోసం కాంగ్రెస్ కేవలం రూ.2వేల కోట్లు ఖర్చు చేస్తే తెలంగాణలో ఈ పదేండ్లలోనే రూ.12వేల కోట్లు ఖర్చు చేసిందన్నారు.

మంచిప్ప రిజర్వాయర్ భూ నిర్వాసితులకు నష్టపరిహారం చెల్లిస్తాం

నిజామాబాద్ జిల్లా డిచ్‌పల్లి మండల కేంద్రంలోని ఎఫ్‌సీఐ గోదాంలో నిర్వహించిన సభలో సీఎం మాట్లాడుతూ.. త్వరలోనే మంచిప్ప రిజర్వాయర్ పనులు పూర్తిచేసి నిజామాబాద్ రూరల్, బాల్కొండ నియోజకవర్గాల్లోని వ్యవసాయానికి ఇజ్రాయిల్ టెక్నాలజీతో ప్రతి మూడు ఎకరాలకు నీటిని అందిస్తామని అన్నారు. మంచిప్ప రిజర్వాయర్లో భూములు కోల్పోయిన బాధితులకు మంచి నష్ట నష్టపరిహారం చెల్లిస్తామని హామీ నిచ్చారు. ఐటీ రంగంలో దూసుకుపోతున్నామని అన్నారు.

త్వరలోనే ఐటీ రంగంలో బెంగుళూరు కంటే మెరుగైన రాష్ట్రంగా ఉంటామన్నారు. బీఆర్ఎస్ పార్టీ పెట్టబోయే బ్యూరో పథకాన్ని గల్ఫ్ కుటుంబాలకు కూడా వర్తింపజేసేలా ఆలోచన చేస్తున్నామన్నారు. సంపదను పెంచి.. దాన్ని పేదోడికి పంచాలనే నినాదంతో ముందుకు సాగామని తెలిపారు. ఎవరూ అడగకముందే పెన్షన్ పెంచామని, రైతుల కోసం రైతుబంధు, రైతు బీమా, 24 గంటలు కరెంటు ఇస్తున్నామని, ధాన్యాన్నీ కొనుగోలు చేస్తున్నామన్నారు.

ఓట్లు రాగానే ఆగమాగం కావొద్దు

ఓట్లు రాగానే ఆగమాగం కావొద్దని, ఆలోచించి ఓట్లేయాలని సీఎం కేసీఆర్ కోరారు. బీఆర్ఎస్ అభ్యర్థి వాకిటి సునీతాలక్ష్మారెడ్డి గెలుపు కోరుతూ నిర్వహించిన సభలో సీఎం మాట్లాడారు. కాంగ్రెస్ పాలనలో కరెంట్, తాగు, సాగునీరు రాలేదని, సంక్షేమమే లేదన్నారు. 24 గంటల కరెంట్, రైతుబంధు వద్దంటున్న కాంగ్రెస్‌కు బుద్ధి చెప్పాలని కోరారు. కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా హల్దీనది నీటితో కళకళలాడుతుందన్నారు. నర్సాపూర్‌లో కొత్త మండలాలు, డివిజన్లు ఏర్పాటు, ఇతర పనులను అధికారంలోకి వచ్చాక తప్పక చేస్తామన్నారు. కాగా, నర్సాపూర్ సభలో పలువురు కాంగ్రెస్, బీజేపీ ముఖ్య నాయకులు సీఎం కేసీఆర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. నర్సాపూర్ టికెట్ ఆశించిన టీపీసీసీ నాయకులు గాలి అనిల్‌కుమార్, మెదక్ టికెట్ ఆశించిన టీపీసీసీ నాయకులు మేడం బాలకృష్ణ, సంగారెడ్డి బీజేపీ టికెట్ ఆశించిన ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రాజేశ్వర్‌రావు దేశ్‌పాండే, పటాన్‌చెరు టికెట్ ఆశించిన రాష్ట్ర నాయకులు శ్రీకాంత్ గౌడ్, తదితరులు బీఆర్ఎస్‌లో చేరారు.

సీఎం కేసీఆర్ సభలో బుల్లెట్ల కలకలం

నవ తెలంగాణ - నర్సాపూర్

మెదక్ జిల్లా నర్సాపూర్ పట్టణంలో గురువారం బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన సీఎం కేసీఆర్ ప్రజా ఆశీర్వాద సభలో బుల్లెట్ల కలకలం రేగింది. సభలో సీఎం ప్రసంగిస్తున్న సమయంలో ఓ వ్యక్తి అనుమానాస్పదంగా తిరుగుతూ హల్‌చల్ చేశాడు. అతనిపై అనుమానంతో పోలీసులు అదుపులోకి తీసుకొని పరిశీలించారు. అతని వద్ద రెండు బుల్లెట్లు దొరకడంతో వాటిని స్వాధీనం చేసుకున్నారు. ప్రస్తుతం ఆ వ్యక్తిని పోలీసులు విచారిస్తున్నట్టు తెలిసింది.

అప్పుల బాధతో నేతకార్మికుడి ఆత్మహత్య

నవతెలంగాణ-సిరిసిల్ల



సిరిసిల్ల పట్టణంలోని పద్మా నగర్‌కు చెందిన మంగలపల్లి సాయి(32) అనే నేత కార్మికుడు అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ సభ్యులు చెప్పిన వివరాల ప్రకారం.. నిరుపేద నేత కుటుంబానికి చెందిన సాయి.. తండ్రి లక్ష్మణ్ పక్షవాతానికి గురై మంచానికే పరిమితమయ్యారు. తల్లి చిలుకమ్మ గుండెజబ్బుతో బాధ పడుతుంది. దాంతో వారి ఆరోగ్యం బాగు చేయడానికి సుమారు రూ. 10లక్షల వరకు అప్పు చేశాడు. చేసిన అప్పులకు వడ్డీ చెల్లించలేక చేతినిండా పని లేక మనోవేదనకు గురయ్యాడు. ఈ క్రమంలో మనస్తాపానికి గురైన సాయి గురువారం మానేరు వాగులో దూకాడు. మృతునికి భార్య, ఇద్దరు కూతుళ్లు ఉష, శ్రీవాణి ఉన్నారు. కుటుంబాన్ని పోషించే పెద్ద దిక్కు మృతిచెందడంతో కుటుంబంలో విషాదం నెలకొంది. మృతుని తల్లి గుండెజబ్బుతో బాధపడుతుండటంతో సాయి మృతి విషయం ఇప్పటివరకు చెప్పలేదు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

నేడు రెండు రాష్ట్రాల్లో పోలింగ్

న్యూఢిల్లీ : మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో నేడే (శుక్రవారం) పోలింగ్ జరగనుంది. ఇక్కడ ఎన్నికల నిర్వహణకు రెండు రాష్ట్రాల ఎన్నికల అధికారులు సర్వం సిద్ధం చేశారు. అయితే ఛత్తీస్‌గఢ్‌లో ఇది రెండో విడత పోలింగ్ కాగా మధ్యప్రదేశ్‌లో ఈసారి ఉత్కంఠభరితమైన పోటీ నెలకొంది. ఇక్కడ కాంగ్రెస్, బీజేపీల మధ్యే ప్రత్యక్ష పోటీ నెలకొంది. మధ్యప్రదేశ్‌లో 230 అసెంబ్లీ స్థానాలకు జరిగే పోలింగ్ ఉదయం 7 గంటలకు ప్రారంభమై సాయంత్రం 6 గంటల వరకు కొనసాగుతుంది. ఇక్కడ మొత్తం ఓటర్ల సంఖ్య 5.6 కోట్లు. వీరిలో పురుష ఓటర్ల సంఖ్య 2.88 కోట్లు. మహిళా ఓటర్లు 2.72 కోట్లు. రాష్ట్రంలో తొలిసారిగా మొత్తం 22.36 లక్షల మంది యువత ఓటు వేయనున్నారు. 2,533 మంది అభ్యర్థులు తమ అదష్టాన్ని పరీక్షించుకోనున్నారు. 2018లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ 114 సీట్లు గెలుచుకుని అతిపెద్ద పార్టీగా అవతరించింది. కానీ రెండు ఓట్ల తేడాతో మెజారిటీ కోల్పోయింది. ఇలాంటి పరిస్థితుల్లో ఎస్పీ, బీఎస్పీ, స్వతంత్రుల మద్దతుతో కమల్‌నాథ్ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారు. అనంతరం ఆపరేషన్ ఆకర్ష్ దెబ్బకు కాంగ్రెస్ సర్కార్ కూలిపోయి శివరాజ్ సర్కార్ గద్దెనెక్కింది. కానీ అక్కడ బీజేపీపై తీవ్ర వ్యతిరేకత కనిపిస్తోంది.

ఛత్తీస్‌గఢ్‌లోనూ..

ఛత్తీస్‌గఢ్‌లో 90 అసెంబ్లీ స్థానాల్లో 20 స్థానాలకు మొదటి విడతలో నవంబర్ 7న పోలింగ్ జరిగింది. కాగా తుదివిడతగా మిగిలిన 70 స్థానాలకు శుక్రవారం పోలింగ్ జరగనుంది. ఈ ఎన్నికల్లో మొత్తం 958 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. ఇందులో 827 మంది పురుష అభ్యర్థులు కాగా 130 మంది మహిళా అభ్యర్థులు పోటీలో ఉన్నారు. అలాగే ఒక థర్డ్ జెండర్ అభ్యర్థి కూడా బరిలో నిలిచారు.

రెండో విడత పోలింగ్‌కు రాష్ట్రంలోని కోటి 63 లక్షల 14 వేల 479 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. వీరిలో 81 లక్షల 41 వేల 624 మంది పురుష ఓటర్లు, 81 లక్షల 72 వేలా 171 మంది మహిళా ఓటర్లు, 684 మంది థర్డ్ జెండర్ ఓటర్లు ఉన్నారు. ఓటింగ్ సజావుగా సాగేందుకు మొత్తం 18 వేల 833 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. వీటిలో 700 సంగ్వారీ పోలింగ్ కేంద్రాలు కూడా తయారు చేయబడ్డాయి, ఇక్కడ మహిళా పోలింగ్ సిబ్బందిని మాత్రమే ఉంచుతారు.ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు సహకరించాలని అధికారులు కోరారు. పోలింగ్ కేంద్రాలకు అవసరమైన ఈవీఎంలు సహా అన్ని ఏర్పాట్లు పూర్తయినట్టు అధికారులు తెలిపారు. డిసెంబర్ 3న ఓట్ల లెక్కింపు జరగనుంది.

ఎన్నికల కోడ్ ఉల్లంఘించిన సూర్యాపేట అధికారులు

- వారిపై చర్యలు తీసుకోవాలి
- దళిత ఆశావర్కర్ సస్పెండ్ అక్రమం :ఏఐటీయూసీ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘిస్తూ దళిత ఆశావర్కర్ ఎస్.కవితను సస్పెండ్ చేసిన జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారులపై చర్యలు తీసుకోవాలని ఏఐటీయూసీ డిమాండ్ చేసింది. ఈ మేరకు గురువారం హైదరాబాద్ బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏఐటీయూసీ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎం. నర్సింహా, రాష్ట్ర కార్యదర్శి ఎస్.కరుణకుమారి, సస్పెన్షన్‌కు గురైన ఎస్.కవిత మీడియా సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా నర్సింహా మాట్లాడుతూ ఎన్నికల కోడ్ అమల్లోకి రావడానికి ముందే సూర్యాపేట జిల్లా, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పెన్పహాడ్, ఎస్.అన్నారం సబ్ సెంటర్ ఆశావర్కర్ కవిత అక్టోబర్ 7న ఫార్వర్డ్ చేసిన మెసేజ్ ఆధారంగా సస్పెండ్ చేశారని తెలిపారు. రాష్ట్రంలో ఎన్నికల కోడ్ అక్టోబర్ 9 మధ్యాహ్నం 12 గంటల నుంచి అమల్లోకి వస్తే అంతకు ముందు ఫార్వర్డ్ చేసిన మెసేజ్‌కు ఎన్నికల కోడ్ ఎలా వర్తిస్తుందని ఆయన ప్రశ్నించారు. కవిత గత 17 ఏండ్ల నుంచి క్రమశిక్షణతో విధులు నిర్వహించిన బలహీనవర్గాలకు చెందిన మహిళ అని తెలిపారు. కవిత బీఆర్ఎస్‌కేవీలో ఆశావర్కర్ల యూనియన్ జిల్లా నాయకత్వంలో ఉండి ఆ యూనియన్‌తో తమ హక్కులు సాధించు కోలేమని గ్రహించి బయటికి వచ్చిందని చెప్పారు. దీంతో బీఆర్ఎస్‌కేవీ అనుబంధ హెచ్1 యూనియన్ నాయకులు సుదర్శన్, ఇతరులు కక్ష పెంచుకుని ఫిర్యాదు చేశారని తెలిపారు.

దీంతో సంబంధిత జిల్లా కలెక్టర్ మౌఖిక ఆదేశాలతో జిల్లా వైద్యాధికారి ఆదేశాలతో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ విచారణ జరిపారని తెలిపారు. కవిత ఫోన్ నుంచి మెసేజ్ ఫార్వర్డ్ అయిన మాట వాస్తవమే అయినప్పటికీ, అది ఎన్నికల కోడ్ పరిధిలోకి రాదనే విషయాన్ని పరిగణన లోకి తీసుకోలేదని చెప్పారు. కేవలం అధికార పార్టీ యూనియన్ నాయకుల ఫిర్యాదుతో హడావుడీగా విచారించి కనీసం షోకాజ్ నోటీస్ ఇవ్వ కుండా, సస్పెండ్ కాలాన్ని కూడా పేర్కొనకుండా సస్పెండ్ ఆదేశాలిచ్చారని నర్సింహ ఆగ్రహం వ్యక్తం చేశారు. డిఎంహెచ్‌ఓ, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించారని స్పష్టమవుతున్నందున వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. అధికారుల తీరుపై కేంద్ర, రాష్ట్ర ఎన్నికల సంఘాల తో పాటు రాష్ట్ర మానవ హక్కుల కమిషన్, రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్, డైరెక్టర్ ఆఫ్ హెల్త్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు. అవసరమైతే న్యాయస్థానాన్ని ఆశ్రయి స్తామని హెచ్చరించారు. ఒక వేళ డీఎంహెచ్‌ఓ, డిప్యూటీ డీఎం హెచ్‌ఓ చర్యలను కలెక్టర్ ఆమోదించి ఉంటే ఆయనపై కూడా చర్యలు తీసు కోవాల్సి ఉంటుందని తెలిపారు. అధికారులు స్పందించి వెంటనే కవితకు జీతం చెల్లించాలనీ, వెంటనే విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

లాల్ సలామ్ కామ్రేడ్

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

దేశ పోరాట చరిత్రలో అగ్రగామిగా శతాబ్ది ప్రజ్వలన చేసిన కామ్రేడ్ ఎన్. శంకరయ్యకు అశ్రునయనాలతో తుది వీడ్కోలు పలికారు. ప్రభుత్వ అధికారిక లాంఛనాలతో అంత్యక్రియలు జరిగాయి. తమిళ రాజకీయాల్లో సీపీఐ(ఎం) చిహ్నంగా నిలిచిన నాయకుడికి వీడ్కోలు పలికేందుకు దేశం మొత్తం చెన్నైకి తరలివచ్చింది. గుండెను పిండేసే బాధను సైతం లెక్కచేయకుండా పిడికిలి బిగించి తమ ప్రియతమ సహచరుడికి సెల్యూట్ చేశారు. చెన్నైలోని టి నగర్‌లో సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ కార్యాలయం (పి.రామమూర్తి భవన్), దాని పరిసరాలు తమిళనాడులోని మారుమూల గ్రామాల నుంచి చిన్నారులు, మొద లుకుని వృద్ధుల వరకు రావటంతో..కిక్కిరిసిపోయాయి. తమ ప్రియతమ నేత ను కడసారి చూసేందుకు ప్రజలు, కార్యకర్తలు తండోపతండాలుగా వచ్చారు. తమ నేత భౌతికంగా లేకపోవడాన్ని జీర్ణించుకోలేక అనేక మంది కన్నీరు మున్నీ రయ్యారు. భౌతికకాయాన్ని పి. రామమూర్తి స్మారకం వద్దకు తీసుకెళ్లారు. సీపీఐ(ఎం) ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి, పొలిట్‌బ్యూరో సభ్యులు ప్రకాశ్ కరత్, రామకృషన్, కేరళ రాష్ట్ర కార్యదర్శి ఎంవీ గోవిందన్, అఖిల భారత కిసాన్ సభ అధ్యక్షుడు అశోక్ ధావలే, ఐద్వా అధ్యక్షురాలు పీకే శ్రీమతి, సీపీఎం కేరళ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు పీకే బిజు, డీవైఎఫ్ఐ అఖిల భారత అధ్యక్షుడు ఎఎ రహీమ్, సినీ నటులు పార్తీపన్, సత్యరాజ్, సినీనటి రోహిణి తదితరులు కూడా నివాళులర్పించారు. అంతకు ముందు అంతిమ యాత్ర కొనసాగింది. యాత్ర అగ్రభాగంలో సీతారాం ఏచూరి, ప్రకాశ్ కరత్, కేంద్ర మాజీ మంత్రి, డీఎంకే ఎంపీ ఎ.రాజా, సీపీఐ(ఎం) నేతలు ఉన్నారు. 1.5 కిలో మీటర్ పొడవున యాత్ర కొనసాగింది. బసంత్ నగర్ స్మశానవాటికకు చేరు కున్న తరువాత, అక్కడ సంతాప సభ జరిగింది. సీపీఐ(ఎం) నేతలు సీతారాం ఏచూరి, ప్రకాశ్ కరత్, అశోక్ దావలేతో పాటు డీఎంకే ఆర్గనైజింగ్ సెక్రెటరీ ఆర్.ఎస్ భారతి, పెరియర్ సంఘం నేత కె. వీరమణి, సీపీఐ సహాయ కార్య దర్శి పెరియర్ స్వామి, సీనియర్ జర్నలిస్టు ఎన్.రామ్, ఎండిఎంకె ఎంపీ వైగో, వీసీకే ఎంపీ తిరుమవలవన్ పాల్గొన్నారు. ఎన్. శంకరయ్య పోరాటాలను గుర్తు చేసుకున్నారు. స్వాతంత్ర్య పోరాటం నుంచి, కమ్యూనిస్టు ఉద్యమం, కులవ్యతి రేక, అంటరానితనం వ్యతిరేక పోరాటాలు, సంస్కరణోద్యమాలు గురించి వివరించారు. అనంతరం ప్రభుత్వలాంఛనాలతో అంత్య క్రియలు నిర్వహించారు.

వైరా ప్రాజెక్ట్ ఆయకట్టు రక్షణకు చర్యలు

అఖిల పక్ష రైతు సంఘాల విజ్ఞప్తి

- ప్రాజెక్టులో నీటి మట్టం అడుగంటింది : డీఈ శ్రీనివాసరావు

నవతెలంగాణ- వైరా



వైరా ప్రాజెక్ట్ నీటి మట్టం అడుగంటడంతో ఆయకట్టు పరిధిలో 20 వేల ఎకరాల వరి పంట గింజ పోసుకునేదశలో ఎండిపోయే పరిస్థితులు ఏర్పడ్డాయని, వెంటనే పాలేరు చెరువు నుంచి నీటిని విడుదల చేసి ఆదుకోవాలని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. ఖమ్మం జిల్లా వైరా ఐబీ కార్యాలయం ఎదుట అఖిల పక్ష రైతు సంఘం ఆధ్వర్యంలో రైతులు డీఈ శ్రీనివాసరావును కలిసి పరిస్థితి తీవ్రతను వివరించారు.

కూత వేటు దూరంలో ప్రాజెక్టు ఉన్నా గండ గలపాడు గ్రామంలో నీరు లేక వరి తెల్ల కంకిగా మారుతుం దని రైతులు వరి దుబ్బులు తీసుకొచ్చి నీటిపారుదల శాఖ డీఈకి చూపించి ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బొంతు రాంబాబు మాట్లాడుతూ.. పాలేరులో 22 అడుగుల నీరు ఉన్నదని, వైరా ప్రాజెక్ట్ వరి పంట రక్షణకు కనీసం ఒక అర టీఎంసీ విడుదల చేయాలని గత నెల 31న జిల్లా కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశామని తెలిపారు. అనంతరం ఎంపీ నామా నాగేశ్వరరావును కలిసి పరిస్థితి వివరించామన్నారు. ఎన్నికల పర్యటనలో భాగంగా ముఖ్యమంత్రి కొత్తగూడెం వచ్చిన సమయంలో కూడా వైరా ప్రాజెక్ట్‌కు ఏర్పడిన ముప్పును వివరించగా నీరు విడుదలకు హామీ ఇచ్చారని, కానీ ఏ హామీ నెరవేరలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఒకటి రెండు రోజుల్లో నీరు విడుదల చేసి పంటలు రక్షించకపోతే.. ఎన్నికల నిబంధనలను పక్కన బెట్టి ఆందోళనకు పూనుకుంటామని, తమకు పంటల రక్షణ కంటే ఏదీ ముఖ్యం కాదని హెచ్చరించారు. అంతేగాక వైరా నియోజక వర్గంలో పోటీలో ఉన్న అన్ని పార్టీల, స్వతంత్ర అభ్యర్థులకు పరిస్థితిని వివరించి నీరు విడుదల చేసే వరకు రైతు ఆందోళనలో భాగస్వాములు కావాలని కోరతామని తెలిపారు. భవిష్యత్‌లో జరిగే ఆందోళనలో రైతులు పెద్ద సంఖ్య లో పాల్గొని వరి పంటను రక్షించుకావాలని విజ్ఞప్తి చేశారు.

ఈ సందర్భంగా డీఈ మాట్లాడుతూ.. ప్రాజెక్ట్‌లో 14 అడుగుల నీటి మట్టం మించి ఉంటేనే సాగుకు నీరు విడుదల చేయాలని నిబంధనలు విధించారని, అయినా మూడు రోజుల క్రితం వరకు నీరు విడుదల చేసినట్టు తెలిపారు.

ప్రస్తుతం 9.9 అడుగుల నీటి మట్టం మాత్రమే ఉన్నదన్నారు. పాలేరు చెరువు నుంచి తక్షణం ఒక టీఎంసీ నీరు వైరా ప్రాజెక్టులోకి విడుదల అయితేనే 80 శాతం పంట వచ్చే అవకాశం ఉంటుందని తెలిపారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు తెలిపామని, ప్రకృతి కూడా పగ బట్టినట్టు ఉన్నదని, ఒక్క వర్షం కూడా లేకపోవటం నష్టానికి కారణమన్నారు. ఉన్నతాధికారులకు నివేదిక ఇచ్చి, రైతుల ఆందోళనను కూడా చెబుతామని చెప్పారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు తాతా రంగారావు, వీసీ సత్యనారాయణ, మేడా శరాబంది, గొల్లపూడి హరినాథ్ బాబు, మల్లేంపాటి రామారావు, బాజోజి రమణ, హరి వెంకటయ్య, బెజవాడ వీరభద్రమ్, కురుకుంట్ల శ్రీనివాసరావు, పారుపల్లి కృష్ణారావు, ఇనపనూరి శ్రీను, కామినేని రవి, పల్లెబోయిన కృష్ణ, వడ్లమూడి మధు, తదితరులు పాల్గొన్నారు.

ప్రయాణికుల సంఖ్యలో గణనీయమైన వృద్ధి

- దక్షిణ మధ్య రైల్వే

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

సాధారణ, స్లీపర్ తరగతి ప్రయాణీకుల సంఖ్యలో గణనీయమైన వృద్ధి నమోదైందని దక్షిణ మధ్య రైల్వే అధికారులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. దక్షిణ మధ్య రైల్వే వివిధ వర్గాల ప్రయాణీకులకు సేవలందించడం లో ముందంజలో ఉందని తెలిపారు. అధిక సంఖ్యలో వారికి రైలు సేవలను అందించడానికి, కొత్త రైళ్లను ప్రవేశపెట్టడం, ప్రత్యేక రైళ్లను నడపడం, అదనపు స్టాపేజ్‌లు, కోచ్‌ల సంఖ్య పెంపుదల వంటి అనేక చర్యలను చేపట్టిందని పేర్కొన్నారు. దక్షిణ మధ్య రైల్వే ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మొదటి ఏడు నెల్లలో 15.75 కోట్ల మంది ప్రయాణీకులకు రవాణా సౌకర్యాన్ని అందించిందని తెలిపారు. పండుగల వంటి ప్రత్యేక సందర్భాల్లో ప్రయాణీకుల డిమాండ్ ఉన్న మార్గాలను నిరంతరం పర్య వేక్షిస్తున్నదని తెలిపారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చే ప్రయాణికుల సౌకర్యార్థం దక్షిణ మధ్య రైల్వే రోజుకు 664 రైళ్లను నడిపిందని పేర్కొన్నారు.

చిదంబరం ప్రకటన వెనక్కి తీసుకున్నందునే బలిదానాలు :పొన్నాల లక్ష్మయ్య

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కాంగ్రెస్ నేత చిదంబరం తెలంగాణపై ప్రకటనను వెనక్కి తీసుకున్నందునే యువకులు బలిదానం చేసుకున్నారని బీఆర్ఎస్ నేత పొన్నాల లక్ష్మయ్య విమర్శించారు. కేసీఆర్‌పై చిదంబరం చేసిన వ్యాఖ్యలను ఆయన ఖండించారు. తెలంగాణ చరిత్రను వక్రీకరించవద్దని కోరారు. రాజ్యాంగానికి లోబడి రాష్ట్ర ప్రభుత్వం అప్పులు తీసుకుంటున్నదన్నారు. కాంగ్రెస్ నేతలకు దమ్ముంటే రాజస్థాన్ అప్పులపై చర్చించాలని సవాల్ చేశారు.

వేదాంతకు షాక్

మైనింగ్‌కు వ్యతిరేకంగా నిరసన

- ఒడిశాలో దళితులు, ఆదివాసీల పోరాటం



భువనేశ్వర్ : ఒడిశాల్లో వైదాంత మైనింగ్‌కు అక్కడి దళితులు, గిరిజనుల నుంచి వ్యతిరేకత వ్యక్తమైంది. తమ నివాస ప్రాంతాన్ని, దాని గుర్తింపును మైనింగ్ నుంచి కాపాడుకునేందుకు సిద్ధమయ్యారు. తిజ్మాలి (ప్రభుత్వ రికార్డుల్లో 'సిజిమాలి'గా సూచిస్తారు) పర్వత ప్రాంతంలోని బంతేజీ గ్రామంలోని మహిళలు అక్టోబర్ 16న ఒడిశాలోని రాయగడలోని సుంగర్ పంచాయితీ కాశీపూర్ బ్లాక్‌లో జరిగిన షెడ్యూల్ పబ్లిక్ హియరింగ్‌లో ప్రజలు తమ వాదనలను వినిపించారు. "తిజ్మాలిని తవ్వడానికి ఎలా అనుమతిస్తాము? తిజ్మాలి మన ఆత్మ. మన ఆత్మ లేకుండా మనం ఎలా జీవించగలం? మైనింగ్ ఇక్కడి ప్రాంతాన్ని నాశనం చేస్తుంది. అలా జరగడానికి మనం ఎలా అనుమతించగలం? మన కోసం, మన అడవుల కోసం, అందుబాటులో ఉన్న అన్ని విధాలుగా పోరాడుతాం. కానీ వేదాంతాకు మన ఆత్మను అప్పజెప్పం" అని అక్కడి ప్రజలు గట్టిగా నిర్ణయించుకున్నారు.

ఆదివాసీ, దళిత సంఘాలు తరతరాలుగా తిజ్మాలికి సంరక్షకులుగా ఉన్నారు. తిజ్మాలి అనేది స్వదేశీ ప్రాదేశిక వర్గాల చారిత్రక దుర్వినియోగం, వారి ఆధ్యాత్మిక జీవిత-ప్రపంచాలతో పరస్పర సంబంధానికి ఒక ఉదాహరణ. ఇది తూర్పు కనుమల శ్రేణి యొక్క 1,000 చ.కి.మీ పొడవున్న దక్షిణ భాగంలో భాగంగా ఉన్నది. ఇది కలహండిలోని థుముల్ రాంపూర్ బ్లాక్ మరియు ఒడిషాలోని రాయగడ జిల్లాలోని కాశీపూర్ బ్లాక్ రెండింటిలోనూ విస్తరించి ఉన్నది. కలహండిలోని థుముల్ రాంపూర్ బ్లాక్, రాయగడ జిల్లాలో మొత్తం రాజ్యాంగబద్ధంగా ఐదో షెడ్యూల్‌లోని ప్రాంతాలు.

ఈ కొండలో సాసుబౌమాలి, బాటింగ్మాలి, మజింగ్మాలి, కుట్రుమాలి, ఖండువల్మాలి వంటి అనేక పొరుగు పర్వత శిఖరాలు ఉన్నాయి. ఈ మాలి (పర్వతం) ప్రతి ఒక్కటి ఈ ప్రాంతాలలో నివసించే స్వదేశీ జనాభా జీవన ప్రపంచంలో గొప్ప సామాజిక-జీవ-సాంస్కృతిక ప్రాముఖ్యతను కలిగి ఉన్నది. కర్లపట్ వన్యప్రాణుల అభయారణ్యం యొక్క ఎకో-సెన్సిటివ్ జోన్, సహజమైన ఏనుగు, పులి, పాంగోలిన్ ఆవాసంగా చెప్తారు. అలాగే, థుముల్ రాంపూర్ బ్లాక్‌లోని ఖండువల్మాలికి ఆనుకొని ఉన్నది. ఇది ప్రతిపాదిత మైనింగ్ సైట్. ఇది తిజ్మాలి కొండలకు సమీపంలో ఉన్నది.

మార్చి 1న వేదాంత లిమిటెడ్ 1549.022 హెక్టార్ల (దాదాపు 1880 ఫుట్‌బాల్ మైదానాలకు సమానం) విస్తీర్ణంలో తిజ్మాలిలో బాక్సైట్ తవ్వకాల కోసం బిడ్డర్‌గా ఒడిశా ప్రభుత్వ స్టీల్ అండ్ మైన్స్ డిపార్ట్‌మెంట్ నుంచి లెటర్ ఆఫ్ ఇంటెంట్‌ను అందుకున్నది. వేదాంత అంచనా వేసిన 311 మిలియన్ టన్నుల బాక్సైట్ నిల్వ నుంచి సంవత్సరానికి 9 మిలియన్ టన్నులను వెలికితీయాలని ప్రతిపాదించింది.

ఆగష్టు 14న, ఎంఓఈఎఫ్‌సీసీ వేదాంతకు పర్యావరణ ప్రభావ అంచనా నోటిఫికేషన్, 2006 ప్రకారం నియమ నిబంధనలను మంజూరు చేసింది. ఒక నెలలోపు, సెప్టెంబర్ 13న, ఒడిశా రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి (ఓఎస్‌పీసీబీ) పబ్లిక్ హియరింగ్‌ల నిర్వహణకు నోటీసులు ఇచ్చింది. ఇది రాయగడ, కలహండి జిల్లాల్లో కంపెనీలు పర్యావరణ క్లియరెన్స్ ఆమోదం పొందేందుకు తప్పనిసరి ప్రక్రియ. "ఈ తప్పనిసరి ప్రక్రియలో భాగంగా వేదాంత సమర్పించిన డ్రాఫ్ట్ ఈఐఏ నివేదిక తిజ్మాలి గురించిన కీలక సమాచారాన్ని అణిచివేసింది. ఈ నివేదిక కోసం నిర్వహించిన అధ్యయనాలు తప్పుడు వాదనల ఆధారంగా ఉన్నాయి. ఇది వేదాంతకు జవాబుదారీతనం నుంచి తప్పించుకోవడానికి తగినంత అవకాశాన్ని ఇస్తుంది" అని వేదాంత ఈఐఏ నివేదికను అధ్యయనం చేసిన ఒక వన్యప్రాణి జీవశాస్త్రవేత్త అన్నారు.

తిజ్మాలి గని లీజు ప్రాంతం రాయగడ, కలహండి అనే రెండు అడ్మినిస్ట్రేటివ్ జిల్లాల పరిధిలోకి వస్తుంది కాబట్టి ప్రతి జిల్లాకూ ప్రత్యేక పబ్లిక్ హియరింగ్‌లు ఉండాలి. దీని ప్రకారం, మొదటి పబ్లిక్ హియరింగ్ అక్టోబరు 16న రాయగడ కోసం కాశీపూర్ బ్లాక్‌లోని సుంగర్ పంచాయతీలో, రెండోది అక్టోబర్ 18న థుముల్ రాంపూర్ బ్లాక్‌లోని కెర్పై పంచాయితీలో కలహండి కోసం నిర్వహించబడింది. ఇందులో ఇక్కడి ప్రజలు వేదాంతకు వ్యతిరేకంగా తమ వాదనలను వినిపించారు. మైనింగ్‌ను వ్యతిరేకించారు.

మైనింగ్ నిర్వహణ కోసం వేదాంత కంపెనీ చేసిన కుటిల యత్నాలను సైతం అక్కడి ప్రజలు తీవ్రంగా వ్యతిరేకించారు. పబ్లిక్ హియరింగ్‌లో మైనింగ్ ప్రాజెక్టుకు మద్దతుగా ప్రజలను ఆకర్షించడానికి డబ్బు, ఉచితాలను వాగ్దానం చేసింది. జులై 30న అనేక గ్రామాలకు చెందిన సుమారు 200 మంది మహిళలు, యువకులు, పురుషులు వేదాంత మైనింగ్ ప్రాజెక్ట్‌ను నిరసించారు. గ్రామసభ ఆమోదం లేకుండా తమ గ్రామాల్లోకి ప్రవేశించినందుకు వేదాంత కంపెనీవారిని మందలించారు. అలాగే, ఆగష్టు 4న, వందలాది మంది ప్రజలు లక్రిస్ గ్రామంలో గుమిగూడి ఉండగా.. వేదాంత మైనింగ్ ప్రాజెక్ట్‌కు అంగీకరించడానికి గ్రామస్తులకు లంచం ఇవ్వడానికి ప్రయత్నించినందుకు కంపెనీ అధికారులను మరోసారి ప్రజలు ఎదురించారు. అయినప్పటికీ, కంపెనీ అధికారులు గ్రామాల్లోకి ప్రవేశించి తిజ్మాలి కొండపైకి వెళ్లడానికి అనేక ప్రయత్నాలు చేశారు. మైనింగ్ ప్రాజెక్టుకు మద్దతుగా రూ.1,500 జమ చేస్తామని హామీ ఇవ్వడంతో అధికారులు ప్రజల బ్యాంకు ఖాతా, ఆధార్ కార్డు వివరాలను సేకరిస్తున్నారని పలువురు గ్రామస్తులు ఆరోపించారు. "కొండల మైనింగ్‌ను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాం. అందుకే పోలీసులు మమ్మల్ని లక్ష్యంగా చేసుకుంటున్నారు. తరచూ అర్ధరాత్రి దాడులు చేస్తున్నారు. మా ఊరి యువకులు, పెద్దలు అడవుల్లో తలదాచుకుంటున్నారు. వేదాంత-మైత్రి ఇక్కడికి వచ్చినప్పటి నుండి మాకు జీవితం దుర్భరంగా మారింది" అని అక్కడి ప్రజలు వాపోతున్నారు.

డాక్టర్ రవికుమార్‌పై చర్యలు తీసుకోండి

- రిజ్వీకీ, టీఎస్ఎంసీ రిటర్నింగ్ అధికారికీ హెచ్ఆర్‌డీఏ ఫిర్యాదు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తెలంగాణ స్టేట్ మెడికల్ కౌన్సిల్ (టీఎస్ఎంసీ) ఎన్నికల్లో నిలోఫర్ ఆస్పత్రి పీడియాట్రిక్స్ విభాగం మాజీ విభాగాధిపతి డాక్టర్ రవికుమార్ అక్రమాలకు పాల్పడుతున్నారని హెల్త్ కేర్ రిఫార్మ్స్ డాక్టర్స్ అసోసియేషన్ (హెచ్ఆర్‌డీఏ) ఆరోపించింది. ఈ మేరకు ఆయనపై చర్యలు తీసుకోవాలని కోరుతూ హెచ్ఆర్‌డీఏ తరపున అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ కె.మహేశ్ కుమార్ వైద్యారోగ్యశాఖ కార్యదర్శి రిజ్వీతో పాటు టీఎస్ఎంసీ ఎలక్షన్ రిటర్నింగ్ అధికారికి గురువారం లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. పూర్తి చేయని బ్యాలెట్ పేపర్లు (బ్లాంక్ పోస్టల్ బ్యాలెట్)లను సేకరించాలని పోస్ట్ గ్రాడ్యుయేట్లపై ఒత్తిడి తెస్తూ బెదిరిస్తున్నారని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. డాక్టర్ రవికుమార్ వాట్సప్ మెసేజ్‌లతో కూడిన స్క్రీన్ షాట్‌ను ఫిర్యాదుతో జత చేసినట్టు మహేశ్ కుమార్ తెలిపారు.

నిష్పక్షపాతంగా వ్యవహరించాలి

- ఈ మేరకు సీబీఐకి సిఫారసు చేయాలి
- కేంద్ర హెూం మంత్రికి మణిపూర్‌లోని ఐటీఎల్ఎఫ్ విజ్ఞప్తి

ఇంఫాల్ : మణిపూర్‌లో రెండు వర్గాల మధ్య కొనసాగుతున్న జాతి కలహాల విషయంలో నిష్పక్షపాతంగా, సమానంగా వ్యవహరించాలని కేంద్ర హెూం మంత్రి అమిత్ షా, సీబీఐ డైరెక్టర్ ప్రవీణ్ సూద్‌లను ఆదివాసీ గిరిజన నాయకుల ఫోరం (ఐటీఎల్ఎఫ్) కోరింది. ఈ మేరకు ఏజెన్సీకి సిఫారసు చేయాలని విజ్ఞప్తి చేసింది. చురచంద్‌పూర్ జిల్లాలోని గుర్తింపు పొందిన కుకి-జో తెగల సమ్మేళనం అయిన ఐటీఎల్ఎఫ్ "దౌర్జన్యాలకు నిరసనగా కుకీ-జో-మెజారిటీ చురచంద్‌పూర్ పట్టణంలో భారీ ర్యాలీ తర్వాత డిప్యూటీ కమిషనర్ ద్వారా అమిత్ షా, సూద్‌లకు సమర్పించిన 10 పేజీల మెమోరాండంలో తన అభ్యర్థనను చేసింది. నిరసనకారులు మణిపూర్‌లోని బీజేపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దర్యాప్తు సంస్థలు మెయిటీ కమ్యూనిటీ ద్వారా గిరిజనులపై అఘాయిత్యాల కేసులను దర్యాప్తు చేయాలని డిమాండ్ వినిపించారు. మే 3న ప్రారంభమైన జాతిహింస ఘర్షణలో కనీసం 181 మంది మరణించిన విషయం విదితమే. ఈ అల్లర్లను నియంత్రించే విషయంలో విఫలమైన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తాయి.

తెలంగాణలో అత్యధిక ద్రవ్యోల్బణం

- కేంద్ర మాజీ మంత్రి పి.చిదంబరం

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్



అన్ని రంగాల్లో బీఆర్ఎస్ సర్కారు విఫలమైందని కేంద్ర మాజీ మంత్రి పి.చిదంబరం విమర్శించారు. తెలంగాణతో తనకు 2008 నుంచి అనుబంధముందని తెలిపారు. దేశంలో అత్యధిక ద్రవ్యోల్బణం తెలంగాణలోనే ఉందన్నారు. గురువారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో పార్టీ నేతలతో కలిసి ఆయన విలేకర్లతో మాట్లాడారు. రాష్ట్రంలో ద్రవ్యోల్బణం, నిరుద్యోగం బాగా పెరిగిందన్నారు. ఇది జాతీయ సగటు కన్నా ఎక్కువ ఉందని చెప్పారు. నిత్యావసరాల ధరలు భారీగా పెరిగాయని తెలిపారు. పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలూ ఎక్కువగానే ఉన్నాయని చెప్పారు. వ్యాట్ ఎక్కువగా వసూలు చేస్తోందన్నారు. తెలంగాణలో నిరుద్యోగ రేటు 7.8 (పురుషులు), 9.5 (మహిళలు)గా ఉందన్నారు. గ్రామీణ నిరుద్యోగ రేటు జాతీయ సగటు కన్నా తెలంగాణలో అధికంగా ఉందన్నారు. రాష్ట్రంలో 1.91 లక్షల పోస్టులు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. 20వేల ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయలేదని విమర్శించారు. టీఎస్‌పీఎస్సీలో 22 లక్షల మంది నిరుద్యోగులు రిజిస్టర్ అయ్యారని గుర్తు చేశారు. వారికి నిరుద్యోగ భృతి చెల్లించడంలో సర్కారు విఫలమైందన్నారు. రాష్ట్ర అప్పులు రూ.3.66 లక్షల కోట్లకు పెరిగాయని ఆందోళన వ్యక్తం చేశారు. దీంతో సంక్షేమ పథకాల అమలు కష్టంగా మారిందన్నారు. విద్య, వైద్యానికి కేటాయింపులు దారుణంగా పడిపోయాయని విమర్శించారు. పోషకాహార లోపంతో ప్రజలు బాధపడుతున్నారని తెలిపారు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టేందుకు కాంగ్రెస్ పార్టీకి ప్రజలు ఒక్క అవకాశం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. అధికారంలోకి వచ్చిన వెంటనే ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామని హామీ ఇచ్చారు.

రేషన్‌షాపుల ద్వారా తొమ్మిది సరుకులు

ప్రతి రైతుకు భూఆధార్‌కార్డు

- ధరణి స్థానంలో భూ మాతా లేదా భూభారతి పోర్టల్
- అసైన్డ్ భూములకు యాజమాన్యపు హక్కులు
- పేదల పెళ్లిళ్లకు రూ. లక్ష ఆర్థిక సాయం, తులం బంగారం
- కాంగ్రెస్ మ్యానిఫెస్టోను నేడు ఆవిష్కరించనున్న ఖర్గే

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

ఎన్నికల ప్రచారంలో భాగంగా కాంగ్రెస్ తన ఎన్నికల మ్యానిఫెస్టోను శుక్రవారం విడుదల కానుంది. ఏఐసీసీ అధ్యక్షులు మల్లిఖార్జున ఖర్గే గాంధీభవన్‌లో శుక్రవారం ఆ ప్రణాళికలను ఆవిష్కరించనున్నారు. అన్ని వర్గాలను ఆకర్షించే విధంగా మ్యానిఫెస్టోను సిద్ధం చేశామని కాంగ్రెస్ చెబుతుంది. ఆరు గ్యారంటీలకు అనుబంధంగా అన్ని వర్గాలకు లబ్ధి చేకూర్చే విధంగా పలు అంశాలను ఎన్నికల మేనిఫెస్టోలో చేర్చినట్టు తెలిసింది. మాజీ మంత్రి శ్రీధర్‌బాబు నేతృత్వంలో ఏర్పాటైన కమిటీ అన్ని ప్రజా, కుల సంఘాలు, మత పెద్దలు, అనేక సామాజిక వర్గాలకు చెందిన నాయకులను, ఉద్యోగులు, నిరుద్యోగులను సంప్రదించి ప్రణాళికను రూపకల్పన చేసినట్టు కాంగ్రెస్ వర్గాలు వెల్లడించాయి.

మ్యానిఫెస్టోలోని ముఖ్యాంశాలివే...

- ఏకకాలంలో రూ.2లక్షల పంట రుణమాఫీ
- రూ.3లక్షల వరకు వడ్డీలేని పంట రుణాలు
- వ్యవసాయానికి 24గంటల నిరంతర ఉచిత విద్యుత్
- ధరణి స్థానంలో భూమాతా లేదా భూభారతి పోర్టల్...ప్రతి రైతుకు భూ ఆధార్‌కార్డు ఇస్తాం.
- ప్రతి ఏటా జాబ్ క్యాలెండర్...సకాలంలో నోటిఫికేషన్లు
- సీపీఎస్ రద్దు...పాత పెన్షన్ స్కీమ్ అమలు
- అసంఘటిత కార్మికుల కోసం కార్పొరేషన్
- బీసీలకు 12 కార్పొరేషన్లుతోపాటు వైశ్యులకు సైతం కార్పొరేషన్ .
- ఎంబీసీలకు ప్రత్యేక కార్పొరేషన్
- అభయహస్తం పునరుద్ధరణ
- విద్యార్థులకు ఉచిత ఇంటర్నెట్ సౌకర్యం
- పోడు భూములకు పట్టాలు
- వికలాంగులకు ఉచిత బస్సు ప్రయాణం, పెన్షన్ రూ.6వేలు
- జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు, మెట్రోలో ఉచిత ప్రయాణం, మీడ కమిషన్ ఏర్పాటు
- ఆరోగ్య శ్రీ పరిమితి రూ 10 లక్షలకు పెంపు... దాని పరిధిలోకి మోకాలి సర్జరీ
- ఆర్ఎంపీ, పీఎంపీలకు గుర్తింపు కార్డులు
- ప్రయివేటు విద్యాలయాల్లో భోధన, భోధనేతరులకు ఉద్యోగ భద్రత కోసం ప్రత్యేక జీవో జారీ
- కాళేశ్వరం ప్రాజెక్టు అవినీతిపై హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ
- గ్రామ పంచాయతీలకు చెరువుల నిర్వహణ, మరమ్మతుల బాధ్యత అందుకోసం తగినన్ని నిధులు
- మెగా డీఎస్సీ ప్రకటించి.. ఆరు నెలల్లో టీచర్ పోస్టుల భర్తీ
- బడ్జెట్‌లో విద్యారంగానికి 15శాతం నిధులు కేటాయింపు
- మధ్యాహ్న భోజన పథకం కార్మికులకు నెలకు రూ.10వేల వేతనం
- మూతబడిన దాదాపు 6వేల పాఠశాలలను పున్ణప్రారంభిస్తాం
- కొత్తగా నాలుగు ట్రిపుల్ ఐటీలు ఏర్పాటు చేస్తాం
- ప్రభుత్వ ఆసుపత్రులను ఆధునికీకరించి మెరుగైన వైద్యం అందిస్తాం
- భూహక్కుల సమస్యల పరిష్కారానికి ల్యాండ్ కమిషన్ ఏర్పాటు
- సర్పంచ్‌ల ఖాతాల్లో గ్రామ పంచాయతీ అభివద్ధి నిధులు జమ
- గామ పంచాయతీ వార్డు మెంబర్లకు నెలకు రూ.1,500 గౌరవ వేతనం
- ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు పెండింగ్ డీఏలు చెల్లిస్తాం
- కొత్త పీఆర్సీ ఏర్పాటు చేసి.. ఆరు నెలల్లో అమలు చేస్తాం
- ఇప్పటికే ఆరు గ్యారంటీలతోపాటు రైతు, మహిళా, మైనార్టీ, బీసీ, ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్ల హామీ

అమరవీరుల స్థూపం వద్ద మంత్రి కేటీఆర్, గోరటి వెంకన్నకు అనుమతి ఎలా ఇచ్చారు

ఎన్నికల కమిషన్‌కు నిరంజన్ ప్రశ్న

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

కొత్తగా నిర్మించిన అమరవీరుల స్థూపం వద్ద మంత్రి కేటీఆర్, గోరటి వెంకన్న ఇంటర్వ్యూకు అనుమతి ఎలా ఇచ్చారని టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షులు జి నిరంజన్ ప్రశ్నించారు. గురువారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడారు. అక్కడ కొత్త సచివాలయం, అంబేద్కర్ విగ్రహం కనపడేలా షూటింగ్ చేశారని ఆరోపించారు. ఆ ఇంటర్వ్యూపై విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. కవులు, కళాకారులకు గోరటి వెంకన్న ఒక మచ్చలా మారారని విమర్శించారు. కాంగ్రెస్‌కు కూడా అనుమతి ఇవ్వాలని కోరారు.

కాంగ్రెస్‌కు టీపీఎస్ సంపూర్ణ మద్దతు

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

కాంగ్రెస్ పార్టీకి తెలంగాణ ప్రజా సమితి (టీపీఎస్) సంపూర్ణ మద్దతు ప్రకటించింది. ఎన్నికల్లో ఆ పార్టీకి ఓట్లు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేసింది. గురువారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఏఐసీసీ కార్యదర్శి చల్లా వంశీచంద్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో టీపీఎస్ అధ్యక్షులు నీరా కిషోర్ ప్రకటించారు.

హంతకుడే సంతాపం తెలిపినట్టు చిదంబరం తీరు

మంత్రి హరీశ్ రావు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కాంగ్రెస్ నేత చిదంబరం వ్యాఖ్యల తీరు హంతకుడే సంతాపం తెలిపినట్టు ఉందని మంత్రి హరీశ్ రావు విమర్శించారు. ఎక్స్ వేదికగా స్పందించిన హరీశ్ రావు తెలంగాణ ప్రకటన చేసిన చిదంబరం ...దాన్ని వెనక్కి తీసుకున్న ఫలితంగానే ఉద్యమంలో యువకులు బలిదానం చేశారని తెలిపారు. నెహ్రూ ప్రభుత్వం తాత్సారం కారణంగానే పొట్టి శ్రీరాములు చనిపోయారని చెప్పారు. అప్పటికే హైదరాబాద్ అనేది ఒక రాష్ట్రంగా ఉందనే విషయాన్ని చిదంబరం మరిచిపోయారని తెలిపారు.

18న బీజేపీ మ్యానిఫెస్టో : లక్ష్మణ్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

తమ పార్టీ మ్యానిఫెస్టోను ఈ నెల 18న కేంద్ర హోంమంత్రి అమిత్‌షా చేతుల మీదుగా విడుదల చేయబోతున్నట్టు బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షులు, ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్ ప్రకటించారు. రాష్ట్రంలోని యువతకు ఉద్యోగాలు రావాలంటే బీఆర్ఎస్ ప్రభుత్వం పోవాలన్నారు. ఎన్ని ప్రయత్నాలు చేసినా సిరిసిల్లలో, గజ్వేల్, కామారెడ్డిలో తండ్రీకొడుకులు కేసీఆర్, కేటీఆర్ ఓడిపోవడం ఖాయమని చెప్పారు. సందట్లో సడేమియా లాగా కాంగ్రెస్ దూరాలని చూస్తోందన్నారు. గురువారం హైదరాబాద్‌లోని హోటల్ కత్రియాలో ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలోని 60 లక్షలకుపైగా ఉన్న యువత ఈ ఎన్నికల్లో ప్రధాన ప్రచార అస్త్రంగా మారారని చెప్పారు. నిరుద్యోగులు వాడవాడలా కేసీఆర్ ప్రభుత్వ మోసాలను వివరిస్తూ కేసీఆర్ ప్రభుత్వాన్ని ఓడించడమే లక్ష్యంగా ప్రచారం చేస్తున్నారన్నారు. రాష్ట్రంలో 3 లక్షలకుపైగా ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని చెప్పారు. టీఎస్‌పీఎస్సీలో 25 లక్షల మంది యువకులు తమ పేర్లను నమోదుచేసుకుని నోటిఫికేషన్ల కోసం ఎదురుచూస్తున్నారన్నారు. ఒక్క గ్రూప్ 1 నోటిఫికేషన్ వేయకుండా ప్రభుత్వం ఉదాసీనంగా వ్యవహరించిందని విమర్శించారు. కేసీఆర్ కుటుంబానికి ఉద్యోగాలు వచ్చాయిగానీ యువతకు రాలేదని చెప్పారు.

నేడు అమిత్‌షా..19న నడ్డా రాక

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలో ఎన్నికల ప్రచారం నిమిత్తం కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షా, బీజేపీ జాతీయ అధ్యక్షులు జేపీ నడ్డా తెలంగాణకు రానున్నారు. శుక్రవారం రాత్రి 10 గంటలకు అమిత్‌షా బేగంపేట విమానాశ్రయానికి చేరుకోనున్నారు. ఐటీసీ కాకతీయలో ఆయన విశ్రాంతి తీసుకుని 18న ఉదయం 10:30కు హోటల్ కత్రియాలో బీజేపీ మ్యానిఫెస్టోను విడుదల చేస్తారు. ఆ తర్వాత సకలజనుల విజయ సంకల్ప సభల్లో(గద్వాల, నల్లగొండ, వరంగల్)లో పాల్గొంటారు. అదే రోజు సాయంత్రం సికింద్రాబాద్లోని క్లాసిక గార్డెన్‌లో ఎమ్మార్పీఎస్, దాని అనుబంధ సంఘాల రాష్ట్ర నాయకులతో ప్రత్యేకంగా భేటీ కానున్నారు. తదనంతరం ఆయన అహ్మదాబాద్‌కు వెళ్లిపోతారు.

చైనాకు అనుకూల దిశగా తైవాన్ ఎన్నికలు?

బీజింగ్ : తైవాన్‌లో జనవరిలో జరగనున్న అధ్యక్ష ఎన్నికల్లో సంయుక్తంగా పోటీచేయాలని ఆ దేశంలోని చైనా అనుకూల ప్రధాన ప్రతిపక్ష పార్టీలు నిర్ణయించాయి. ఒకే అధ్యక్ష అభ్యర్థిని ఎన్నికల్లో నిలపాలని కొమిన్టాంగ్(కెఎమ్టి), తైవాన్ పీపుల్స్ పార్టీ(టీపీపీ) కూటమిగా ఏర్పడి ఈ మేరకు బుధవారం ఓ నిర్ణయానికి వచ్చాయి. ఎన్నికల్లో గెలిస్తే ఈ కూటమి సంయుక్తంగా ప్రభుత్వాన్ని ఏర్పాటుచేస్తుంది. ఈ కూటమి టీపీపీకి చెందిన కో వెన్ జె నిగానీ, కెఎమ్టి కి చెందిన హౌ యుహి ని గానీ ఇరువురి ఓటింగ్ గణాంకాల ఆధారంగా అధ్యక్ష అభ్యర్థిగా నిలబెట్టనున్నది. ఈ ఇద్దరిలో ఒకరు ఉపాధ్యక్షుడవుతారు.



పాలక డెమొక్రటిక్ ప్రోగ్రెసివ్ పార్టీ(డీపీపీ)కి చెందిన ప్రస్తుత తైవాన్ ఉపాధ్యక్షుడు లై చింగ్ టే అధ్యక్ష ఎన్నికల పోటీలో ముందున్నారు. తైవాన్ అధ్యక్షురాలుగావున్న సై ఇంగ్వెన్ స్థానంలో అధ్యక్షుడవ్వాలని ఈయన ఆశపడుతున్నాడు. సై ఇంగ్వెన్ ఇప్పటికే రెండు టర్మ్‌లు అధ్యక్షురాలుగా ఉంది. తైవాన్ రాజ్యాంగాన్ని అనుసరించి ఒక వ్యక్తి రెండు టర్మ్‌ల కంటే ఎక్కువ అధ్యక్షుడిగా ఉండకూడదు. ప్రతిపక్ష పార్టీలు కూటమిగా ఏర్పడితే పాలక పార్టీ ఓడిపోయే అవకాశముంటుంది. అదే జరిగితే తైవాన్‌లో చైనా అనుకూల ప్రభుత్వం ఏర్పడుతుంది.

2016లో సై అధ్యక్షురాలైన తరువాత చైనాతో తైవాన్ సంబంధాలు దెబ్బతిన్నాయి. సై అమెరికాకు చెందిన రాజకీయ నాయకులకు ఆతిథ్యం ఇవ్వటం, అమెరికా ఆయుధాలను కొనుగోలు చేయటంవంటి కవ్వింపు చర్యలకు పాల్పడటం జరిగింది. తైవాన్‌లో శాంతి, సుస్థిరతల కోసం చైనాతో సత్సంబంధాలను ఏర్పరచుకోవటానికి బదులుగా డీపీపీకి చెందిన సై కవ్వింపు చర్యలకు పాల్పడుతోందని కెఎమ్టీ, టిపిపి పార్టీలు ఆరోపిస్తున్నాయి.

పెన్షన్ పెంచకుంటే మోడీ ప్రభుత్వాన్ని ఓడిస్తాం

- టీఏపీఆర్‌పీఏ ప్రధాన కార్యదర్శి కృష్ణమూర్తి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్



పెన్షన్ పెంచకపోతే కేంద్రంలోని మోడీ ప్రభుత్వాన్ని ఓడిస్తామని తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ (టీఏపీఆర్‌పీఏ) ప్రధాన కార్యదర్శి పి కృష్ణమూర్తి హెచ్చరించారు. టీఏపీఆర్‌పీఏ రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు గురువారం హైదరాబాద్‌లోని బర్కత్‌పుర వద్ద రీజనల్ ప్రావిడెంట్ ఫండ్ కమిషనర్ కార్యాలయం ముందు "ఈపీఎస్ పెన్షనర్ల విద్రోహ దినం" పేరుతో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణమూర్తి మాట్లాడుతూ కనీస పెన్షన్ రూ.తొమ్మిది వేలు చెల్లించాలనీ, డీఏ జతచేయలనీ, వైద్య సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. 74 లక్షల ఈపీఎస్ పెన్షనర్లలో 50 శాతం మందికి నెలకు రూ.వెయ్యిలోపు పెన్షన్‌తో దుర్భరమైన జీవితం గడపాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. పెన్షన్ పెంచని మోడీ ప్రభుత్వాన్ని వచ్చే ఎన్నికల్లో ఓడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పెన్షనర్లు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. అనంతరం రీజనల్ పీఎఫ్ కమిషనర్‌ను కలిసి పెన్షనర్ల సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో టీఏపీఆర్‌పీఏ రాష్ట్ర నాయకులు ఎమ్ఎన్ రెడ్డి, పి నారాయణరెడ్డి, ఎన్ బ్రహ్మచారి, నరహరి, రాధాక్రిష్ణ, నర్సప్ప, విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బిజినెస్

సహారాపై కేసు కొనసాగుతుంది

- సెబీ చైర్‌పర్సన్ మధాబీ వెల్లడి



ముంబయి : సుబ్రతా రాయ్ మరణించినప్పటికీ సహారా గ్రూపుపై కేసులు యథాతథంగా కొనసాగుతాయని సెక్యూరిటీస్ ఎక్సేంజీ బోర్డు ఆఫ్ ఇండియా (సెబీ) చైర్‌పర్సన్ మధాబీ పూరీ బుచ్ వెల్లడించారు. ముంబయిలో జరిగిన ఫిక్కీ సమావేశంలో మధాబీ మాట్లాడుతూ ఒక సంస్థ నిర్వాహకుడు జీవించి ఉన్నా లేకున్నా.. దానిపై ఉన్న కేసులు యథాతథంగా కొనసాగుతాయని స్పష్టం చేశారు. 2008 సమయంలో సహారా గ్రూపులోని సహారా ఇండియా రియల్ ఎస్టేట్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఎస్ఐఆర్ఇసిఎల్), సహారా హౌసింగ్ ఇన్వెస్‌మెంట్ కార్పొరేషన్ (ఎస్‌హెచ్ఐసిఎల్) నిబంధనలకు విరుద్ధంగా ప్రజల వద్ద నుంచి దాదాపు రూ.20వేల కోట్లు నిధులు సమీకరించి.. ఆర్థిక అవకతవకలకు పాల్పడ్డాయి. రెగ్యులేటరీ చట్టాలను ఉల్లంఘించిన ఈ చర్యలపై సెబీ విచారణ చేపట్టింది. సెబీ నిబంధనలకు విరుద్ధంగా ఆప్షనల్లీ ఫుల్లీ కన్వర్టిబుల్ డిబెంచర్స్ జారీ చేసి మూడు కోట్ల మంది మదుపర్ల నుంచి నిధులు సమీకరించింది. ఈ సేకరించిన నిధులను రీఫండ్ చేయాలని 2011లో సహారా గ్రూప్ సంస్థలకు సెబీ ఆదేశాలు జారీ చేసింది. సుబ్రతా రాయ్ సెబీ ఆదేశాలను విస్మరించారు. ఇది కాస్తా సుప్రీంకోర్టుకు చేరింది. ఆ తర్వాత సెబీ నిర్ణయం సరైందేనని.. రాయ్ అవకతవకలకు పాల్పడ్డారని అత్యున్నత న్యాయ స్థానం తేల్చింది. దోషిగా తేల్చుతూ.. జైలు శిక్ష సైతం విధించింది. మదుపర్ల నుంచి సేకరించిన నిధులపై 15 శాతం వడ్డీతో వారికి చెల్లించాలని 2012 ఆగస్టులో ఆదేశాలు జారీ చేసింది. ఫలితంగా ఇన్వెస్టర్లకు సొమ్ము రీఫండ్ చేసేందుకు రూ.25 వేల కోట్ల నిధులను సెబీ వద్ద సహారా డిపాజిట్ చేసింది. కానీ, నాటి నుంచి ఇప్పటి వరకూ మదుపర్లకు సెబీ కేవలం రూ.138 కోట్లు మాత్రమే రీఫండ్ చేసింది. సుప్రీంకోర్టు నియమించిన కమిటీకి ఇన్వెస్టర్లు సమర్పించిన ఆధారంగా పేమెంట్స్ జరుగుతున్నాయని మాధాబీ పురీ బుచ్ తెలిపారు.

భారత్‌లో మరింత బలోపేతమైన సేవలు

- ఎయిర్ ఆసియా సీఈఓ వెల్లడి

న్యూఢిల్లీ : భారత్‌లో తమ కార్యకలాపాలను మరింత బలోపేతం చేయడంపై దృష్టి కేంద్రీకరించామని ఎయిర్ ఆసియా ఏవియేషన్ లిమిటెడ్ గ్రూప్ సీఈఓ బో లింగం తెలిపారు. భారత్ తమకు ఎల్లప్పుడూ కీలకమైన మార్కెట్ అని పేర్కొన్నారు. తాము ఈ ఏడాది జనవరి - నవంబర్ మధ్య భారతదేశం నుండి 16,01,601 మందిని గమ్యస్థానాలకు చేర్చామన్నారు. ఇది తమ ఛార్జిలు, కనెక్టివిటీ ద్వారా సాధ్యమైందన్నారు. తాము భారతదేశంలో మా ఉనికిని మరింతగా బలోపేతం చేసుకోవడాన్ని కొనసాగిస్తామన్నారు.. త్వరలో తిరువనంతపురానికి కొత్త మార్గాన్ని ప్రారంభించడంతో సహా మా విస్తరణ ప్రణాళికలను ప్రకటించడానికి సంతోషిస్తున్నామన్నారు.

యూకో బ్యాంకు ఖాతాల్లోకి రూ.820 కోట్ల జమ..

- ఐఎంపీఎస్‌లో లోపం..!

న్యూఢిల్లీ : ప్రభుత్వ రంగంలోని యూకో బ్యాంక్ సిస్టమ్‌లో సాంకేతిక లోపంతో బ్యాంకు ఖాతాదారుల ఖాతాల్లో రూ.820 కోట్లు జమ అయ్యాయి. వెంటనే అప్రమత్తమైన బ్యాంక్ రూ.649 కోట్లు రికవరీ చేసింది. ఇమిడిటే పేమెంట్ సర్వీస్ (ఐఎంపిఎస్) సిస్టమ్‌లో సాంకేతిక లోపం నెలకొనడంతో ఈ సమస్య ఉత్పన్నమయినట్టు సమాచారం. ఈ పొరపాటు గుర్తించిన వెంటనే బ్యాంక్ యాజమాన్యం వేగంగా ఆయా ఖాతాలను బ్లాక్ చేసింది. అయినప్పటికీ 79 శాతం సొమ్మును మాత్రమే రికవరీ చేసినట్టు తెలిపింది. మరో రూ.171 కోట్లు వెనక్కు తెప్పించాల్సి ఉందని రెగ్యూలేటరీ సంస్థలకు సమాచారం ఇచ్చింది. ఈ నెల 10-13 తేదీల మధ్య ఐఎంపిఎస్‌లో సాంకేతిక లోపంతో పొరపాటున తమ బ్యాంకు ఖాతాదారుల ఖాతాల్లో జమ అయ్యాయని యూకో బ్యాంక్ తెలిపింది. ఈ పొరపాటు వ్యవహారం ఈ నెల 15 బయటకు వచ్చింది.

స్టాండర్డ్ గ్లాస్‌లో ఆసాహీ రూ.200 కోట్ల పెట్టుబడి

హైదరాబాద్ : గ్లాస్ లైన్డ్ ఎక్విప్‌మెంట్ రంగంలో ఉన్న హైదరాబాద్ సంస్థ స్టాండర్డ్ గ్లాస్ లైనింగ్ టెక్నాలజీలో ఇంజనీర్డ్ గ్లాస్ సిస్టమ్స్ తయారీ కంపెనీ అసాహీ గ్లాస్‌ప్లాంట్ (ఎజిఐ జపాన్) రూ.200 కోట్లు పెట్టుబడి పెట్టింది. దీంతో స్టాండర్డ్ గ్లాస్ లైనింగ్ టెక్నాలజీలో ఎజిఐ జపాన్, జీఎల్ హాకో, అనుబంధ కంపెనీలకు మైనారిటీ వాటా దక్కుతుంది. ఎజిఐతో పాటు ఆ సంస్థకు చెందిన కస్టమర్లు ఆశించే స్థాయిలో కఠిన నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా ప్రయివేటు లేబుల్ ఏర్పాట్లు, సహ-బ్రాండింగ్, విడిభాగాల సరఫరాను ఈ భాగస్వామ్యంలో భాగంగా అమలు చేస్తారు. జీఎల్ హాకో ఉత్పత్తులను పెద్ద ఎత్తున మార్కెట్ చేయడంతో పాటు గ్లాస్-లైన్డ్ రియాక్టర్‌ల భద్రతను పెంపొందిస్తూ ఎస్ఈఎఫ్ గ్లాస్ టెక్నాలజీని రూపొందించాలని స్టాండర్డ్ గ్రూప్ లక్ష్యంగా చేసుకుందని.. జపనీస్ విపణిలోకి తమ సంస్థ ప్రవేశాన్ని ఎజిఐ జపాన్ సులభతరం చేస్తుందని స్టాండర్డ్ గ్రూప్ ఎండి నాగేశ్వర రావు కందుల తెలిపారు.

36 ఎకరాల్లో ప్లాంటు..

ఎజిఐ జపాన్ సిఇఒ యసుయుకి ఇకేడ 2023 మార్చి నుంచి స్టాండర్డ్ గ్లాస్ నాన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా వ్యవహరిస్తున్నారు. అంతర్జాతీయంగా తమ సంస్థ విస్తరణకు ఇకేడ సాయపడుతున్నారని నాగేశ్వర రావు వెల్లడించారు. హైదరాబాద్ సమీపంలో 36 ఎకరాల్లో భారీ స్థాయిలో గ్లాస్ ఎక్విప్‌మెంట్ తయారీ ప్లాంటును స్టాండర్డ్ గ్లాస్ నిర్మిస్తోంది. వెల్డింగ్ రోబోలు, సెమీ ఆటోమేటెడ్ కట్టింగ్, బెండింగ్, వెల్డింగ్ మెషినరీ, అధునాతన వెల్డింగ్ పవర్ సోర్సెస్‌తో సహా అత్యాధునిక మెషినరీని నెలకొల్పుతున్నారు.

మైగ్రేన్ నివారణకు నెరివియో పరికరం

డాక్టర్ రెడ్డీస్ ఆవిష్కరణ

హైదరాబాద్ : దిగ్గజ ఔషధ ఉత్పత్తుల కంపెనీ డాక్టర్ రెడ్డీస్ లాబరేటరీస్ మైగ్రేన్ నివారణకు నెరివియో పరికరాన్ని ఆవిష్కరించినట్లు ప్రకటించింది. ఈ థెరపీ పరికరానికి యునైటెడ్ స్టేట్స్ ఫుడ్ అండ్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్ (యుఎస్ఎఫ్‌డిఎ) ఆమోదం లభించిందని గురువారం డాక్టర్ రెడ్డీస ఓ ప్రకటనలో వెల్లడించింది. నెరివియో అనేది మైగ్రేన్‌లను నివారించడానికి మరియు చికిత్స చేయడానికి యుఎస్ ఎఫ్‌డిఎ ఆమోదించబడిన మొదటి పరికరం. ఇది 12 ఏళ్లు, అంతకంటే ఎక్కువ వయస్సు ఉన్న రోగులలో తీవ్రమైన మైగ్రేన్ చికిత్స కోసం రూపొందించబడిందని తెలిపింది.

పెన్నార్‌కు రూ.669 కోట్ల ఆర్డర్

హైదరాబాద్ : ఇంజనీరింగ్, సొల్యూషన్స్ కంపెనీ పెన్నార్ గ్రూపునకు రూ.669 కోట్ల వ్యాపార అర్డర్లు దక్కినట్టు తెలిపింది. వీటిని ఆర్ఎల్ఆర్ ఇన్‌ఫ్రా, ఎస్ఎస్‌జె డిస్టిలరీస్, అంటరిక్స్ గ్రూపు, టాయిన్ ఇన్‌ఫ్రా, పవర్ మెక్ ప్రాజెక్ట్స్, ఎస్ఆర్ ఎంటర్‌ప్రైజెస్, టివిఎస్ సంఘ్వి, ఎంఎస్ఆర్ అసెట్స్ తదితర కంపెనీల నుంచి అందుకున్నట్లు పెన్నార్ ఓ ప్రకటనలో పేర్కొంది.

రూ. 2.86 కోట్ల నగదు పట్టివేత

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఎన్నికల ప్రవర్తన నియమావళిలో భాగంగా చేపట్టిన తనిఖీల్లో అధికారులు గురువారం రూ.7,95,01,242 విలువ చేసే నగదు, బంగారు, వెండి, మద్యం, మత్తు పదార్థాలు, ఇతర వస్తువులను స్వాధీనం చేసుకుంటున్నారు. ఇందులో రూ. 2,86,29,543 నగదు, రూ.2,94,16,524 విలువ చేసే మద్యం పట్టుబడింది.రూ. 59,19,500 విలువ చేసే మత్తు పదార్థాలు, రూ.1,11,24,000 విలువ చేసే బంగారం, వెండి, రూ.44,11,675 విలువ చేసే ఇతర వస్తువులను అధికారులు పట్టుకున్నారు..అక్టోబర్ 9నుంచి ఇప్పటి వరకు మొత్తం రూ. 577,32,24,246 విలువ చేసే నగదు, బంగారు, వెండి, మద్యం, మత్తు పదార్థాలు, ఇతర వస్తువులను పట్టుకున్నట్టు అధికారులు వెల్లడించారు.



విజయ్ ధరణ్

ప్రేక్షకులను మెప్పించే అన్వేషి

విజయ్ ధరణ్, సిమ్రాన్ గుప్తా, అనన్యా నాగళ్ల హీరో, హీరోయిన్లుగా నటించిన చిత్రం 'అన్వేషి'. అరుణ శ్రీ ఎంటర్‌టైన్మెంట్స్ బ్యానర్‌పై వీజే ఖన్నా దర్శకత్వంలో టి.గణపతి రెడ్డి ఈ చిత్రాన్ని నిర్మించారు.

ఈ సినిమా నేడు (శుక్రవారం) ప్రేక్షకుల ముందుకు వస్తున్న సందర్భంగా హీరో విజయ్ ధరణ్ మీడియాతో మాట్లాడుతూ, 'డైరెక్టర్ విజయ్ ఖన్నా ఆడిషన్స్‌కు పిలవడంతో ఈ మూవీ జర్నీ స్టార్ట్ అయింది. కథ విన్న తరువాత బెస్ట్ ఫిల్మ్ అవుతుందని అనిపించింది. కథలో కొత్త ఎలిమెంట్స్ ఉన్నాయి. ఫ్రెష్‌గా ఉన్నాయి. లవ్‌స్టోరీతో స్టార్ట్ అవుతుంది. హర్రర్ మిక్స్ ఉంటుంది. లవ్ థ్రిల్లర్‌గా అని చెప్పొచ్చు. మారేడు కోన గ్రామంలో దారి సమస్య ఉంటుంది. దీనికి మెయిన్ రీజన్.. ఆసుపత్రిలో అను మానాస్పద ఘటనలు జరుగుతుంటాయి. ఇవి ఎందుకు జరుగుతుంటాయి?, డిటెక్టివ్ అవుదామనుకున్న కుర్రాడు అక్కడికి ఎలా వచ్చాడు? ఆ సమస్యలను ఎలా పరిష్కరించాడు? అనేది కథ. ఓ ఆత్మ వల్ల జరిగిన సంఘటనల కారణంగా సినిమాలో ఇన్వెస్టిగేషన్ ప్రారంభం అవుతుంది. కంప్లీట్‌గా విలేజ్ రూరల్ బ్యాక్‌డ్రాప్‌లో ఉంటుంది. మిస్టరీ అంతా చాలా డిఫరెంట్‌గా ఉంటుంది. అనన్య నాగళ్ల పాత్రలో జీవించింది. చాలా బాగా నటించింది. అయితే కథ అంతా అమ్మాయి చుట్టే ఉంటుంది. అనన్యది చాలా ఇంపార్టెంట్ రోల్. సినిమాలో నా పెయిర్ మాత్రం సిమ్రాన్ గుప్తాతో ఉంటుంది. ఎంటర్‌టైన్‌మెంట్ పాత్రను నాగిణి చేశారు. 'నువ్వే నువ్వే' మూవీలో తరుణ్-సునీల్ తరహాలో అలాంటి కాంబినేషన్ రిపీట్ అయిందని డైరెక్టర్ చెప్పారు. కొంత మందికి షోలు వేసి చూపించాం. అందరూ కథ చాలా ఫ్రెష్‌గా ఉందన్నారు. సినిమా ఆడకపోతే గుండు కొట్టించుకుంటా అని చెప్పా. ఎందుకంటే నేను సినిమాపై నమ్మకంతో ఉన్నాను. అందుకే ఆ స్టేట్‌మెంట్ ఇచ్చా. ఈ ప్రొడక్షన్‌లోనే ఇంకో సినిమా ఉంటుంది. 'అన్వేషి-2' కూడా రాబోతుంది' అని అన్నారు.

నవచిత్రం



మాళవిక శర్మ

దేవిగా మాళవిక శర్మ

సుధీర్ బాబు నటిస్తున్న పాన్ ఇండియా చిత్రం 'హరోం హర'. ది రివోల్ట్.. అనేది ట్యాగ్‌లైన్ 'సెహరి' ఫేమ్ జ్ఞానసాగర్ ద్వారక దర్శకుడు. ఎస్ఎస్‌సి (శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర సినిమాస్) పతాకంపై సుమంత్ జి నాయుడు నిర్మిస్తున్నారు. తాజాగా ఈ చిత్రంలో హీరోయిన్‌గా నటిస్తున్న మాళవిక శర్మను దేవిగా పరిచయం చేస్తూ మేకర్స్ ఫస్ట్ లుక్ పోస్టర్‌ని రిలీజ్ చేశారు. సుబ్రమణ్య స్వామి ముందు నవ్వుతూ ఉన్న మాళవిక పోస్టర్ అందర్నీ ఆకట్టుకుంటోంది. ఈ సినిమాలో సునీల్ కీలక పాత్ర పోషిస్తుండగా, ఇటివలే రిలీజ్ చేసిన ఆయన క్యారెక్టర్ పోస్టర్‌కి కూడా మంచి రెస్పాన్స్ వచ్చింది. చిత్తూరు జిల్లా కుప్పంలో 1989 నాటి నేపథ్యంలో సాగే ఈ కథలో సుధీర్ బాబు కుప్పం యాసలో డైలాగులు పలకనున్నారు. ఈ సినిమా తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో విడుదల కానుంది అని చిత్ర బృందం తెలిపింది.

రాజు యాదవ్
మ్యూజికల్ జర్నీ షురూ



అంకిత ఖరత్, గెటప్ శ్రీను

జబర్దస్త్ ఫేమ్ గెటప్ శ్రీను 'రాజు యాదవ్' సినిమాతో హీరోగా ప్రేక్షకులకు పరిచయం అవుతున్నారు. కృష్ణమాచారిని దర్శకునిగా పరిచయం చేస్తూ సాయి వరుణవి క్రియేషన్స్, చరిష్మా డ్రీమ్స్ ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌లపై కె. ప్రశాంత్ రెడ్డి, రాజేష్ కల్లెపల్లి సంయుక్తంగా ఈ ప్రాజెక్ట్‌ను నిర్మిస్తున్నారు.

ఇటీవల విడుదలైన ఈ సినిమా టీజర్‌కు అద్భుతమైన స్పందన లభించింది. చిత్ర యూనిట్ ఫస్ట్ సింగిల్ 'రాజు యాదవ్ చూడు'ని విడుదల ద్వారా మ్యూజికల్ జర్నీ ప్రారంభించింది. డైరెక్టర్ బాబీ ఈ పాటని లాంచ్ చేశారు. హర్షవర్ధన్ రామేశ్వర్ మ్యూజికల్ మెలోడీని అందించగా, రామ్ మిరియాల తన అద్భుతమైన వాయిస్‌తో మరింత అందంగా ఆలపించారు. చంద్రబోస్ లిరిక్స్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. హీరో తన ప్రేయసి అంకిత ఖరత్ పై తన ప్రేమను వ్యక్తపరుస్తున్నట్లు చాలా అందంగా ఈ అద్భుతమైన మెలోడీ ప్రజెంట్ చేస్తోంది. ఈ పాటలో విజువల్స్ చాలా ప్లజెంట్‌గా ఉన్నాయి. పాటకు ఇన్‌స్టంట్‌గా సూపర్ రెస్పాన్స్ లభించింది. లవ్, కామెడీతో పాటు సినిమాలో హృదయాన్ని హత్తుకునే భావోద్వేగాలు కూడా ఉన్నాయి. ఈ చిత్రానికి సంబంధించి పోస్ట్ ప్రొడక్షన్ పూర్తి అయ్యింది. మేకర్స్ త్వరలో విడుదల తేదీని అనౌన్స్ చేస్తారు' అని చిత్ర యూనిట్ చెప్పింది.





నవతెలంగాణ మారో తీన్‌మార్



ఆటలు

ప్రణయ్ పరాజయం



కుమమోటో : జపాన్ మాస్టర్స్ టోర్నీలో భారత షట్లర్ల పోరాటం ముగిసింది. భారత సీనియర్ షట్లర్ హెచ్.ఎస్ ప్రణయ్ రెండో రౌండ్లో పరాజయం పాలవటంతో.. టోర్నీలో టీమ్ ఇండియా పతక వేటకు తెరపడింది. జపాన్ మాస్టర్స్ సూపర్ 500లో ప్రణయ్ మెన్స్ సింగిల్స్ రెండో రౌండ్లో ఓటమి చెందాడు. చైనీస్ తైపీ షట్లర్ చో చెన్ చేతిలో 21-19, 16-21, 19-21తో మూడు గేముల మ్యాచ్‌లో పోరాడి ఓడాడు.

ఆందోళన.. ఆనందమాయె!

- వాంఖడేలో మహ్మద్ షమి చారిత్రక ప్రదర్శన
- వన్డే క్రికెట్‌లో అత్యుత్తమ గణాంకాలు నమోదు

భారత్, న్యూజిలాండ్ సెమీఫైనల్. ఐసీసీ టోర్నీ నాకౌట్లో మునుపెన్నడూ కివీస్‌పై నెగ్గని చరిత్ర. 398 పరుగుల ఛేదనలో ఆరంభంలోనే దెబ్బతిన్నా కోలుకుంది న్యూజిలాండ్. కేన్ విలియమ్సన్, డార్లీ మిచెల్ స్కోరు ముందుకు నెడుతుండగా.. మ్యాచ్‌లో భారత్ వెనక్కి వెళ్తూ ఆందోళనలో పడింది. మరో 126 బంతుల్లో 210 పరుగులు చేయాల్సిన స్థితిలో కేన్ విలియమ్సన్ అందించిన క్యాచ్‌ను మిడ్ ఆన్‌లో మహ్మద్ షమి నేలపాలు చేశాడు. వాంఖడేలో 33000 మంది అభిమానులతో పాటు యావత్ దేశం ఒక్కసారిగా చప్పబడింది!. షమి క్యాచ్‌ను మ్యాచ్‌నే వదిలేశాడని అనుకున్నారు!. అభిమానులు, డ్రెస్సింగ్‌రూమ్, ఆటగాళ్ల ఆందోళన, అమోయమాన్ని ఆనందమయం చేసేందుకు మహ్మద్ షమికి ఎంతోసేపు పట్టలేదు.

నవతెలంగాణ క్రీడావిభాగం

న్యూజిలాండ్ ఇన్నింగ్స్. 29వ ఓవర్. జస్‌ప్రీత్ బుమ్రా బౌలర్. బుమ్రా సంధించిన ఐదో బంతిని సరిగా అర్థం చేసుకోని కేన్ విలియమ్సన్ మిడ్ ఆన్‌లో బంతిని గాల్లోకి లేపాడు. క్యాచ్‌ను అందుకునేందుకు మహ్మద్ షమి సిద్ధమైనా.. అది పట్టు చిక్కక చేజారింది. విలియమ్సన్ క్యాచ్ నేలపాలు కావటం జస్‌ప్రీత్ బుమ్రా చూడలేకపోయాడు. రెండు చేతులు ముఖానికి అడ్డుగా పెట్టుకుని భావోద్వేగాలను అణచుకున్నాడు. స్టేడియంలోని 33000 మంది అభిమానులు, టెలివిజన్, డిజిటల్ తెరలపై మ్యాచ్‌ను వీక్షించే వారి పరిస్థితి సైతం అటువంటిదే. పది బంతుల వ్యవధిలో న్యూజిలాండ్ ఓపెనర్లను అవుట్ చేసిన మహ్మద్ షమి భారత్‌ను రేసులోకి తీసుకువచ్చాడు. ఇప్పుడు కీలక సమయంలో కివీస్ కెప్టెన్ కేన్ విలియమ్సన్ క్యాచ్‌ను నేలపాలు చేశాడు. టీమ్ ఇండియా ఈ క్యాచ్‌తో వదిలేసి ఫైనల్ బెర్త్‌ను వదిలేసిందా? అనే ఆందోళన, అయోమయం అభిమానుల్లో, ఆటగాళ్లలో, డ్రెస్సింగ్‌రూమ్‌లో ప్రస్ఫుటంగా కనిపించింది.

అనూహ్య తడబాటు!

2023 ఐసీసీ ప్రపంచకప్‌లో టీమ్ ఇండియా జైత్రయాత్ర సాగింది. తొమ్మిది మ్యాచుల గ్రూప్ దశలో ఓ తరహా దండయాత్ర చేసింది. దేశవ్యాప్తంగా మ్యాచులు ఆడిన టీమ్ ఇండియా ప్రత్యర్థి, నగరాలు మారినా.. ఫలితం, ప్రదర్శన మాత్రం పునరావృతం చేసింది. వాంఖడేలో సెమీఫైనల్లో తొలుత 397 పరుగులు చేయటంతో ప్రపంచకప్ నాకౌట్ సైతం జైత్రయాత్రలో భాగమైందనే భావన కనిపించింది. చెన్నైలో ఆస్ట్రేలియాతో గ్రూప్ మ్యాచ్‌లో ఆరంభంలో టాప్ ఆర్డర్ నిష్క్రమించిన తర్వాత టీమ్ ఇండియా తొలిసారి ఓటమి భయం ఎరిగింది వాంఖడేలోనే. కానీ ఫ్లడ్‌లైట్ల వెలుతురులో ఆరంభంలోనే ఓపెనర్లను అవుట్ చేసిన మహ్మద్ షమి మ్యాచ్‌ను లాగేశాడు. కానీ డార్లీ మిచెల్, కేన్ విలియమ్సన్ నెమ్మదిగా ఇన్నింగ్స్‌ను నిర్మించారు. బంతి స్వింగ్ అయ్యే దశను దాటుకుని స్వేచ్ఛగా పరుగులు చేసే స్థితికి చేరారు. దీంతో నాకౌట్ మ్యాచ్‌లో కివీస్‌ను దెబ్బకొట్టే శక్తి కోసం టీమ్ ఇండియా ఎదురుచూసింది. కివీస్‌తో సెమీస్ పోరులో టీమ్ ఇండియా తడబాటుకు గురైంది. రవీంద్ర జడేజా గీత



(నోబాల్) దాటాడు. సూర్యకుమార్ యాదవ్ ఫీల్డింగ్‌లో తడబడ్డాడు. వికెట్ల వెనకాల కెఎల్ రాహుల్ వైడ్లకు అదనంగా బౌండరీలు కోల్పోయాడు. విలియమ్సన్‌ను రనౌట్ చేసే అవకాశం రాహుల్ వృథా చేశాడు. షమి త్రో చేసిన బంతిని అందుకునేందుకు ముందే గ్లౌవ్స్‌తో వికెట్లను తాకాడు. విలియమ్సన్ తొలిసారి జీవనదానం ఇక్కడే పొందాడు. గ్రూప్ దశలో ఎక్కడా చిన్న పొరపాటుకు చోటివ్వని టీమ్ ఇండియా సెమీఫైనల్లో న్యూజిలాండ్ ఒత్తిడికి కాస్త తలొంచింది. ఇదే సమయంలో కేన్ విలియమ్సన్ కుల్దీప్ యాదవ్‌ను టార్గెట్ చేయగా.. షమి, జడేజా ఓవర్లో డార్లీ మిచెల్ ఏకంగా నాలుగు సిక్సర్లు స్ట్రయిట్‌గా బాదాడు. రెండో స్పెల్‌లో బంతి అందుకున్న బుమ్రా ఐదో బంతికి విలియమ్సన్ ఓ తప్పు చేసేలా చేశాడు బుమ్రా. కానీ షమి అనూహ్యంగా ఆ క్యాచ్‌ను అందుకోలేకపోయాడు. 'విపరీత బాధ' గురయ్యానని మ్యాచ్ అనంతరం షమి ఆ క్యాచ్‌పై మనసులో మాట చెప్పగా.. నిజానికి ఆ క్యాచ్ నేలపాలు కావటంతో టీమ్ ఇండియా స్వయంకృతంతో ఓటమి దిశగా పయనిస్తోందా? అనిపించింది. తను చేసిన తప్పిదం మరో మూడు ఓవర్ల పాటు అనుభవించాడు!. ఈ సమయంలో విలియమ్సన్.. కుల్దీప్‌ను స్లాగ్ స్వీప్, బుమ్రాను లాంగ్ లెగ్‌లో బౌండరీలు బాదాడు. డార్లీ మిచెల్.. రివర్స్ స్వీప్, లాంగ్ ఆఫ్, ఫైన్ లెగ్‌లో పరుగులు రాబట్టాడు. ఆ క్యాచ్ నుంచి కథ కివీస్‌కు అనుకూలంగా సాగటం మొదలైంది.

అద్వితీయ కమ్‌బ్యాక్

108 బంతుల్లో 179 పరుగులు. మహ్మద్ షమి రెండో స్పెల్‌లో బంతి అందుకునే సమయానికి ఛేదనలో న్యూజిలాండ్ సమీకరణం. టీ20 యుగం, చేతిలో వికెట్లు ఇదేమంత అసాధ్యం కాదు. కానీ షమి మరో కండ్లుచెదిరే ఓవర్‌తో ఏకంగా కివీస్ కథకే ముగింపు పలికాడు. విలియమ్సన్‌కు స్లాట్ బాల్‌ను సంధించి ఊరించాడు షమి. విలియమ్సన్ బంతిని డీప్ బ్యాక్‌వర్డ్ స్క్వేర్ లెగ్‌లో ఆడగా.. సూర్యకుమార్ యాదవ్ చక్కగా క్యాచ్‌ను చేతుల్లోకి తీసుకున్నాడు. సుమారు 90 నిమిషాల నిశ్శబ్దం నుంచి స్టేడియం మళ్లీ జీవం పూసుకోగా.. డ్రెస్సింగ్‌రూమ్ వాతావరణం సైతం తేలికపడింది. అదే ఓవర్లో కొత్త బ్యాటర్ టామ్ లేథమ్‌ను డెవాన్ కాన్వే, రచిన్ రవీంద్రను అవుట్ చేసిన స్టయిల్‌లో పెవిలియన్‌కు చేర్చాడు. మహ్మద్ షమి దెబ్బకు 220/2తో బలంగా కనిపించిన న్యూజిలాండ్ ఒక్కసారిగా 220/4తో డీలా పడింది. ఇక అక్కడ్నుంచి



జరిగింది అంతా లాంఛనమే. డార్లీ మిచెల్ శతకంతో పోరాడినా.. ఓటమి అంతరం కుదించడానికే. చివర్లో మళ్లీ బంతి అందుకున్న షమి మరో మూడు వికెట్లు పడగొట్టాడు. వన్డే క్రికెట్ చరిత్రలో ఏడు వికెట్లు పడగొట్టిన ఏకైక భారత బౌలర్‌గా చరిత్ర సృష్టించాడు. 17 మ్యాచుల్లోనే 54 వికెట్లు కూల్చిన మహ్మద్ షమి ప్రపంచకప్‌లో ఆల్‌టైమ్ గ్రేట్ బౌలర్‌గా నిలిచాడు!. వరల్డ్‌కప్‌లో షమి నాలుగుసార్లు ఐదు వికెట్ల ప్రదర్శన చేయగా.. ఈ ప్రపంచకప్‌లోనే ఏకంగా మూడుసార్లు ఐదేసి వికెట్లు ఖాతాలో వేసుకున్నాడు. ఎడమ చేతి వాటం బ్యాటర్లకు మహ్మద్ షమి సింహస్వప్నం అయ్యాడు. లెఫ్ట్ హ్యాండర్లకు షమి 52 బంతులు వేయగా.. అందులో 51 బంతులు అరౌండ్ ద వికెట్ నుంచి విసిరాడు. లెఫ్ట్ హ్యాండర్లపై షమి సగటు 4. క్రీజుకు ఆవలగా బంతిని సంధించే షమి ఆడలేని కోణంలో బంతిని ప్రయోగిస్తున్నాడు. షమి సహజ లెంగ్త్‌తో కట్, పుల్ షాట్ ఆడేందుకు సైతం కష్టమే. డ్రైవ్ చేసేందుకు మరీ షార్ట్ అవుతుంది. ఇక వికెట్‌కు ఇరువైపుల ఎటువంటి స్వింగ్ లభించినా.. ఇక బ్యాటర్లకు మరిన్ని చిక్కులు తప్పవు.

ఎదురులేని షమి

రెండేండ్ల క్రితం టీ20 ప్రపంచకప్‌లో పేలవ బౌలింగ్, ఫీల్డింగ్‌తో ఆన్‌లైన్‌లో అతివాదుల ద్వేషానికి గురయ్యాడు. విరాట్ కోహ్లి ఆ సమయంలో మహ్మద్ షమికి అండగా నిలబడ్డాడు. సోషల్ మీడియా వేదికగా మద్దతు ప్రకటించాడు. స్వదేశంలో 2023 ఐసీసీ ప్రపంచకప్ ఆరంభ దశలో జట్టు సమతుల్యం కోసం మహ్మద్ షమి బెంచ్‌కు పరిమితం అయ్యాడు. హార్దిక్ పాండ్య గాయంతో దూరమవగా గ్రూప్ దశలో ఐదో మ్యాచ్ నుంచి తుది జట్టులో ఆడుతున్నాడు. ఆరు మ్యాచుల్లోనే 23 వికెట్లు పడగొట్టిన మహ్మద్ షమి.. అత్యధిక వికెట్లు కూల్చిన బౌలర్‌గా ప్రపంచకప్ ఫైనల్ వేదిక అహ్మదాబాద్‌కు చేరుకున్నాడు. 9.13 సగటు, 5.01 ఎకానమీ, 10.91 స్ట్రయిక్‌రేట్‌తో ప్రపంచకప్‌లో సత్తా చాటుతున్న మహ్మద్ షమికి ఎవరూ సరిలేరు!. ఇటు టీమ్ ఇండియా జైత్రయాత్ర, అటు మహ్మద్ షమి వికెట్ల జాతర.. ఐసీసీ ట్రోఫీ వేటలో భారత జట్టు 12 ఏండ్ల నిరీక్షణకు ఆదివారం అహ్మదాబాద్‌లో ప్రపంచకప్ విజయంతో ఘనంగా తెరపడనుంది!.

మన ప్రత్యర్థి ఆసీస్

- సెమీస్‌లో దక్షిణాఫ్రికా ఓటమి
- మిల్లర్ శతక పోరాటం వృథా
- 3 వికెట్ల తేడాతో ఆసీస్ గెలుపు
- ఐసీసీ 2023 ప్రపంచకప్



నవతెలంగాణ-కోల్‌కత

ఆస్ట్రేలియా వచ్చేసింది. ప్రపంచకప్ టైటిల్ పోరులో ఆతిథ్య జట్టుకు సవాల్ విసిరేందుకు ఐదుసార్లు చాంపియన్ రంగం సిద్ధం చేసుకుంది. కోల్‌కత ఈడెన్‌గార్డెన్స్‌లో గురువారం జరిగిన రెండో సెమీఫైనల్లో దక్షిణాఫ్రికాపై ఆస్ట్రేలియా 3 వికెట్ల తేడాతో గెలుపొందింది. సఫారీలపై విజయంతో ఫైనల్లోకి చేరుకున్న ఆస్ట్రేలియా.. ఆదివారం అహ్మదాబాద్‌లో టైటిల్ పోరులో ప్రియ ప్రత్యర్థి టీమ్ ఇండియాతో తలపడనుంది. 213 పరుగుల సవాల్‌తో కూడిన లక్ష్యాన్ని ఆస్ట్రేలియా కాస్త కష్టపడుతూనే ఛేదించింది. ఓపెనర్ ట్రావిశ్ హెడ్ (62, 48 బంతుల్లో 9 ఫోర్లు, 2 సిక్సులు) అర్ధ సెంచరీతో మెరువగా..వార్నర్ (29), స్మిత్ (30), ఇంగ్లిశ్ (28), కమిన్స్ (17 నాటౌట్) సమిష్టిగా చెమటోడ్చారు. తొలుత బ్యాటింగ్ చేసిన దక్షిణాఫ్రికా డెవిడ్ మిల్లర్ (101, 116 బంతుల్లో 8 ఫోర్లు, 5 సిక్సులు) బాధ్యతాయుత సెంచరీతో 212 పరుగులు చేసింది.

> నవంబర్ 19, అహ్మదాబాద్ మొతెరా స్టేడియంలో 2003 ఐసీసీ ప్రపంచకప్ ఫైనల్ పునరావృతం!. కోల్‌కత ఈడెన్ గార్డెన్స్‌లో రెండో సెమీఫైనల్లో దక్షిణాఫ్రికాపై ఉద్విగ్న విజయం సాధించిన ఆస్ట్రేలియా ప్రపంచకప్ ఫైనల్లోకి ప్రవేశించింది. దీంతో 2003 ప్రపంచకప్ టైటిల్ పోరు రీ మ్యాచ్‌కు 2023 వరల్డ్‌కప్ ఫైనల్లో రంగం సిద్ధమైంది. డెవిడ్ మిల్లర్ (101) శతక పోరాటంతో తొలుత దక్షిణాఫ్రికా 212 పరుగులు చేసింది. సవాల్‌తో కూడిన లక్ష్యాన్ని ఆస్ట్రేలియా 7 వికెట్లు కోల్పోయి 47.2 ఓవర్లలో ఛేదించింది.

ఉత్కంఠ ఛేదనలో.. : ఛేదనలో ఆసీస్‌కు ధనాధన్ ఆరంభం దక్కింది. ఓపెనర్లు ట్రావిశ్ హెడ్ (62), డెవిడ్ వార్నర్ (29) తొలి వికెట్‌కు 60 పరుగులు జోడించారు. మిచెల్ మార్ష్ (0) నిరాశపరిచినా.. స్మిత్ (30), లబుషేన్ (18) నిలబడే ప్రయత్నం చేశారు. స్పిన్‌కు సహకరించిన పిచ్‌పై మాక్స్‌వెల్ (1) నిష్క్రమణతో ఆసీస్ శిబిరంలో కంగారు మొదలైంది. 137 పరుగులే ఐదు వికెట్లు చేజార్చుకున్న ఆసీస్‌ను టెయిలెండర్లు ఆదుకున్నారు. జోశ్ ఇంగ్లిశ్ (28, 49 బంతుల్లో 3 ఫోర్లు), మిచెల్ స్టార్క్ (16, 38 బంతుల్లో 2 ఫోర్లు), పాట్ కమిన్స్ (14 నాటౌట్, 29 బంతుల్లో 2 ఫోర్లు) చివర్లో ఒత్తిడికి ఎదురొడ్డి మరో 16 బంతులు ఉండగానే విజయాన్ని అందించారు.

మిల్లర్ ఒక్కడే : వర్షం ప్రభావిత మ్యాచ్‌లో టాస్ నెగ్గి దక్షిణాఫ్రికా తొలుత బ్యాటింగ్ ఎంచుకుంది. వర్షం అనుకూలత సొమ్ముచేసుకున్న ఆసీస్ పేసర్లు సఫారీ టాప్-4ను లేపేశారు. డికాక్ (3), బవుమా (0), వాండర్ డసెన్ (6), మార్క్‌రామ్ (10)లు 24 పరుగులకే పెవిలియన్‌కు క్యూ కట్టారు. ఈ సమయంలో డెవిడ్ మిల్లర్ (101), హెన్రిచ్ క్లాసెన్ (47) సఫారీ ఇన్నింగ్స్‌ను నిలబెట్టారు. ఐదో వికెట్‌కు 95 పరుగులు జోడించిన ఈ మిల్లర్, క్లాసెన్.. దక్షిణాఫ్రికా శిబిరంలో ఆశలు రేపారు. క్లాసెన్ నిష్క్రమణతో ఓ ఎండ్‌లో మిల్లర్‌కు సహకారం కరువైంది. మార్కో జాన్సెన్ (0), కేశవ్ మహరాజ్ (4) నిరాశపరిచారు. జెరాల్డ్ కోయేట్జీ (19, 39 బంతుల్లో 2 ఫోర్లు), కగిసో రబాడ (10, 12 బంతుల్లో 1 సిక్స్) టెయిలెండర్లలో ఆకట్టుకునే ప్రదర్శన చేశారు. ఆసీస్ పేసర్లు, స్పిన్నర్లు విజృంభిస్తున్న వేళ ఒంటరి పోరాటం చేసిన డెవిడ్ మిల్లర్ 4 ఫోర్లు, 3 సిక్సర్లతో 70 బంతుల్లో అర్ధ సెంచరీ పూర్తి చేశాడు. ఐదు సిక్సర్లు, 8 ఫోర్లతో 115 బంతుల్లోనే శతకం సాధించి ఐసీసీ ప్రపంచకప్ నాకౌట్‌లో సెంచరీ బాదిన తొలి దక్షిణాఫ్రికా క్రికెటర్‌గా రికార్డు నెలకొల్పాడు. 49.4 ఓవర్లలో ఆలౌటైన దక్షిణాఫ్రికా 212 పరుగులు చేసింది.

స్కోరు వివరాలు :

దక్షిణాఫ్రికా ఇన్నింగ్స్ : 212/10 (డెవిడ్ మిల్లర్ 101, క్లాసెన్ 47, మిచెల్ స్టార్క్ 3/34, కమిన్స్ 3/51)

ఆస్ట్రేలియా ఇన్నింగ్స్ : 215/7 (ట్రావిశ్ హెడ్ 62, స్మిత్ 30, ఇంగ్లిశ్ 28, జెరాల్డ్ 2/47, షంషి 2/42)



క్యాన్సర్ ఆమెను కుంగదీసే ప్రయత్నం చేసింది. కానీ దాన్నే ఆమె జయించింది. చికిత్స సమయంలో ఆహారం విషయంలో తాను ఎదుర్కొన్న సమస్యలు ఎవరికీ రాకూడదని భావించింది. నూనెల్లో కల్తీని అరికట్టి స్వచ్ఛమైన నూనెను ప్రజలకు అందించడం తన లక్ష్యంగా పెట్టుకుంది. మంచి ఆరోగ్యాన్ని అందరికీ అందించాలనే తపనతో ఆరోగ్యదాయిని అనే సంస్థను స్థాపించింది. మంచి ఆరోగ్యంతో అందరూ ఉండేలా చూడటమే తన సామాజిక బాధ్యతగా భావించిన ఆమె విజయగాథ నేటి మానవిలో...

ఆరోగ్యదాయిని జయమ్మ

మహబూబ్‌నగర్ జిల్లా జక్లపల్లి గ్రామంలోని వ్యవసాయక కుటుంబం జయమ్మది. ఇల్లే ప్రపంచం అనుకునే మహిళ. ఇల్లు చూసుకుంటూ, వ్యవసాయక పనులను చేసుకుంటూ, నలుగురికి సహాయపడుతూ అందరికీ తలలో నాలుకలా ఉండే జయమ్మపై కళ్ళు కుట్టిన కాలం వేసిన శిక్ష బ్రెస్ట్ క్యాన్సర్. 2018, మార్చి నెలలో ఆమెకు బ్రెస్ట్ క్యాన్సర్ అని నిర్ధారణ అయింది. తాను నిర్మించుకున్న ఆశల సౌధం కళ్ళముందు కూలిపోతున్నట్టుగా అనిపించింది జయమ్మకు. అన్ని రకాల టెస్టులను చేయించుకుని డాక్టర్ల సలహా మేరకు కీమోథెరపీ తీసుకుంది. సైడ్ ఎఫెక్ట్స్‌కు శరీరం పూర్తిగా లొంగిపోయింది. కుటుంబం అందించిన ఆత్మస్థైర్యం, ఆప్యాయత, అనురాగాలతో కీమోథెరపీ, సర్జరీల తర్వాత శరీరంలో కలిగే అనేక మార్పుల నుండి ఉపశమనం పొందగలిగింది.

డాక్టర్ సలహాతో...

చికిత్స చేయించుకుంటున్న జయమ్మకు తెలిసిన డాక్టర్లు ఎన్నో సలహాలు ఇస్తుండేవారు. అందులో భాగంగా మైసూర్‌లోని ఖాదరవలి అనే హెూమియోపతి డాక్టర్ డైట్ మార్చుకోమని సలహా చెప్పారు. మందులు వాడుతూ వంటల్లో పల్లీ, కుసుమ, నువ్వులు, కొబ్బరి నూనెలు వాడమని చెప్పారు. ఈ నూనెలు కొనకుండా గింజలు కొని మరపట్టించి వాడేవారు. అయితే అలా కాకుండా గానుకనూనె వాడమని డాక్టర్ సలహా ఇచ్చారు. దాంతో మహబూబ్‌నగర్‌లో కరెంటు గానుగ నుండి తయారుచేసిన నూనె కొద్ది రోజులు వాడారు. కానీ డాక్టర్ ఎడ్ల గానుగ నూనె అయితే బాగుంటుందని చెప్పారు. ఎడ్లతో నడిచే గానుగ నూనె కొరకు వెదకడం మొదలుపెట్టారు. ఆ నూనె చిత్తూరులో దొరుకుతుందని తెలుసుకొని అక్కడ నుండి తెప్పించుకునేవారు. దీన్ని వాడిన తర్వాత ఆమె ఆరోగ్యంలో మార్పులు గమనించింది. అయితే చిత్తూరు నుండి నూనె తెచ్చుకోవడం చాలా కష్టంగా ఉండేది. దాంతో ఆ ఎడ్ల గానుగను తామే పెట్టి నూనె తయారు చేసుకుంటే ఎలా ఉంటుంది అనే ఆలోచన వచ్చింది. ఆ ఆలోచనే నేటి ఆరోగ్య దాయని ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది.

నిరుత్సాహపడకుండా...

2019 ఫిబ్రవరి నెలలో జయమ్మ గానుగను ప్రారంభించింది. ఫుడ్ లైసెన్స్ కూడా తీసుకుంది. నూనెను స్టోర్ చేసేందుకు గాజు పాత్రలు, మట్టి పాత్రలను ఉపయోగించే వారు. తాను క్యాన్సర్ పేషెంట్ అయినా రెండవసారి సర్జరీ జరిగినా లెక్కచేయకుండా గానుగ కొరకే జీవితాన్ని అంకితం చేసిన గొప్ప మనిషి జయమ్మ. ఆహార పదార్థాలను వండడానికి మంచి నూనె ఉన్నప్పుడే వ్యాధులు శరీరానికి సోకకుండా ఉంటాయి. ఇది స్వయంగా తెలుసుకున్న జయమ్మ కల్తీ లేని నూనెను గింజల నుండి తీయడం మొదలు పెట్టింది. ముందు బంధువులకు ఫ్రీగా సప్లై చేసేది. రాను రాను ఈ విషయం తెలిసిన వారు ఆర్డర్స్ ఇవ్వడం మొదలు పెట్టారు. తర్వాత 20 నుండి 25 మందిని పెట్టుకొని వారికి ఉపాధి కల్పించే స్థాయికి ఎదిగింది.

నేటి యువతకు మార్గదర్శకురాలు

చాలా మంది జయమ్మ సహకారంతో ఆరోగ్యదాయని గానుగ కేంద్రాలను వివిధ జిల్లాల్లో ఏర్పాటు చేసుకున్నారు. గనుక నుండి నూనె ఎలా తీయాలో 170 మందికి ఆమె శిక్షణ కూడా ఇచ్చింది. ఆరోగ్యదాయని ద్వారా కల్తీ లేని నూనె తయారుచేసి అందరికీ సరసమైన ధరలకు అందిస్తున్న జయమ్మ సామాజిక సేవా కార్యక్రమాల్లో కూడా ముందుంటారు. పాఠశాలలో కరెంటును ఏర్పాటు చేయడం, విద్యార్థులకు పుస్తకాలు, యూనిఫామ్‌లు, షూ, బెల్టులు పంచడం ఇలా పేద విద్యార్థులకు కావలసిన వాటిని ఆరోగ్యదాయని సంస్థ ద్వారా అందిస్తున్నారు.



ఇతర దేశాలకు ఎగుమతి

వి హబ్ ద్వారా నూనెను ఇతర దేశాలకు ఎగుమతి చేయడం, వ్యాపారం చేయడంలోని అనేక మెలకువలను తెలుసుకుంది. వారి సహకారంతో గానుగలను ఎక్కువ సంఖ్యలో ఏర్పాటు చేసి దుబాయ్, సింగపూర్, మలేషియా దేశాలకు సైతం కల్తీ లేని స్వచ్ఛమైన నూనె ఎగుమతి చేస్తున్నారు. కర్ణాటక, ఆంధ్ర ప్రదేశ్, పంజాబ్ రాష్ట్రాలకు కూడా నూనెను పంపిస్తున్నారు. ఆరోగ్యదాయని నూనెకు మన రాష్ట్రంతో పాటు ఇతర రాష్ట్రాల్లోనూ మంచి గిరాకీ ఉంది. నూనె తయారు చేసినప్పుడు వ్యర్థ పదార్థంగా మిగిలిపోయే పిప్పిని కూడా పశువుల దానాగా వాడుతున్నారు. ఇతర ప్రాంతాలకు సప్లై చేస్తున్నారు.



స్వయంగా శిక్షణ తీసుకుని

మైసూర్‌లోని డే సిరీ నేచురల్స్ వారి దగ్గర ఒక వారం రోజులు ఉండి గానుగ నుండి నూనె తీసే విధానాన్ని నేర్చుకుంది జయమ్మ. చిత్తూరులో ఉన్న కోదండచారి గానుగను తయారు చేసే వీరికి ఇచ్చారు. అప్పటికి ఆమె వయసు 55. ఆ గానుగకు ఎద్దును కట్టి తానే దగ్గరుండి గానుగను తిప్పేది. గానుగ తిరుగుతూ నువ్వులు, పల్లీల నుండి నూనె వచ్చేది. కానీ నూనె మొత్తం సరిగ్గా వచ్చేది కాదు. ఆ సమస్యను పరిష్కరించుకోవడం కోసం మళ్ళీ ఒక వారం మైసూర్‌లో ఉండి గానుగ తిప్పడం నేర్చుకొని వచ్చింది. అప్పటికే చిత్తూరుకు చెందిన వినోద్ రెడ్డి ఎద్దుల గానుగను ప్రారంభించి నూనె తీస్తూ అందరికీ పంపుతూ వుండేవారు. జయమ్మ తనకు వచ్చే అనుమానాలను వినోద్ రెడ్డి ద్వారా పరిష్కరించుకునేది.

ఆమె ఆశయాలు ముందుకు తీసుకెళతాం

'అనారోగ్యంతో బాధపడుతూ కూడా స్వయంగా గానుగ నడపడం దగ్గర నుంచి నూనె బాటిల్స్‌లో నింపడం వరకు తానే దగ్గరుండి పర్యవేక్షణ జర్యవేక్షించే వారు. అలాంటి మనిషి ఈ ఏడాది మమ్మల్ని అందరినీ వదిలి వెళ్లారు. కల్తీ నూనె అరికట్టి స్వచ్ఛమైన నూనెను ప్రజలకు అందించడమే నా లక్ష్యం అంటూ ఎప్పుడూ అంటుంటారు. కష్టాలకు కుంగిపోకుండా జీవితంలో ఎదురయ్యే ఆటంకాలను ఎదుర్కొంటూ ధైర్యంగా ముందుకు వెళ్లే ప్రతి మహిళలో మా అత్తమ్మ జ్ఞాపకాలు పదిలంగా ఉంటాయి. ఆమె ప్రారంభించిన ఈ సేవా సంస్థను ముందుకు తీసుకెళ్లే ప్రయత్నం చేస్తున్నాం. అత్తమ్మ ఆశయాలకు అనుగుణంగా ఆరోగ్యదాయని నడిపిస్తాం' అంటున్నారు జయమ్మ కొడుకులు శ్రీధర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, కోడలు రాధిక శ్రీనివాస్‌రెడ్డి.

- సి.హెచ్.హరిప్రియ, 9603099334

బ్రేక్ ఇవ్వాల్సిందే...

ప్రపంచ వ్యాప్తంగా సోషల్ మీడియాలో 400 కోట్ల మంది ప్రజలు రోజుకు సుమారుగా 144 నిమిషాలు గడిపేస్తున్నారట. సోషల్ మీడియా ప్రత్యేకతే అది మరి. రకరకాల విషయాలతో ఆకట్టుకుంటూ... ఏదో ఒక అప్‌డేట్, లింక్ పంపుతూ మనకు సమయమే తెలియకుండా చేస్తుంది. దీంతో మనకు తెలియకుండానే సోషల్ మీడియా అడిక్ట్స్ అయిపోతాము. గంటల తరబడి ఆ సైట్లతోనే గడిచిపోతుంది. అందుకే ఇలాంటి సైట్స్ నుంచి బ్రేక్ తీసుకోవాల్సిన అవసరం ఉంది. ఈ సైట్లు, యాప్స్ నుంచి ఒక్కసారి బ్రేక్ తీసుకంటే మీకే తేడా తెలుస్తుంది. ఎంతో ఉత్సాహంగా కనిపిస్తారు అని నిపుణులు చెబుతున్నారు.

- సోషల్ మీడియాతో కొంతవరకు మానసికంగా తోడు దొరుకుతుంది. ఒంటరితనం, భయాలు పోతాయి. వర్చువల్ వరల్డ్‌లో తోడు దొరికితే... ఆనందపడే వారు చాలామంది ఉన్నారు. అది ఆరోగ్యానికి మంచిదే. తోడు దొరికిందన్న సంతోషంతో మానసికంగా మరింత బలవంతులుగా మారుతారు. కానీ సోషల్ ఐసోలేషన్‌తో ఒంటరితనం మిమ్మల్ని వేధిస్తుంది. దీంతో చాలా దుష్పరిణామాలను ఎదుర్కోవాల్సి వస్తుంది. మిమ్మల్ని ఎవరైనా అన్‌ఫాలో చేసినా, సోషల్ మీడియాలో క్లోజ్ అయిన వారు దూరం పెట్టినా మానసిక ఆందోళన బాగా పెరిగిపోతుంది. సోషల్ మీడియా నుంచి కొంతకాలంపాటు బ్రేక్ తీసుకోవడంతో వీటిని జయించవచ్చు అంటున్నారు నిపుణులు.



- సైబర్ సమస్యలు ఎదుర్కోని సెలబ్రిటీలు ఈ మధ్య కాలంలో ఒక్కరు కూడా లేరు. అన్ని వయసుల వారు ఎప్పుడోకప్పుడు ఈ సమస్యను ఎదుర్కొంటూనే ఉన్నారు. ఇతరులతో రోజూ పోలికలు పెట్టి విమర్శించడం ఓ అలవాటుగా మారిన నేటి రోజుల్లో సైబర్ బుల్లియింగ్ విపరీతంగా మారింది. దీనివల్ల మానసికంగా కుంగుబాటు చెందు తున్న వారి సంఖ్య పెరుగుతోంది. ఇది ఆరోగ్యాన్ని దెబ్బతీస్తోంది.
- గంటల తరబడి కూర్చోవడం అంటే బద్ధంకం పెరిగినట్టే. దీంతో శారీరక సమస్యలు కూడా వస్తాయి. పైగా వర్చువల్ వరల్డ్‌లోనే గడిపేందుకు మీరు ఇష్టపడుతూ రియల్ వరల్డ్‌కు దూరంగా ఉండిపోవడానికే ప్రాధాన్యం ఇస్తారు. డైరెక్టుగా కలవటం ఎందుకు హ్యాపీగా లైవ్‌లో మాట్లాడుకోవచ్చు కదా అనుకుంటారు. ఈ ఆలోచనా ధోరణితో మీరు అధిక ఒత్తిడి, ఆందోళనకు లోనవుతారు. అందుకే అప్పుడప్పుడూ డీటాక్స్ అవసరం. ఎప్పుడు బ్రేక్ తీసుకోవాలో మీరే గుర్తించి, ఓ పద్ధతి ప్రకారం తరచూ సోషల్ మీడియా నుంచి బ్రేక్ తీసుకోవడం ఉత్తమం.

తగ్గిన క్యాంపస్ నియామకాలు

(మొదటిపేజీ తరువాయి)

సైన్స్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్, ఎలక్ట్రానిక్స్ ఇన్‌స్ట్రుమెంటేషన్ అండ్ కంట్రోల్ వంటి రంగాల్లో కూడా నియామకాలు తగ్గిపోవడమో లేదా స్థిరంగా ఉండడమో జరుగుతోంది.

తమ యూనివర్సిటీలో గత సంవత్సరం 63 శాతం మంది విద్యార్థులు ఎంపికయ్యారని, ఇప్పుడు వారి సంఖ్య 20-25 శాతానికి తగ్గిందని బీఎంఎల్ మజుందార్ విశ్వవిద్యాలయానికి చెందిన సీనియర్ డైరెక్టర్ సంతానిల్ దాస్‌గుప్తా చెప్పారు. తమ సంస్థలో ఇప్పటి వరకూ 30 శాతం మంది విద్యార్థులు మాత్రమే ఉద్యోగాలు పొందగలిగారని అమిటీ యూనివర్సిటీ ప్లేస్‌మెంట్ విభాగం డిప్యూటీ డైరెక్టర్ అంజని కుమార్ భట్నాగర్ తెలిపారు. నియామకాల పరిస్థితి నిరాశాజనకంగా ఉన్నదని కోనేరు లక్ష్మయ్య యూనివర్సిటీ సీనియర్ ప్లేస్‌మెంట్ డైరెక్టర్ శరవణబాబు అన్నారు. గాల్‌గోటియాస్ యూనివర్సిటీలో ఈ నెల మొదటి వారం నాటికి 45 శాతం మంది చివరి సంవత్సరం విద్యార్థులకు ఉద్యోగాలు లభించాయి. కంపెనీలు వచ్చినా కొద్ది మందిని మాత్రమే తీసుకుంటున్నాయని విద్యా సంస్థలు అంటున్నాయి. గత సంవత్సరంతో పోలిస్తే ఈ ఏడాది క్యాంపస్ నియామకాలు 5-7% తగ్గాయని తెలిపాయి.

కేసీఆర్‌కు బుద్ధి చెప్పాలి

(మొదటిపేజీ తరువాయి)

హక్కుల కోసం పోరాడతారని, అందుకనే కళాశాలను ఏర్పాటు చేయకుండా పేదల రక్తం తాగేందుకే మల్లారెడ్డి కాలేజీలకు అనుమతులు ఇచ్చారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మాజీ ఎమ్మెల్యేలు దేవేందర్ గౌడ్, మలిపెద్ది సుధీర్ రెడ్డి ఉన్నప్పుడే నియోజకవర్గ అభివృద్ధి జరిగిందన్నారు. అంతకుముందు కాంగ్రెస్ శ్రేణులు రేవంత్‌రెడ్డికి క్రేన్ సహాయంతో భారీ గజమాల వేసి బాణసంచా కాల్చి, డప్పు వాయిద్యాలు బతుకమ్మలతో ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే అభ్యర్థి తోటకూర వజ్రేష్ యాదవ్, మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్ రెడ్డి, రాష్ట్ర నాయకులు నక్క ప్రభాకర్ గౌడ్, మున్సిపల్ అధ్యక్షులు వేముల శ్రీనివాస్ రెడ్డి, సాయిపేట శ్రీనివాస్ యాదవ్, కౌన్సిలర్ చాపరాజు, మండల అధ్యక్షులు రమణారెడ్డి పాల్గొన్నారు.

కేంద్రానికి ఆఖరి అవకాశం

- ఆన్‌లైన్‌లో ఔషధాల అమ్మకాలు విధానాల రూపకల్పనపై..

న్యూఢిల్లీ : ఆన్‌లైన్‌లో ఔషధాల అమ్మకాలకు సంబంధించి విధానాలు రూపొందించడానికి కేంద్ర ప్రభుత్వానికి ఢిల్లీ హైకోర్టు ఎనిమిది వారాల సమయం ఇచ్చింది. ఈ పిటీషన్ ఐదేళ్లకు పైగా కొనసాగుతోందని, కాబట్టి ఇదే అఖరి అవకాశమని హైకోర్టు గురువారం స్పష్టం చేసింది. అలాగే, నిర్ణీత వ్యవధిలోగా పాలసీని రూపొందించకపోతే, ఈ అంశాన్ని (ఆన్‌లైన్‌లో ఔషధాల అమ్మకాలకు సంబంధించి విధానాలు రూపొందించే) నిర్వహిస్తున్న ప్రధాన కార్యదర్శి తదుపరి విచారణలో కోర్టుకు వ్యక్తిగతంగా హాజరుకావాలని ఆదేశించింది. తదుపరి విచారణను వచ్చే ఏడాది మార్చి 4కు వాయిదా వేసింది. ఇప్పటికే ఈ పిటీషన్ విచారణ ఐదేళ్లకు పైగా కొనసాగుతోంది, కాబట్టి విధానాన్ని రూపొందించడానికి కేంద్ర ప్రభుత్వానికి తగినంత వ్యవధి లభించింది కాబట్టి కేంద్రానికి చివరి అవకాశంగా ఎనిమిదివారాల సమయం ఇస్తున్నాం' అని గురువారం ఉత్తర్వుల్లో ఢిల్లీ హైకోర్టు స్పష్టం చేసింది. ఈ ఉత్తర్వులను తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ మన్మోహన్, జస్టిస్ మిని పుష్కర్ణతో కూడిన ధర్మాసనం జారీ చేసింది. ఆన్‌లైన్‌లో 'చట్ట విరుద్ధమైన' ఔషధాల విక్రయాలను నిషేధించాలని కోరుతూ దాఖలైన పిటీషన్లను ఢిల్లీ హైకోర్టు విచారిస్తోంది. అలాగే డ్రగ్స్ అండ్ కాస్మెటిక్స్ రూల్స్‌ను సవరిస్తూ కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ 2018 ఆగస్టులో ప్రచురించి ముసాయిదాను సవాల్ చేస్తూ దాఖలైన పిటీషన్లను కూడా కోర్టు విచారిస్తోంది.ఆన్‌లైన్‌లో ఔషధాల విక్రయాలను నియంత్రించే సరైన నిబంధనలు లేనందున, ప్రజల ఆరోగ్యం, జీవితాల ప్రమాదంలో పడతాయని, రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 ప్రకారం లభించిన సురక్షితమైన, ఆరోగ్యకరమైన జీవితం హక్కుపై ప్రభావితం చూపిస్తుందని పిటీషన్‌దారులు తెలిపారు. ఇప్పటికే ప్రతిరోజూ లక్షలాది మందులు ఇంటర్నెట్‌లో అమ్ముడవుతున్నాయని, వీటిల్లో కొన్ని మందులు/ఔషధాల్లో నార్కోటిక్, సైకోట్రోపిక్ పదార్థాలు ఉంటున్నాయని, ఇవి రోగికి మాత్రమే కాకుండా యావత్తు మానవాళికి ముప్పు కలిగిస్తాయని పేర్కొన్నారు.

శాంతి కావాలా..ఘర్షణ కావాలా..!

(మొదటిపేజీ తరువాయి)

చేసేందుకు ఇరు పక్షాలు అంగీకరించాయి. అలాగే ఉన్నత స్థాయిలో ఇరు దేశాల మిలటరీల మధ్య కమ్యూనికేషన్‌ను పునరుద్ధరించుకోవాలని కూడా నిర్ణయించాయి. అక్రమ మందుల సరఫరాలను నియంత్రించడంలో పరస్పరం సహకరించుకునేందుకు ఒక వర్కింగ్ గ్రూపును ఏర్పాటు చేయాలని ఇరువురు నేతలు నిర్ణయించారు. సమానత్వం, గౌరవం ప్రాతిపదికన చైనా-అమెరికా రక్షణ విభాగ వర్కింగ్ గ్రూపుల సమావేశాలు నిర్వహించాలని, సముద్ర జలాల భద్రతపై సంప్రదింపుల యంత్రాంగం సమావేశాలు జరపాలని నిర్ణయించారు. ఇరు దేశాల మిలటరీ ప్రాంతీయ నేతలు క్రమం తప్పకుండా చర్చలు జరపాలని కూడా అంగీకరించారు.

వచ్చే ఏడాదినుండి రెండు దేశాల మధ్య విమానాల సంఖ్యను గణనీయంగా పెంచేందుకు అంగీకారం కుదిరింది. విద్య, అంతర్జాతీయ విద్యార్థులు, యువత, సంస్కృతి, క్రీడలు, వాణిజ్య వర్గాలు తదితర రంగాల్లో పరస్పర మార్పిడులను విస్తరించాలని కూడా నిర్ణయించాయి. వాతావరణ సంక్షోభాన్ని పరిష్కరించేందుకు కార్యకలాపాలను, చర్యలను వేగవంతం చేయాలని ఇరు దేశాలు నిర్ణయించాయి.

బుధవారం ఉదయం దాదాపు 11గంటలకు ప్రారంభమైన సమావేశం 1.35గంటలకు ముగిసింది. ప్రారంభ పలుకులు తర్వాత పలు సెషన్లలో పాల్గొని, వర్కింగ్ లంచ్ చేసిన తర్వాత ఇరువురు నేతలు చారిత్రకమైన ఆ ఎస్టేట్‌లో కాసేపు కలియతిరిగారని మీడియా వార్తలు తెలిపాయి.

సరైన దారి ఎంచుకోవాల్సింది మనమే : జిన్‌పింగ్

శతాబ్ద కాలంలో ఎన్నడూ చూడని విధంగా ఈనాడు ప్రపంచం ప్రధానమైన మార్పులకు లోనవుతోందని జిన్‌పింగ్ పేర్కొన్నారు. చైనా, అమెరికాలకు రెండు అవకాశాలు వున్నాయి. సమైక్యతను, సహకారాన్ని పటిష్టపరచడం, ప్రపంచ సవాళ్ళను ఎదుర్కొనేందుకు చేతులు కలపడం, అంతర్జాతీయ భద్రత, సంక్షేమాలను పెంపొందించడమన్నది మొదటి అవకాశం కాగా, తటస్థ వైఖరితో వుంటూ, కూటముల ఘర్షణలను రెచ్చగొట్టడం, సంక్షోభాలు, చీలికలు దిశగా ప్రపంచం పయనించేందుకు అనుమతించడమన్నది రెండవ అవకాశమని అన్నారు. ఈ రెండు అవకాశాలు రెండు భిన్నమైన మార్గాలు, ఇవి మానవాళి, ఈ భూగోళం భవితవ్యాన్ని నిర్ణయిస్తాయని అన్నారు. ప్రపంచంలోనే అత్యంత కీలకమైన ద్వైపాక్షిక సంబంధంగా చైనా-అమెరికా సంబంధాలను ఈ నేపథ్యంలోనే పరిగణించాల్సి వుందని అన్నారు.

చైనా, అమెరికాలు రెండూ ఒకదాన్ని మరొకటి మార్చడానికి ప్రయత్నించడమనేది పూర్తి అవాస్తవికంగా వుంటుందన్నారు. వీటివల్ల వచ్చే పర్యవసానాలు, ఘర్షణలన్నవి ఎవరికైనా భరించరానివిగానే వుంటాయని జిన్‌పింగ్ నొక్కి చెప్పారు. అధికార పోటీ అన్నది చైనా, అమెరికా, ప్రపంచం ఎదుర్కొనే సమస్యలను పరిష్కరించదన్నారు. ఒకరు విజయం సాధించారంటే అది మరొకరికి అవకాశంగా వుంటుందన్నారు. తనదైన విధానాలు, నిబంధనలతో చైనా అభివృద్ధి సాగుతుందని చెప్పారు. పాత వలసవాద విధానాన్ని చైనాఅనుసరించదన్నారు. ఎస్టేట్‌లో విలేకర్లతో మాట్లాడుతూ బైడెన్, చర్చలు బాగా జరిగాయన్నారు. నిజమైన పురోగతి సాధించామని సోషల్ మీడియాలో వ్యాఖ్యానించారు.

మళ్లీ ముదిరిన వివాదం

(మొదటిపేజీ తరువాయి)

గవర్నర్ ఆమోదం కోసం ఎదురు చూస్తున్నాయి. రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో నడిచే విశ్వవిద్యాలయాల పాలనా వ్యవహారాలకు సంబంధించిన చట్టాల్లో మార్పులు చేస్తూ ప్రతిపాదించిన సవరణ బిల్లులు కూడా వీటిలో ఉన్నాయి. ప్రస్తుత చట్టాల ప్రకారం విశ్వవిద్యాలయ ఛాన్సలర్‌గా గవర్నర్‌కు కొన్ని అధికారాలు ఉంటాయి. యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్‌ను నియమించేది గవర్నరే. ఇప్పుడు ప్రభుత్వం ప్రాతిపాదించిన సవరణల్లో గవర్నర్ అధికారాలకు కోత పెట్టారు. ఈ సవరణ ప్రకారం యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్‌ను ప్రభుత్వమే నియమిస్తుంది. అంతేకాక ఛాన్సలర్‌కు బదులుగా ప్రభుత్వమే విశ్వవిద్యాలయాల్లో తనిఖీలు చేస్తుంది. విచారణలు జరుపుతుంది.

వైస్ ఛాన్సలర్ నియామకం కోసం అభ్యర్థుల్ని సూచించే కమిటీలో ఓ సభ్యుడిని నియమించే అధికారం కూడా ప్రభుత్వానికే ఉంటుంది. 1949వ సంవత్సరపు గుజరాత్ యూనివర్సిటీ చట్టం, 1991వ సంవత్సరపు తెలంగాణ యూనివర్సిటీల చట్టం తరహాలో విశ్వవిద్యాలయాల వైస్ ఛాన్సలర్ల నియామకం విషయంలో గవర్నర్‌కు ఉన్న అధికారాలను నీరు కార్చేందుకు తమిళనాడులో అనేక బిల్లుల్ని రూపొందించారు. 2000వ సంవత్సరపు కర్నాటక యూనివర్సిటీల చట్టాన్ని కూడా తమిళనాడు శాసనసభ పరిశీలించింది. ఈ చట్టం ప్రకారం వర్సిటీల వైస్ ఛాన్సలర్లను నియమించేది గవర్నరే అయినప్పటికీ దానిని ప్రభుత్వ సమ్మతితోనే చేయాలి.

శాసనసభ ఆమోదించిన బిల్లులకు ఆమోదముద్ర వేసేలా గవర్నర్‌ను ఆదేశించాలని కోరుతూ తమిళనాడు ప్రభుత్వం సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. శాసనసభ ఆమోదించిన బిల్లుల్లో 11 బిల్లుల్ని 2020లో, ఏడు బిల్లుల్ని 2022లో, రెండు బిల్లుల్ని ఈ ఏడాది గవర్నరుకు పంపారు. వీటిలో 11 బిల్లులకు ఇప్పటికీ ఆమోదం లభించలేదు. దీంతో ప్రజలు ఎన్నుకున్న రాష్ట్ర ప్రభుత్వానికి, కేంద్రం నియమించిన గవర్నరుకు మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమనే పరిస్థితి ఏర్పడింది. బిల్లుల ఆమోదానికి గవర్నరుకు కాలపరిమితి విధించాలని కూడా తమిళనాడు ప్రభుత్వం న్యాయస్థానాన్ని కోరింది. యూనివర్సిటీల వైస్ ఛాన్సలర్ల నియామకం కోసం సెర్చ్ కమిటీల ఏర్పాటు విషయంలో గవర్నర్ చట్టాలను ఉల్లంఘిస్తున్నారంటూ తమిళనాడు ప్రభుత్వం సుప్రీంకోర్టులో మరో పిటిషన్ కూడా దాఖలు చేసింది.

రాష్ట్ర గవర్నర్ ఆర్.ఎన్. రవి కేవలం బిల్లుల్ని మాత్రమే పెండింగులో ఉంచలేదు. ప్రభుత్వం పంపిన నాలుగు ఫైల్స్‌ను కూడా తన వద్దే అట్టే పెట్టుకున్నారు. తంజావూరులోని తమిళ్ యూనివర్సిటీ మాజీ వైస్ ఛాన్సలర్ పైన, నలుగురు మాజీ మంత్రుల పైన వచ్చిన అవినీతి ఆరోపణలపై విచారణ జరిపేందుకు అనుమతించాలని స్టాలిన్ ప్రభుత్వం గవర్నర్‌ను కోరింది. వాటికి కూడా అతీగతీ లేదు. 54 మంది ఖైదీలను ముందస్తుగా విడుదల చేసేందుకు అనుమతించాలంటూ పంపిన రెండు ఫైల్స్‌కు కూడా గవర్నర్ ఎలాంటి సమాధానం ఇవ్వలేదు. ఇంకో ముఖ్యమైన విషయమేమంటే తమిళనాడు పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఛైర్మన్, సభ్యుల నియామకంపై ప్రభుత్వం పంపిన దరఖాస్తును కూడా గవర్నర్ తన వద్దే ఉంచుకున్నారు. టీఎన్‌పీఎస్సీలో ఛైర్మన్, 14 మంది సభ్యులు ఉండాల్సి ఉండగా ప్రస్తుతం నలుగురితోనే నెట్టుకొస్తున్నారు. దీంతో అనేక కీలక పదవుల్లో నియామకాల ప్రక్రియ ముందుకు సాగడం లేదు.

న్యూస్‌క్లిక్ కేసులో ఈడీ సమన్లు

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

ఆన్‌లైన్ న్యూస్ పోర్టల్ న్యూస్‌క్లిక్ కేసులో అమెరికా మిలియనీర్ నెవిల్లే రాయ్ సింగంకు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) సమన్లు జారీ చేసింది. న్యూస్‌క్లిక్ కు వ్యతిరేకంగా అమెరికా పత్రికలు రాసిన కథనాలు వల్ల కేసు నమోదు చేసి, సోదాలు చేపట్టిన ఈడీ.. కొన్ని ఆస్తులను జప్తు చేసింది.

తాజాగా మనీలాండరింగ్ చట్టం కింద భారత విదేశాంగ శాఖతో చైనాలోని షాంఘైలో ఉన్న నెవిల్లే రాయ్ సింగంకు నోటీసులు పంపింది. ఆయన వాదనలు రికార్డు చేసేందుకు ఢిల్లీ కోర్టు అనుమతించిన నేపథ్యంలో ఈడీ రెండోసారి సమన్లు జారీ చేసింది. న్యూస్‌క్లిక్ వివాదంలో తనపై వచ్చిన ఆరోపణలను నెవిల్లే ఇప్పటికే ఖండించారు.

చైనా నుంచి నిధులు అందుతున్నాయనే ఆరోపణలతో 2021 సెప్టెంబరులో ఢిల్లీలోని న్యూస్‌క్లిక్ కార్యాలయంలో ఈడీ సోదాలు చేసింది. అనంతరం న్యూస్‌క్లిక్ ఎడిటర్- ఇన్-చీఫ్ ప్రబీర్ పుర్కాయస్థ సహా 25 మంది వాంగూల్మాన్ని నమోదు చేసింది. రెండు నెలల క్రితం ఈడీ ఇచ్చిన సమాచారంతో ఢిల్లీ పోలీసులు ఉగ్రవాద వ్యతిరేక చట్టం (ఉపా) కింద కేసు నమోదు చేశారు. అనంతరం ప్రబీర్ ను అరెస్టు చేశారు. విదేశీ విరాళాల నియంత్రణ చట్టం (ఎఫ్‌సీఆర్) నిబంధనలను ఉల్లంఘించిందని సీబీఐ కేసు నమోదు చేసి ప్రబీర్ నివాసం, కార్యాలయాల్లో తనిఖీలు నిర్వహించి ఆస్తులను జప్తు చేసింది. అక్రమ అరెస్టు, కేసులు కొట్టివేయాలని ప్రబీర్ పుర్కాయస్థ దాఖలు పిటిషన్ సుప్రీంకోర్టులో విచారణలో ఉంది.

ఎన్నికల బరిలో 2290 మంది

(మొదటిపేజీ తరువాయి)

అభ్యర్థులకు గాను 19 మంది అభ్యర్థులు పోటీ నుంచి వైదొలగగా 39 మంది పోటీలో నిలిచారు. ఎల్బీనగర్ నియోజక వర్గంలో రాష్ట్రంలోనే అత్యధికంగా 48 పోటీలో ఉన్నారు. ఇక్కడ 57 మందికిగాను 9 మంది తమ నామినేషన్లను ఉపసంహరించుకున్నారు. మల్కాజిగిరి, నాంపల్లి, కోదాడ, ఖమ్మం, కొత్తగూడెం, పాలేరు, నల్గొండ, మునుగోడు, ఉప్పల్, శేరిలింగంపల్లి, ముషీరాబాద్ నియోజకవర్గాల్లో 30 మందికి పైగా పోటీలో ఉన్నారు. బాన్సువాడ, నారాయణ పేటలో అత్యల్పంగా 7 గురు అభ్యర్థులు పోటీ చేస్తున్నారు.. పరిగి, వికారాబాద్, మలక్‌పేట, అంబర్‌పేట, నాంపల్లి, చార్మినార్, బహదూర్‌పూర, నారాయణపేట, గద్వాల, దేవరకొండ, భద్రాచలం, యాకత్‌పుర మొదలగు12 స్థానాల్లో నామినేషన్ దాఖలు చేసిన అభ్యర్థులెవరు ఉపసంహరించుకోలేదు. ఇక జిల్లాల వారీగా చూస్తె సిద్ధిపేట జిల్లాలో అత్యధికంగా నామినేషన్లు ఉపసంహరించుకున్నారు. మొత్తం 200 నామినేషన్లు దాఖలు కాగా 105 మంది బరి నుంచి తప్పుకోగా నాలుగు నియోజక వర్గాల్లో 95 మంది అభ్యర్థులు పోటీలో మిగిలారు. అత్యధికంగా హైదరాబాద్ జిల్లాలో 312 మంది అభ్యర్థులు పోటీ చేస్తున్నారు. ఇక్కడున్న 15 నియోజకవర్గాల్లో మొత్తం 332 నామినేషన్లు దాఖలు కాగా కేవలం 20 మంది మాత్రమే బరి నుంచి వైదొలిగారు.


పోస్టల్ బ్యాలెట్ ఓట్లు 28,057

(మొదటిపేజీ తరువాయి)

దరఖాస్తు చేసుకోగా 16,040 ఓట్లను ఎన్నికల సంఘం వివిధ కారణాలతో తిరస్కరించింది. అత్యధికంగా పోస్టల్ బ్యాలెట్ ధరఖాస్తులు, ఓట్లు సిద్దిపేట జిల్లా నుంచి నమోదయ్యాయి. ఇక్కడ మొత్తం 812 మంది దరఖాస్తు చేసుకోగా 757 ఓట్లు ఆమోదం పొందాయి. అలాగే అత్యల్పంగా దరఖాస్తులు, ఓట్లు బహదూర్ పుర నుంచి నమోదయ్యాయి. ఇక్కడ మొత్తం 11 మంది పోస్టల్ బ్యాలెట్ ఓట్ల కోసం దరఖాస్తు చేసుకోగా, మొత్తం 11 ఓట్లను ఎన్నికల కమిషన్ అనుమతించింది. అత్యవసర విధులు నిర్వహించే ఉద్యోగులు, 80 ఏళ్ల పైబడిన వద్ధులు, అంగవైకల్యం, కోవిడ్‌తో బాధపడుతున్న వారు, ఎన్నికల్లో విధులు నిర్వహించే జర్నలిస్టులు మొదలగు వారు పోస్టల్ బ్యాలెట్‌కు అర్హులు. అయితే చాలా మంది ఫాం..డీ ద్వారా దరఖాస్తు చేసుకున్న వారు, విచారణ సమయంలో అందుబాటులో లేక పోవడం, సరైన ధృవీకరణ పత్రాలు సమర్పించని కారణంగా మూడింట ఒక వంతు దరఖాస్తులు రిజెక్ట్ అయినట్టు తెలుస్తోంది.

నిజాయితీకి పట్టం కట్టండి

(మొదటిపేజీ తరువాయి)



నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాలేరు నియోజకవర్గంలో బీఆర్ఎస్, కాంగ్రెస్ అభ్యర్థులు బడా కాంట్రాక్టర్లు కావడంతో డబ్బు సంచులతో ప్రజలను ప్రలోభ పెట్టి గెలిచేందుకు వస్తున్నారని, అలాంటి వారి మాయమాటలను నమ్మి ప్రజలు మోసపోవద్దని విజ్ఞప్తి చేశారు. తమ్మినేని 50 ఏండ్ల నుంచి పట్టిన జెండా విడవని నిజాయితీపరుడని, అలాంటి వ్యక్తికి మీ అమూల్యమైన ఓటు వేయాలని కోరారు. సీపీఐ సోదరులు ఆలోచించి ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. తోటి సోదర వామపక్ష రాష్ట్ర కార్యదర్శి పాలేరులో పోటీ చేస్తున్నారని, మీ ఓట్లు తమ్మినేనికి వేయాలని సీపీఐ శ్రేణులను కోరారు. సీపీఐ(ఎం) పాలేరు అభ్యర్థి తమ్మినేని వీరభద్రం మాట్లాడుతూ.. వామపక్ష సోదరులు, అభ్యుదయవాదులు, లౌకిక శక్తులు సుత్తి కొడవలి నక్షత్రంపై ఓటు వేయాలని విజ్ఞప్తి చేశారు. తన విజయాన్ని కాంక్షిస్తూ ఈ నెల 25న యం.వెంకటాయపాలెంలో జరిగే బహిరంగ సభకు సీపీఐ(ఎం) ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి వస్తున్నారని, మండలంలోని వామపక్షశక్తులు ఈ సభకు హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో పాలేరు నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రమేష్, షేక్ బషీరుద్దీన్, మండల కార్యదర్శి నంద్ర ప్రసాద్, మండల ఇన్‌చార్జి ఊరడి సుదర్శన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.





బరిలో డాక్టర్లు, ఉద్యోగులు

కాంట్రాక్టర్లు, న్యాయవాదులు సైతం ఉమ్మడి మహబూబ్‌నగర్‌లో రాజకీయ చిత్రం

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో గతంలో అనేక మంది రాష్ట్ర రాజకీయాలను శాసించిన నేతలున్నారు.. క్రమక్రమంగా సీనియర్ నేతలు, రాజనీతిజ్ఞులు, రాజకీయ కుటుంబాలకు చెందిన వారు ఎన్నిలకు దూరంగా జరుగుతున్నారు.. అనేకమంది సీనియర్ రాజకీయ నాయకులు ఉన్నప్పటికీ ఈసారి బరిలో మాత్రం వైద్యులు, ఉద్యోగులు, న్యాయవాదులు, బ్యాంకు ఉద్యోగులు, విద్యాసంస్థల అధిపతులు, కాంట్రాక్టర్లు ఉండటం విశేషం. వీరంతా ఉన్నత కుటుంబాలకు చెందిన వారే. రాష్ట్ర వ్యాప్తంగా చాలా నియోజకవర్గాల్లో ఇదే పరిస్థితి నెలకొంది.

నవ తెలంగాణ మహబూబ్ నగర్ ప్రాంతీయ ప్రతినిధి

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో ఇప్పటివరకు అనేకమంది విద్యావంతులు రాష్ట్ర రాజకీయాలను శాసించారు. ఎమ్మెల్యేగా, ఎంపీగా గెలిచి ఉత్తమ పార్లమెంటేరియన్ అవార్డు అందుకున్న ఎస్ జైపాల్‌రెడ్డిది కల్వకుర్తి నియోజకవర్గం. సురవరం ప్రతాపరెడ్డి, బూర్గుల రామకృష్ణారావు ఈ ప్రాంతం వారే. తాజా శాసనసభ ఎన్నికల్లో విలక్షణమైన నాయకులు బరిలో నిలిచారు. అచ్చంపేట నియోజకవర్గ అభ్యర్థిగా కాంగ్రెస్ నుంచి చిక్కుడు వంశీకృష్ణ నిలబడ్డారు. ఇతను వైద్యశాస్త్రంలో పట్టా పొందారు. ఆయనకు పోటీగా బీఆర్ఎస్ నుంచి గువ్వల బాలరాజు నిలిచారు. ఈయన 2014, 2018లోనూ ఎమ్మెల్యేగా గెలిచారు. ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత న్యాయశాస్త్రంలో పట్టా పొందారు. ఆ తర్వాత డాక్టరేట్ సాధించారు. దీంతో ఇద్దరి విజయావకాశాలపై తీవ్ర చర్చ నడుస్తోంది.

నాగర్ కర్నూల్ నియోజకవర్గంలో ప్రముఖ వ్యాపారవేత్త, బీఆర్ఎస్ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి, కాంగ్రెస్ నుంచి కె.రాజేష్ రెడ్డి బరిలో నిలిచారు. రాజేష్‌రెడ్డి దంత వైద్యులు. అదేవిధంగా మాజీ మంత్రి నాగం జనార్దన్‌రెడ్డి సైతం డాక్టర్ కావడం గమనార్హం. కాంగ్రెస్ టికెట్ రాకపోవడంతో నాగం బీఆర్ఎస్‌లో చేరారు.

నారాయణపేట జిల్లా నియోజకవర్గ బరిలో నిలిచిన ఎమ్మెల్యే, బీఆర్ఎస్ అభ్యర్థి రాజేందర్ రెడ్డి, కాంగ్రెస్ అభ్యర్థి చిట్టెం పర్ణిక రెడ్డి ఇద్దరూ వైద్యులే. మాజీ ఎమ్మెల్యే చిట్టెం నర్సిరెడ్డి మనుమరాలు.. చిట్టెం వెంకటేశ్వర్ రెడ్డి కూతురు పర్ణిక రెడ్డి బరిలో నిలవడంతో ఇక్కడ పోటీ ఆసక్తిగా మారింది.

అలంపూర్ బరిలో నిలిచిన మాజీ ఎమ్మెల్యే కాంగ్రెస్ అభ్యర్థి సంపత్‌కుమార్ న్యాయవాది. ఇక్కడ బీఆర్ఎస్ అభ్యర్థి విజయుడు ఉపాధి హామీ చట్టంలో ఫీల్డ్ అసిస్టెంట్‌గా బాధ్యతలు నిర్వహించారు.

జడ్చర్ల ఎమ్మెల్యే మాజీ మంత్రి చర్లకోల లక్ష్మారెడ్డి వృత్తిరీత్యా వైద్యులు. ఒక పర్యాయం వైద్య ఆరోగ్యశాఖ మంత్రిగా పనిచేశారు. ఈయనకు ప్రత్యర్థిగా ప్రస్తుత ఎన్నికల్లో కాంగ్రెస్ నుంచి అనిరుద్ రెడ్డి పోటీపడుతున్నారు. ఈయన ఉన్నత చదువులు చదివి మొదటిసారి రాజకీయాల్లోకి వస్తున్నారు.

మక్తల్ నియోజకవర్గం నుంచి బీఆర్ఎస్ అభ్యర్థిగా చిట్టెం రామ్మోహన్ రెడ్డి, కాంగ్రెస్ నుంచి వాకిట అశోక్‌కుమార్ బరిలో నిలిచారు. వీరు ఉన్నత చదువులు చదివి రాజకీయ రంగ ప్రవేశం చేశారు. చిట్టెం రామ్మోహన్ రెడ్డికి సీనియర్ కాంగ్రెస్ నాయకునిగా పేరు ఉంది. వాకిట అశోక్ కుమార్ జడ్పీవైస్ పర్సన్ బాధ్యతలు నిర్వహించిన అనుభవం ఉంది. దేవరకద్ర నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థిగా ఆల వెంకటేశ్వర్ రెడ్డి, కాంగ్రెస్ అభ్యర్థిగా గవినోళ్ల మధుసూదన్ రెడ్డి బరిలో నిలిచారు. ఆల కాంట్రాక్టర్ కాగా, గవినోళ్ల హైకోర్టు న్యాయవాద వృత్తి నుంచి రాజకీయాల్లోకి వచ్చారు.

మహబూబ్‌నగర్ నుంచి తెలంగాణ ఉద్యమ నేత, మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్‌గా, గెజిటెడ్ ఉద్యోగుల సంఘం నేతగా పనిచేసిన వి.శ్రీనివాస్‌గౌడ్ ఇప్పటికే రెండు దఫాలుగా ఎమ్మెల్యేగా గెలిచారు. మంత్రిగా ఉన్నారు. ఉద్యోగానికి రాజీనామా చేసి రాజకీయాల్లోకి వచ్చారు. ప్రస్తుతం ఆయనకు పోటీగా కాంగ్రెస్ నుంచి ఎన్నం శ్రీనివాసరెడ్డి బరిలో నిలిచారు. ఈయన కూడా బ్యాంకు ఉద్యోగి. ప్రత్యేక రాష్ట్ర ఉద్యమ సమయంలో ఉద్యోగానికి రాజీనామా చేశారు. రెండున్నర సంవత్సరాలు ఎమ్మెల్యేగా పనిచేసిన అనుభవం ఉంది. ఇద్దరు తెలంగాణ ఉద్యమకారుల మధ్య జరుగుతున్న పోటీలో ఎవరు గెలుస్తారనేది ఆసక్తిగా మారింది.

వనపర్తి నియోజకవర్గంలో పోటీ రసవత్తరంగా మారింది. ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులుగా, ఎమ్మెల్యేగా పనిచేసిన సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి మొదట న్యాయవాద వృత్తిలో ఉండేవారు. మరోసారి వనపర్తి నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేస్తున్నారు. ఇతనికి పోటీగా ప్రముఖ కాంట్రాక్టర్ తుడి మెగారెడ్డి బరిలో నిలిచారు. ఇద్దరి మధ్య గట్టి పోటీ ఉంది.

గద్వాలలో బీఆర్ఎస్ అభ్యర్థి బండ్ల కృష్ణమోహన్‌రెడ్డికి ప్రత్యర్థిగా కాంగ్రెస్ నుంచి జడ్పీ చైర్‌పర్సన్ సరిత తిరుపతయ్య పోటీ చేస్తున్నారు. ఈమె ఉన్నత విద్యావంతురాలు. కల్వకుర్తి నుంచి సీనియర్ నాయకులు బీఆర్ఎస్ అభ్యర్థి జైపాల్ యాదవ్ మంరోసారి బరిలో నిలిచారు. ఇతను టీడీపీలో రాజకీయ అనుభవం సంపాదించారు. కాంగ్రెస్ నుంచి ప్రముఖ విద్యావేత్త రెండుసార్లు ఎమ్మెల్సీగా బాధ్యతలు నిర్వహించిన కసిరెడ్డి నారాయణరెడ్డి బరిలో నిలిచారు. రసవత్తర పోరు నడుస్తోంది.

కొల్లాపూర్‌లో ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ రెడ్డి మరోసారి తలపడుతున్నారు. గతంలో ఇతను కాంగ్రెస్ నుంచి ఎమ్మెల్యేగా గెలిచి బీఆర్ఎస్ తీర్థం పుచ్చుకున్నారు. ఇతనికి పోటీగా కాంగ్రెస్ నుంచి మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు ఉన్నారు. జూపల్లి బ్యాంకు ఉద్యోగి కాగా, బీరం హర్షవర్ధన్‌రెడ్డి హైకోర్టు న్యాయవాదిగా విధులు నిర్వహించారు. జూపల్లి కాంగ్రెస్‌లో చేరడంతో నియోజకవర్గ రాజకీయ ముఖచిత్రం వేడెక్కింది. ఈసారి ఇయోజకవర్గంలో గెలుపు వెరిని వరిస్తుందనేది చర్చోపచర్చలు సాగుతున్నాయి.



తెలంగాణలో మతతత్వ పార్టీలకు స్థానం లేదు

సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎండీ అబ్బాస్

నవతెలంగాణ-చేర్యాల

మతతత్వ పార్టీలకు తెలంగాణలో స్థానం లేకుండా చేయాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎండీ అబ్బాస్ అన్నారు. సీపీఐ(ఎం) జనగామ ఎమ్మెల్యే అభ్యర్థి మోకు కనకారెడ్డికి మద్దతుగా పార్టీ సిద్దిపేట జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డితో కలిసి గురువారం చేర్యాల మండల కేంద్రంలో ఇంటింటి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా విలేకర్ల సమావేశంలో అబ్బాస్ మాట్లాడుతూ.. బీజేపీకి తెలంగాణలో స్థానం లేదన్నారు. బీఆర్ఎస్ నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టును చూస్తే ఈ ప్రభుత్వ పాలన ఎలా ఉందో కండ్లకు అద్దం పడుతుందన్నారు. అసెంబ్లీలో ఒకరిపై ఒకరు పొగడ్తలు, వ్యక్తిగత విమర్శలు తప్ప ప్రజా సమస్యలపై ఎలాంటి చర్చలూ జరపడం లేదన్నారు. ప్రజా సమస్యలపై చర్చలు జరగాలన్నా, సమస్యలు పరిష్కారం కావాలన్నా కమ్యూనిస్టులు అసెంబ్లీలో ఉండాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ(ఎం) నాయకులు దాసరి కళావతి, రాళ్ల బండి శశిధర్, కాముని గోపాలస్వామి, బూడిద గోపి, కొంగరి వెంకట మావో, అత్తిని శారద, బండి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



కుట్టు మిషన్లను పట్టుకున్న పోలీసులు

బీఆర్ఎస్ అభ్యర్థికి సంబంధించినవిగా ప్రచారం

నవతెలంగాణ-నడికూడ

ఓటర్లకు పంపిణీ చేసేందుకు తరలిస్తున్న కుట్టు మిషన్లను పోలీసులు పట్టుకున్నారు. హనుమకొండ జిల్లా నడికూడ మండల చెక్ పోస్ట్ వద్ద గురువారం ఉదయం డీసీఎం వ్యానును పోలీసులు తనిఖీ చేయడంతో అందులో 500 కుట్టు మిషన్లు ఉన్నాయి. వాటిని వరికోల్ తరలిస్తున్నట్టు డ్రైవర్ తెలిపారు. ఆ వాహనాన్ని పరకాల ఆర్డీవో కార్యాలయానికి తరలించారు. అవి పరకాల బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి చల్లా ధర్మారెడ్డికి సంబంధించినవిగా తెలిసింది. అలాగే వరికోల్ గ్రామంలో ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి నిర్మిస్తున్న ఫంక్షన్ హాల్‌లో వందలాది కుట్టు మిషన్లను మహిళలకు పంచేందుకు సిద్ధంగా ఉంచారు.

కుల సంఘాలపై గురి

ప్రధాన పార్టీల అభ్యర్థుల మంతనాలు, దావతులు.. నజరానాలతో తిప్పుకునే ప్రయత్నం

నవ తెలంగాణ-సూర్యాపేట

సామాజిక తరగతులపై ప్రధాన రాజకీయ పార్టీలు ఫోకస్ పెట్టాయి. గంపగుత్తగా ఓట్లు దండుకునేందుకు కుల సంఘాలపై కన్నేశాయి. ఆయా సామాజిక తరగతులను తమ వైపు తిప్పుకునే ప్రయత్నాలు జోరందుకున్నాయి. పోటీలో నిలిచిన అభ్యర్థులు కుల సంఘాల నాయకులను, ఇతర ప్రజా సంఘాల నాయకులను, కార్యకర్తలను కలుస్తూ మద్దతు కోరుతున్నారు. ఫంక్షన్‌హాల్‌లతోపాటు, పండ్ల తోటల్లో రహస్య సమావేశాలు ఏర్పాటు చేస్తున్నారు. ఆయా కులాల సంఘాల ఓట్లను బట్టి నజరానాలు ముట్ట జెప్పుతున్నారు. వీరిని మచ్చిక చేసుకుంటే గంపగుత్తగా ఓట్లు పడతాయని అభ్యర్థులు భావిస్తున్నారు.



సూర్యాపేట జిల్లాలోని సూర్యాపేట, తుంగతుర్తి, కోదాడ, హుజూర్‌నగర్ నియోజకవర్గాల్లో అభ్యర్థులు, నాయకులు ఎన్నికల ప్రచారంలో వ్యూహాత్మకంగా వ్యవ హరిస్తున్నారు. ప్రధానంగా బీఆర్ఎస్, కాంగ్రెస్, బీఎస్పీ, బీజేపీ కుల సంఘాల ఓట్లపై దృష్టిసారించాయి. ఇందుకుగాను అభ్యర్థులు నగదు ప్యాకేజీలను నజరానాలుగా అందజే స్తున్నట్టు విశ్వసనీయంగా తెలిసింది. ఇది సూర్యాపేట నియోజకవర్గంలో హైస్పీడ్‌లో ఉన్నట్టు సమాచారం. బీఆర్ఎస్, బీఎస్పీ అభ్యర్థులు పలు సంఘాలపై దృష్టి సారించారు. ఇందులో భాగంగా ఖర్చుకు వెనుకాడకుండా సంఘాల ఓట్లను గంపగుత్తగా తమ వైపు తిప్పుకొనేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్టు తెలిసింది. కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గంలో తనకున్న ఓట్లను రక్షించుకునే పనిలో పడింది. ఆ పార్టీ అభ్యర్థి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి సంప్రదాయ ఓట్లను కాపాడుకుంటూనే గ్రామాల్లో ఓటర్లను ఆకట్టుకునేందుకు యత్నిస్తున్నారు.

సమస్యలను ప్రస్తావిస్తూ సీపీఐ(ఎం) అభ్యర్థుల ప్రచారం

ఉమ్మడి కుటుంబాలపై ఆరా..

ఉమ్మడి కుటుంబాలతోపాటు ఉద్యో గాలు, వ్యాపారాలు నిర్వహించే వారి కుటుంబాల గురించి అభ్య ర్థులు ఆరా తీస్తున్నారు. స్వయంగా కలిసి లేక ఫోను ద్వారా మాట్లాడుతూ ఆయా కుటుంబాలకు చెందిన ఓట్లు తమ పార్టీ అభ్యర్థికే వేయాలని స్థానిక నేతలు విజ్ఞప్తి చేస్తున్నారు. అదేవిధంగా పలువురిని పార్టీలో చేరేలా చొరవ చూపిన నేతలు ఈసారి తటస్థ ఓటర్లను ఆకట్టుకోవడానికి ఎక్కువ సమయం కేటాయిస్తున్నారు. ఎవరు చెబితే ఓటరు కుటుంబం తమ వైపుకు మళ్లుతుందో తెలుసుకొని మాట్లాడిస్తున్నారు.

ఓటు మాట కోసం దావతులు..

మహిళా సంఘాలు, కుల సంఘాలతో అభ్యర్థులు ఓటు మాట తీసుకునేలా సభలు, సమావేశాలు, దావతులు నిర్వహిస్తున్నారు. గంపగుత్తగా ఈ ఓట్లు తమకే పడతాయని అభ్యర్థులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు రాజకీయాలకు దూరంగా ఉండే ఉద్యోగులు, వ్యాపారులు, ఇతర రంగాల్లోని కుటుంబాలపై దృష్టి సారిస్తున్నారు. అలాంటి వారిని ఎక్కువగా గ్రామీణ ప్రాంతాల్లో అనుచర నాయకులు గుర్తిస్తున్నారు. వారిని కలవడం లేదా ఫోన్లో మాట్లాడటం ద్వారా తమకు ఓటు వేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ క్రమంలో జిల్లాలోని కోదాడ, హుజూర్‌నగర్‌లో పోటీ చేస్తున్న సీపీఐ(ఎం) అభ్యర్థులు మట్టిపెల్లి సైదులు, మల్లు లక్ష్మీ మాత్రం నీతి నిజాయితీ, పార్టీ సిద్ధాంతాలతో ముందు కెళ్తూ తమను గెలిపిస్తే సమస్యలపై అసెంబ్లీలో ప్రజల గొంతుక అవుతామంటూ ప్రజలను అభ్యర్థిస్తున్నారు.

కేసీఆర్ హ్యాట్రిక్ గ్యారంటీ

అధికారంలోకి రాగానే 4 కొత్త పథకాలు : మంత్రి కేటీఆర్

మొయినాబాద్, వికారాబాద్, మర్పల్లిలో రోడ్ షో



నవతెలంగాణ-మర్పల్లి, మొయినాబాద్

రాబోయే ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలవడం, కేసీఆర్ హ్యాట్రిక్ సీఎం కావడం గ్యారంటీ అని మంత్రి కేటీఆర్ అన్నారు. పనిచేసే ప్రభుత్వానికి ఎన్నిసార్లయినా అధికారం కట్టబెట్టొచ్చని తెలిపారు. అధికారంలోకి రాగానే నాలుగు కొత్త పథకాలు అమలు చేస్తామని హామీ ఇచ్చారు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలోని చేవెళ్ల, వికారాబాద్ నియోజకవర్గాల్లో గురువారం మంత్రి రోడ్ షోలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభల్లో కేటీఆర్ మాట్లాడారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఆరు గ్యారంటీలు ఏమో కానీ ఆరు నెలలకోసారి సీఎం మారడం పక్కా అని ఎద్దేవా చేశారు. గతంలో ఇచ్చిన హామీ మేరకు 111జీఓను రద్దు చేసినట్టు తెలిపారు. 40 ఏండ్ల వికారాబాద్ జిల్లా కలను సాకారం చేశామని, దాంతోపాటు వికారాబాద్‌కు మెడికల్ కాలేజీ మంజూరు చేసినట్టు తెలిపారు. చేవెళ్ల ఎమ్మెల్యేగా కాలే యాదయ్యను, వికారాబాద్ ఎమ్మెల్యేగా మెతుకు ఆనంద్‌ను మరోసారి గెలిపించాలని కోరారు. మంత్రి మహేందర్‌రెడ్డి, ఎంపీ రంజిత్ రెడ్డి, ఎమ్మెల్యే అభ్యర్థులు కాలే యాదయ్య, మెతుకు ఆనంద్ పాల్గొన్నారు.

హామీల అమలులో బీఆర్ఎస్ విఫలం

సీపీఐ(ఎం) అభ్యర్థికే ఓటెయ్యాలి : కేంద్ర కమిటీ సభ్యులు జి.నాగయ్య



నవతెలంగాణ-మంచాల, రంగారెడ్డి ప్రతినిధి

గతంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో బీఆర్ఎస్ పూర్తిగా విఫలమైందని, నిత్యం ప్రజల కోసం పనిచేసే సీపీఐ(ఎం) అభ్యర్థిని గెలిపించాలని ఆ పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు జి.నాగయ్య పిలుపునిచ్చారు.

రంగారెడ్డి జిల్లా మంచాల మండలంలోని ఆరుట్ల, చెన్నారెడ్డి గ్రామాల్లో పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు వెంకట్రాములు, నాగయ్యతో కలిసి ఇంబ్రహీంపట్నం అభ్యర్థి పగడాల యాదయ్య ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా నాగయ్య మాట్లాడుతూ.. కమ్యూనిస్టులతోనే ప్రజా సమస్యల పరిష్కారం సాధ్యమవుతుందన్నారు. పేదలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేసిందేమీ లేదని తెలిపారు. సామాన్యుల కోసం పనిచేసే కమ్యూనిస్టులను అసెంబ్లీకి పంపాల్సిన బాధ్యత ప్రజలపై ఉందన్నారు. నాయకులు కె.శ్రీనివాస్‌రెడ్డి, జి.నర్సింహ, కె.జగన్, రావుల జంగయ్య, ఎస్.శ్యామ్ సుందర్ పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన కార్మికులకు ఎర్రజెండా భరోసా : జయలక్ష్మి

మధ్యాహ్న భోజన కార్మికులకు ఎర్రజెండాతోనే భరోసా ఏర్పడుతుందని సీపీఐ(ఎం) రాష్ట్ర నాయకులు జయలక్ష్మి అన్నారు. ఇబ్రహీంపట్నం మండలంలోని పలు గ్రామాల్లో మధ్యాహ్న భోజన కార్మికులను కలిసి సీపీఐ(ఎం) ఎమ్మెల్యే అభ్యర్థి పి.యాదయ్యకు ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మధ్యాహ్న భోజన వ్యవస్థ ఏర్పడినప్పటి నుంచి వారి పక్షాన ఎర్రజెండా మాత్రమే ముందుండి ఉద్యమిస్తోందన్నారు. వారికి వేతనాలు చెల్లించాలని, ప్రతినెలా బిల్లులు విడుదల చేయాలని, అవిశ్రాంత పోరాటం చేశామన్నారు. మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యల పరిష్కారం కోసం చేస్తున్న ఆందోళనల సందర్భంగా కమ్యూనిస్టు నాయకులు, కార్మిక సంఘాల నేతలు లాఠీచార్జీలకు గురయ్యారన్నారు.

పటాన్‌చెరు సమగ్రాభివృద్ధి కోసం..

సీపీఐ(ఎం) అభ్యర్థి మల్లికార్జున్‌కే ఓటెయ్యండి

పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు చుక్క రాములు

పట్టణంలో ఇంటింటి ప్రచారం



నవతెలంగాణ - పటాన్‌చెరు

పటాన్‌చెరు సమగ్రాభివృద్ధి కోసం సీపీఐ(ఎం) అభ్యర్థి జె.మల్లికార్జున్‌ను గెలిపించాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు చుక్క రాములు ఓటర్లను కోరారు. సంగారెడ్డి జిల్లా మండల కేంద్రమైన పటాన్‌చెరు పట్టణంలోని శాంతినగర్, శ్రీనగర్ కాలనీల్లో గురువారం సీపీఐ(ఎం) అభ్యర్థి జె.మల్లికార్జున్‌తో కలిసి ఆయన ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా చుక్క రాములు మాట్లాడుతూ.. పటాచ్‌చెరు నియోజకవర్గం దేశంలోనే పేరుగాంచిన పారిశ్రామిక ప్రాంతమన్నారు. ఇక్కడ వేలాది మంది కార్మికులు ఉన్నారని, ఎన్నికల సందర్భంగా పాలక పార్టీలు కార్మికుల కోసం హామీలు ఇవ్వడం తప్ప చేసిందేమీ లేదని తెలిపారు. కార్మికుల హక్కుల కోసం నిరంతరం పోరాడే నాయకులు మల్లికార్జున్ అని చెప్పారు.

మల్లికార్జున్‌ను గెలిపించుకోవడంతో కార్మికుల తరపున అసెంబ్లీలో గొంతెత్తే అవకాశం ఉంటుందని స్పష్టం చేశారు. సీపీఐ(ఎం) అభ్యర్థి మల్లికార్జున్ మాట్లాడుతూ.. తనను గెలిపిస్తే పటాన్‌చెరు పారిశ్రామిక ప్రాంత కార్మికులతో పాటు ప్రజలకు ఎల్లవేళలా అండగా ఉంటానని తెలిపారు. ఈ ప్రచారంలో నాయకులు కె.రాజయ్య, అతిమేల మాణిక్, ఎం.యాదగిరి, బి.నాగేశ్వరరావు, పాండురంగారెడ్డి, అనంతరావు తదితరులు పాల్గొన్నారు.

డబ్బు సంచులతో వస్తున్న వారిని ఓడించండి

సీపీఐ(ఎం) మధిర అభ్యర్థి పాలడుగు భాస్కర్

నవతెలంగాణ-బోనకల్

డబ్బు సంచులతో వస్తున్న కాంగ్రెస్, బీఆర్ఎస్ అభ్యర్థులను ఓడించాలని సీపీఐ(ఎం) మధిర నియోజకవర్గం అభ్యర్థి పాలడుగు భాస్కర్ ఓటర్లను అభ్యర్థించారు. ఖమ్మం జిల్లా బోనకల్ మండలంలో పాలడుగు భాస్కర్ గురువారం విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఆయా గ్రామాల్లో సీపీఐ(ఎం) శ్రేణులు, ప్రజలు ఆయనకు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా జరిగిన సభల్లో భాస్కర్ మాట్లాడుతూ.. మధిర నియోజకవర్గ ప్రజలు అనేక సమస్యలతో సతమతమవుతున్నారన్నారు. తనను గెలిపించి అసెంబ్లీకి పంపిస్తే.. మధిర - బోనకల్ రోడ్డుకు వెంటనే మరమ్మతులు చేయిస్తానని, మధిర నియోజకవర్గంలో ఉన్న ఆయకట్టు చివర భూములకూ నాగార్జునసాగర్ నీటిని అందేలా కృషి చేస్తానని తెలిపారు. నిరుపయోగంగా ఉన్న జాలిముడి ప్రాజెక్టును ఉపయోగంలోకి తీసుకొస్తామన్నారు. బోనకల్‌లో తోళ్ల పరిశ్రమ, చింతకానిలో రైలు స్లీపర్ కోచ్ తయారీ ఫ్యాక్టరీ ఏర్పాటుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ముదిగొండ ప్రాంతంలో గ్రానైట్ పరిశ్రమల పరిరక్షణకై ఉద్యమిస్తామన్నారు. రేమిడిచర్లలో పరిశ్రమల కోసం కేటాయించిన 60 ఎకరాల భూమిని కాపాడటంతో పాటు పరిశ్రమ స్థాపనకు పోరాడతామని తెలిపారు. చొప్పకట్లపాలెం గ్రామానికి చెందిన బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకులు గుత్తా వెంకటేశ్వర్లు, షేక్ షాజహాన్.. సీపీఐ(ఎం)లో చేరారు. కార్యక్రమాల్లో పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు పొన్నం వెంకటేశ్వరరావు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు చింతలచెరువు కోటేశ్వరరావు, మండల కార్యదర్శి దొండపాటి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



హోం మంత్రిపై ఖమ్మం పోలీసులకు ఫిర్యాదు


సీఎం కేసీఆర్‌ను ఉమర్ ఫారూఖ్‌తో పోల్చినందుకు...

నవతెలంగాణ - ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి

కరీంనగర్‌లో బుధవారం నిర్వహించిన బీఆర్ఎస్ మైనార్టీ కార్యకర్తల సమావేశంలో హెూం శాఖ మంత్రి మహమూద్ అలీ చేసిన వ్యాఖ్యలు ముస్లిం మనోభావాలను దెబ్బతీసే విధంగా ఉన్నాయని తెలంగాణ ముస్లిం సంఘాల జాయింట్ యాక్షన్ కమిటీ గురువారం ఖమ్మం వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఖల్ఫాయే రాశి దీన్ గా భావించే ఉమర్ ఫారూఖ్ (రజియల్లాహు అను)ను కించపరిచేలా ఉన్నాయని ఆరోపించింది. బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, తెలంగాణ సీఎం కేసీఆర్‌ను ఉమర్ ఫారూఖ్‌తో పోల్చడం ముస్లిం మనోభావాలను దెబ్బతీయడమేనని ఫిర్యాదు చేశారు. ఇస్లాంపై అనుచిత వ్యాఖ్యలు చేసిన మంత్రి మహమూద్ అలీపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొంది.

పంచ్ తంత్రం!

సర్పంచు సరుకెంతో సరియైనలెక్కేయి
లక్షయనునో పదిలక్షలనునో
ఎంపీటీసీకెంత ఎవ్వారమున్నదో
కాంట్రాక్టులిప్పిస్తే కరుగునేమో
జడ్పీటీసీ ఎటు పెడమర్ల చూడొద్దు
మండలాధ్యక్షుండు ఉండు మనకు
పదవేది లేనోడు పైరవీకారుండు
బ్రోకరేషము వేసి బ్రతికెటోడు
అందరిని కొనవలె వారి ఐసతెంట



అసలు అమ్ముడుపోనోన్ని అణచివేసి
నీతి అనుమాట అన్నోన్ని పాతిపెట్టి
ఎట్టు లైనను ఈ పోస్టు కొట్టవలెను

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.